


పరువు

గుత్తికొండ సుబ్బారావు + నేను @ 50

డా॥ జి. వి. పూర్ణచందు

పరువు

గుత్తికొండ సుబ్బారావు + నేను @ 50

డా॥ జి.వి. పూర్ణచందు



శ్రీమతి గుత్తికొండ రామరత్నం చారిటబుల్ ట్రస్ట్
ప్రచురణ

పరువు

గుత్తికొండ సుబ్బారావు, నేనూ @ 50

అవలోకన: డా॥ జి వి పూర్ణచందు

2023 నవంబరు, 23

వెల : అమూల్యం

ప్రచురణ :

శ్రీమతి గుత్తికొండ రామరత్నం చారిటబుల్ ట్రస్ట్

మచిలీపట్టణం

ప్రతులకు :

శ్రీమతి గుత్తికొండ రామరత్నం చారిటబుల్ ట్రస్ట్

గృహప్రియ ఫుడ్స్, 24-388,

రామానాయుడు పేట

మచిలీపట్టణం 521001.

మొబైల్ : 9440167697

డిజైన్ :

విజేత గ్రాఫిక్స్, విజయవాడ.

మొబైల్ : 9848687652

ముద్రణ :

విజయసాయి ప్రింటర్స్,

విజయవాడ.

అంకితం



శ్రీమతి గుత్తికొండ రామరత్నం

అక్కా!

సుబ్బారావు, నువ్వూ నేనూ మనం ముగ్గురం

ఇప్పుడు నువ్వు లేవు,

నీ జ్ఞాపకాలే స్ఫూర్తినిస్తున్నాయి!

నీ అమృత వాక్యాలే ముందుకు నడిపిస్తున్నాయి!

అందరికోసమే మనం అనేదానివి...

అందరితోనూ మనం అని చెప్పేదానివి...

అందుకే ఈ అంకితం !

- తమ్ముడు పూర్ణచందు

భాషోద్యమం 'పరువు' నిలిపిన ఈ ఇద్దరూ...

- ***డా॥ మండలి బుద్ధప్రసాద్,***

గౌరవాధ్యక్షులు, కృష్ణాజిల్లా రచయితల సంఘం

'సభాయ నమః' అంటూ సభకు నమస్కరిస్తాం మనం.

"సభా కల్పతరుం వందే వేద శాఖోపజీవినం/శాస్త్రపుష్ప సమాయుక్తం విద్వద్భ్రమర శోభితం" వేదాలనే కొమ్మలతో, శాస్త్రాలనే పుష్పాలతో, విద్వాంసులనే తుమ్మెదలతో ప్రకాశించే 'సభ' అనే కల్పవృక్షానికి నమస్కరించాడు వేద కాలంనాటి మానవుడు. సభ పవిత్రతని చాటుతోందీ ప్రార్థన.

సభ అనేది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కట్టుబడిన ఒక వ్యవస్థ. నూరు యజ్ఞాలంత పుణ్యకార్యం. మీటింగ్ అంటే కేవలం కలయికే! కానీ, సభ వలన సమాజమూ, వ్యక్తులూ మర్యాదా పురుషోత్తములౌతారు. దాని పవిత్రతని నిలబెట్టే బాధ్యత అందరిదీ!

జ్ఞానమూర్తులు ఒక్కరు కూడా లేకపోతే, ఎంత పెద్ద సభ అయినా అది గొప్ప సభ అనిపించుకోదు. జ్ఞానవంతులైన సభాసదులు ఒకరినొకరు ప్రభావితం చేస్తూ, ఒకరివలన ఇంకొకరు ప్రకాస్తి పొందేలా నడిచిందే అసలైన సభ అని ఆర్యోక్తి.

ఒకసారి గొప్ప వేదపండితులు పాల్గొన్న మహాసభకు ఓ ధనికుడు వచ్చాడు. ఆయనకు పెద్ద పీట వేసి కూర్చోపెట్టి ఆయన్ని పొగడటంతో సరిపోయింది. అంతటి పండితుల రాకను నిర్వాహకులు సద్వినియోగ పరచుకోలేకపోయారు. ఇప్పటి రోజుల్లో అయితే ఇలాంటివి మరీ ఎక్కువగా జరుగుతున్నాయి.

సభలోని పవిత్రత, నిబద్ధత, నిజాయితీ అనేవి మరుగున పడిపోవటం వలన సమాజం చైతన్యహీనమై వెనుకబాటుతనాన్ని వెదుక్కుంటుంది. ***'యత్ర ధర్మోహ్యధర్మేణ! సత్యం యానృతేన చ/హన్యతే ప్రేక్షమానానాం!హతా స్తత్ర సభాసదః'***– "ఏ సభలో ధర్మాన్ని అధర్మం, సత్యాన్ని అసత్యం దెబ్బతీస్తాయో ఆ సభలో పాల్గొన్నవారంతా

జీవన్మృతులతో సమానమే” ఈ వాక్యం చదివాకయినా సభా మర్యాదలను కాపాడటం గురించి నిర్వాహకులు, సభాసదులు కూడా శ్రద్ధపెట్టాల్సిన అవసరాన్ని గుర్తించాలి.

కార్యకర్త కాదలచుకున్నవ్యక్తి సభ ప్రతిష్ఠను కాపాడతానని, సభ సార్వ భౌమాధికారాన్ని నిలబెడతానని, సభామర్యాదలు పాటిస్తానని అంతఃకరణ శుద్ధిగా ప్రమాణం చెయ్యాలి. లేకపోతే ఆ సభకు వచ్చిన వారంతా జీవన్మృతులౌతారు.

గుత్తికొండ సుబ్బారావు, పూర్ణచందు కలిసి సాగించిన సాహితీ యానంలో పదేపదే పాటించే నియమమే ఇది! సభామర్యాదను మనం నిలబెట్ట లేకపోతే సభా సరస్వతి అవమానం పొందుతుంది. ఈ సత్యాన్ని చాటిచెప్పటమే ఈ పుస్తకం పరమ ప్రయోజనం.

ఈ ఇద్దరూ పాలూ తేనెలాంటి తత్త్వం ఉన్నవాళ్లు. చాలా కార్యక్రమాలు చెయ్యాలని వీళ్ల లాగే నాకూ ఆలోచనలున్నాయి. నాకు ఏదైనా మనసుకు తట్టగానే ఈ ఇద్దరికీ చెప్తాను. తెల్లారేసరికి దాని పథక రచనతో వాళ్లు ముందుకొస్తారు. చెప్పగానే ‘చేశాం’ అనగల సత్తా వాళ్లిద్దరిదీ! వీరిద్దరి సాన్నిహిత్యం నాకు లభించబట్టే ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లాంటి భారీ కార్యక్రమాలు, వజ్రభారతి, కృష్ణాజిల్లా సర్వస్వం, తెలుగు పసిడి, తెలుగు వ్యాసమండలి, తెలుగు మణిదీపాల్లాంటి బృహద్గ్రంథాల ప్రచురణలు సాధ్యం అయ్యాయి.

పరువు అంటే ప్రతిష్ఠ, వేగం, పరిపక్వత. ఈ మూడు గుణాలూ పుణికి పుచ్చుకున్న ఈ ఇద్దరిదీ ఒకే మనసు, ఒకే ఆదర్శం, ఒకే ఆచరణ. తెలుగుతల్లి మెడలో మెరిసే మధ్యమణిలా కృష్ణాజిల్లా రచయితల సంఘాన్ని తీర్చిదిద్దిన సుబ్బారావుగారిని, పూర్ణచందునీ నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఈ ‘పరువు’ తెలుగు భాషోద్యమం పరువే! దాన్ని బరువు మోసేందుకు ఈ ఇద్దరికీ మరింత ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. అభినందిస్తున్నాను.

◆ ◆ ◆

పరువు

గుత్తికొండ సుబ్బారావు + నేను 50

డా॥ జి. వి. పూర్ణచందు

"పరువెత్తు కోయిల పాటవోలె వెల్లువలై పారు వెలది
వెన్నెలలోన మునిగిపోయిన మబ్బుతునకవోలె
చిరుత తొలకరివానగా చిన్ని సొనగ
పొంగి పొరలెడు కాల్వగా నింగి కెగయు కడలిగా
పిల్లగ్రోవిని వెడలు వింత తీయదనముల లీనమైపోయె ఎడద.

కృష్ణశాస్త్రిగారు తనగురించే పాడుకున్నారంటారు గానీ, ఈ పాటలోని ప్రతీ అక్షరం నిత్యపథికుడనదగిన వారందరికీ వర్తిస్తుంది. నిరంతర పాంథుడికి పరువే (వేగం) ముఖ్యం. కోయిల పాటైనా, వెన్నెలతేటయినా, పొంగిపొరలే రాతయినా పరువు పరువున పోయే ఎడద ఎవరి కున్నదో వారందరికీ పరువే ముఖ్యం. కృష్ణశాస్త్రి పరువుపాట పరుగుబాటలో ఉన్న గుత్తికొండసుబ్బారావుకు నాకూ అచ్చంగా సరి పోలుతుంది. 50 యేళ్ల మా ఇద్దరి సాన్నిహిత్యంలో నిలబడి నీళ్లు కూడా తాగని పరువులే ఎక్కువ.

పరువే లక్షణంగా పయనించే తెరువరి సుబ్బారావు గురించి ఎంతయినా తెలిసిన నాకు మా ఇద్దరి ఈ స్నేహ స్వర్ణోత్సవ సమయంలో కృష్ణశాస్త్రి పాట గుర్తుకు రావటం సహజం.

ఇప్పుడు సుబ్బారావుకి 78యేళ్లు ! అయినా, "సముద్రాలు దాటి, ఉన్నత శిఖరాగ్రాలు చేరి క్రిందు మీదెరుగకుండా పక్షిలాగా రెక్కలు దాలుస్తుంది"... ఇప్పటికీ అతని మనసు! సుబ్బారావు జీవశక్తికి సాహిత్య సభలే ఎరువు.

"పరువు పరువున పోవు నెదతో పరువు లెత్తితి మరచి, మేనే మరచి సర్వము నన్ను నేనే మరచి" అన్నట్టుగా ఇతర పనులన్నీ మరిచి, తదేకధ్యానంగా నిరంతర సాహితీ సేవలో మునిగి, ఒకటి ముగియగానే ఇంకో కార్యక్రమాన్ని వెలిగిస్తాడే తప్ప ఒకింత విశ్రమిద్దాం అనడు, అననివ్వడు. ఒకతేనెటీగలా తేనెని ప్రోది చేస్తాడేగానీ, దానితో ఉపలబ్ధి పొందాలనే ఆలోచన లేని శ్రమజీవి అతను. ఎల్లకాలం ఇచ్చిన చెయ్యిగానే నిలిచాడు తప్ప ఏనాడు పుచ్చుకోవటం ఎరగనివాడు.

అచ్చంగా ఇవే అలవాట్లున్న వారితోనే అతను కలుస్తాడు. లేనివారిని కానివారిగా భావించి "గ్రక్కున విడువంగ వలయు" అనికూడా చెప్తాడు

పరువుపరువున పోయే సుబ్బారావుకి పరుగే పరువు! సుబ్బారావు భోజనం చేసే విధానం దగ్గరనుంచి కార్యక్రమ నిర్వహణ వరకూ అన్నీ పరుగే పరుగులా ఉంటాయి. ఒక్కవిషయంలో మాత్రమే ఆయన చాలా నిదానం. అదే పెరిగే ఆయన వయసు విషయంలో!

1975లో స్పందన సాహితీ సమాఖ్య పక్షాన కృష్ణాజిల్లా రచయితల మహా సభలు నిర్వహించినప్పుడు ఎలా పరువులెత్తిస్తూ పనిచేశాడో 2022 డిసెంబరాఖర్న 5వ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలోనూ అంతే పరువులెత్తుతూ పనిచేశాడు.

వయసు ఆయన విషయంలో కొంచెం నిదానమే! ఏడేళ్ళక్రితం, సుబ్బారావు గురించి గమనించిందంతా గమనం పేరుతో ఒక పుస్తకంగా రాశాను. అప్పుడు ఆయనకు 70 యేళ్లొచ్చిన సందర్భంగా సప్తతి కానుక అది! ఈ సందర్భం వేరు. మా స్నేహానికి 50 యేళ్లొచ్చాయిప్పుడు. క్రికెట్టాడేవాళ్లు pitch మీద చెరో బ్యాట్స్‌మన్ నిలబడి ఆడినట్టే, ఈ యాభైయేళ్ల కాలంలో మా ఇద్దరి పరుగుల్లో సెంచరీలే ఎక్కువ. నడక నాకు నేర్పిన గురువులు అనేకులు. కానీ, పరుగు నేర్పింది సుబ్బారావే!

పరువంటే పరుగు, పరిపక్వత, గౌరవం, వ్యాపించటం కూడా! సుబ్బారావంటే వేగం. సుబ్బారావంటే పరిపక్వత, సుబ్బారావంటే గౌరవం. ఈ ముప్పేట మణిహారం తెలుగు సాహితీ లోకానికి గుత్తికొండ సుబ్బారావు. అతనితో కలిసి సాహితీ సుదీర్ఘ యానం చేసే భాగ్యం నాకు కలగటం విశేషమే! అన్నీ అలా కలిసొచ్చాయంతే! ఆ వైనాలు చెప్పుకోవాల్సినవి చాలా ఉన్నాయి.

"శ్రీ గుత్తికొండ సుబ్బారావు, శ్రీ జి. వి పూర్ణచందు ఒక విడదీయరాని ద్వంద్వ సమాసం. కృష్ణాజిల్లా రచయితల సంఘం కార్యనిర్వాహకులుగా, అనేక మహాసభలను అవలీలగా నిర్వహించిన కార్యసాధకులుగా, బృహద్గ్రంథముద్రాపకులుగా ఇప్పుడందరికీ తెలుసు. ఆనాడు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి పెద్దల నెదిరించి పోటీలో నిలిచి గెలిచినవారు. కార్యదక్షతతోపాటు ఆత్మీయతను పంచడంలో కూడా అసమానులు. ఇంచుమించుగా పరిచయం అయిన నాటినుండి వారి ప్రతి సభలో, ప్రతి గ్రంథంలో నేను ఉన్నాను" అంటూ, ఆచార్య వెలుదండ నిత్యానందరావు మా ఇద్దరినీ ద్వంద్వ సమాసంగా భావించారు. భాషాభిమానులైన పెద్దలెందరో ఇలా మా ఇద్దరినీ కలిపే ఆశీర్వదించటం ఆనందకరమే.

ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ నా సాహిత్యంపై మూడు రోజుల అధ్యయన సదస్సు జరిపినప్పుడు పాల్గొన్న 70 మంది ప్రముఖుల్లో కనీసం 60 మంది సుబ్బారావుని కూడా తలచుకున్నారు. మా ఇద్దరి జమిలిచేతల్ని దగ్గరగా గమనించిన పెద్దలెవరైనా మమ్మల్ని విడదీసి చూట్టానికి ఇష్టపడరని అర్థం అయ్యింది. అందుకే, ఆ పరిశోధనాపత్రాల పుస్తకాన్ని పూర్ణచంద్రోదయం అని నామకరణం ఛేసి, సుబ్బారావుకు అంకితం చేశాను.

పువ్వాడ వారి ఆశీస్సులు

కీ.శే. పువ్వాడ తిక్కన సోమయాజిగారు సుబ్బారావుతో కలిసి మచిలీపట్టణం యల్.ఐ.సీలో పనిచేసిన సహోద్యోగి. కవిపాదుషా పువ్వాడ శేషగిరిరావుగారి తనయులు. వారు స్పందన సాహితీ సమాఖ్య అధ్యక్షులుగా, సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాలంలోనే స్పందనవాణి పత్రికను నడిపించారు. ఎంత గొప్ప కవో అంత అమృతమయంగా పద్యాన్ని పాడి అలరింపచేయగల దిట్ట.

నేను రాసిన సుబ్బారావు జీవనయానం 'గమనం' పుస్తకంలో ఆయన సుబ్బారావు గురించి ఇలా రాశారు: "సాహిత్యం అతని ఊపిరి, సాహిత్యం శరీరం. సాహితీవేత్తలు అతనికి ప్రాణం. అనేక సాహిత్య సంస్థలకు పురుడుపోసి కండ బలం ఇచ్చిన సృష్టికర్త. భాషా యోషకు క్రొత్త అందాలు దిద్దిన కార్యశీలి. అక్షరాలు క్షరం కాకుండా అచ్చొత్తియజేసిన 'స్పందన' కలవాడు. 'మనిషి కోసం' పరిశ్రమిస్తూ కవులను రచయితలను గ్రంథకర్తలను చేసిన ప్రచురణకర్త. ఉద్యోగం సామాన్యమైనదే అయినా ఊరంతా ఏలగల నాయకత్వ లక్షణాలు పిన్న వయస్సులోనే ఏర్పడటం ఆయనలో ఒక అరుదైన లక్షణం. పలుకు తీరులో సత్యవాదిత్వపు పదును ఎక్కువనిపించుకున్నా నిష్పక్షపాతిగా నిలబడగల తీర్పరుడు. బహుముఖీనమైన దృష్టికోణాలతో వైవిధ్యపు మార్గానుయాయుల్ని ఏకత్రాటికి తెచ్చి ఏకోన్ముఖత చేకూర్చగలగటమూ అరుదే!" అని! సోమయాజిగారే పూర్ణచంద్రోదయం పుస్తకంలో ఇలా రాశారు:

"పూర్ణచంద్ అంటే విహారి – గుత్తికొండలతో కలిసిన త్రిశక్తి పీఠంలో ఒకరు. పూర్ణచంద్ అంటే కృష్ణాజిల్లా రచయితల సంఘం, జాతీయ రచయితల మహాసభా సంరంభం. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల వైభవం. ఆపై ప్రపంచ తెలుగు రచయితల సంఘం మహాసభలు నభూతో నభవిష్యతి. పూర్ణచంద్ అంటే – తెలుగు భాషోద్యమ గర్జారావం... తెలుగుకు ప్రాచీనతా యోగం కల్పించిన అనేక ఉద్యమాలు; రూపొందిన గ్రంథాలు; బృందాలు, సుగంధాలు. పూర్ణచంద్ అంటే –

వజ్రభారతి/తెలుగు పసిడి/కృష్ణాజిల్లా సర్వస్వం/తెలుగు మణిదీపాలు/తెలుగు పున్నమి/ కృష్ణాతీరం –చరిత్ర – సంస్కృతి – సమాజం/విశ్వనాథ/సినారె/వగైరా వగైరా – ఆంధ్ర సరస్వతి మణిమంజీర ఘలంఘలలు.

పూర్ణచంద్ అంటే, విహారి గుత్తికొండలతో కలిసిన తెలుగు అనే మూడక్షరాల మువ్వన్నెల జెండా– ఆ తెలుగు రథాన్ని నడిపించటానికై ఉద్యమిస్తూ, గాండీవమ్ము ధరించు ఫల్గుణుడు గౌ. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారున్ను, నిమిత్తమాత్రుడనంటూనే చక్రం చేపట్టే సూత్రధారి గౌ. శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారున్నూ–అని మరచిపోలేము కూడా. నరనారాయణుల ప్రతిరూపాలు వారు" అంటూ రాసిన వాక్యాలు నన్ను చరితార్థుణ్ణి చేశాయని భావిస్తాను.

'కూరుపు నేరుపు నోరుపు
భూరి యశమ్మిడెను నీకు పూర్ణశశాంకా!
నీ రచనల వైవిధ్యము
భారతికిన్ విడువ ముడువ పటు పుట్టమ్ముల్ !'

'తెలుగుం దల్లికి నక్షరార్చన మొనర్తు ! నీదు పొత్తమ్ములన్
పలుకుం బచ్చల చంద్రహారగత దీవ్యద్ వ్యాసభూషాసుకౌ
శల సంపాదక సేవకుండ వయతే సందేహమే లేదు! నిన్
పలుకుం జేడియ సృష్టి జేసెను సఖా! బ్రహ్మయ్య ఓహో యనన్ !

అని ఆయన తన అమృతవాక్కులతో నన్ను ఆశీర్వదించారు. ఇలా ఎందరో ఆశీస్సులకు కీలకం సుబ్బారావే! అతనివల్లనే ఇదంతా సాధ్యం అనేది నా వినమ్రపూర్వక భావన.

సుబ్బారావుతో పరిచయం

1974లో ఇంటర్మీడియట్ పూర్తయి, వైద్యవిద్యలో అప్పుడే చేరాను. నగ్నమునిగారి తమ్ముడు రామ్మోహనరావుగారు, ఆయన చాలా పెద్దాయన, కో ఆపరేటివ్ శాఖలో పనిచేసేవారు, కుర్రాణ్ణయినా నన్ను చేరదీసి, సాహిత్య సంగతులెన్నో చెప్తూ ఉండేవారు. నాలో పెద్దచెట్టుగా ఎదిగే మర్రిగింజలనే సాహిత్య బీజాలు నాటింది ఆయనే! తన స్నేహితుడు బందరువాసి, భ్రమరగీతని తెలుగు చేసిన కవి శ్రీ యద్దనపూడి గోపీకృష్ణప్రసాద్‌తో కలిసి ఆయన ఒకరోజు మా ఇంటికి వచ్చారు. బందరులో సాహిత్య సభ జరుగుతోందని పిలిచారు. ఆ సభకు బందరు వెళ్ళాను. అదిగో అక్కడ 50 యేళ్ళ క్రితం సుబ్బారావు, విహారి, శాలివాహన, బూదరాజు శ్యాంసుందర్, పువ్వాడ తిక్కన సోమయాజి వగైరా వగైరా మహానుభావులతో పరిచయ భాగ్యం కలిగింది.

వాళ్ల వయసుతోనూ పాండిత్యంతోనూ పోలిస్తే నేను నూనూగు మీసాల బాలచంద్రుణ్ణి. వాళ్లను చూస్తూ నేను ఎదిగాను. వాళ్ల దారుల్లో నేను ప్రయాణించాను. వాళ్ల అడుగుల్లో అడుగులేస్తూనే సాగుతున్నాను.

విహారి, సుబ్బారావు గార్లతో సాన్నిహిత్యమే లేకపోతే పూర్ణచందనే ఒక రచయిత ఈ నాటికీ నెలబాలుడిగానే ఉండేవాడు. సాహితీ పూర్ణచంద్రోదయం జరిగి ఉండేదే కాదు. నా ఎదుగుదల చాలా వేగంగా జరిగిందనే అనుకుంటాను. చిన్నవయసులోనే నేను ఒకేసారి అనేక పత్రికల్లో ఫీచర్లు రాయగలిగాను. పెద్దలతో సాహచర్యం వలన పొందిన జ్ఞానమే బహుముఖీనంగా ఎదిగేందుకు నాకు తోడ్పడింది.

సుబ్బారావూ, విహారి గార్లతో ఒకే క్షణాన పరిచయం అయ్యింది కాబట్టి, వారిద్దరితో నా అనుబంధానికి స్వర్ణోత్సవం ఇది. ఆ రోజుల్లో ధార్వార్, బొంబాయి లాంటి సుదూర ప్రాంతలకు విహారిగారు ఉద్యోగరీత్యా వెళ్ళటం వలన పోస్టుకార్డులే మార్గదర్శనాలయ్యాయి. నేను బెజవాడకి, సుబ్బారావు బందరుకి పరిమితం కావటాన ఒకరు కో అని పిలిస్తే ఇంకొకళ్లం ఓ అని పలికే వాళ్లం. తరచూ కలిసే అవకాశం సుబ్బారావుకూ నాకూ ఉండటంతో ఇద్దరం కలిసి ఒకే పడవమీద తోపిడిగడ వేసుకుని ప్రయాణించే అవకాశం చిక్కింది.

ఈ నాటికీ ఏదైనా ముఖ్యమైన రచన చేస్తే విహారి గారికి చదివి వినిపించటం నాకు ఒక అలవాటు. ఆయన చెప్పిన మార్పుల్ని తూ.చ. తప్పకుండా చేయటం నా విధి. నిన్ననో మొన్ననో విహారిగారు ఫోన్లో మాట్లాడుతూ, "ప్రాచీన కావ్యాలకు ఈ 21వ శతాబ్దపు సమాజానుగుణమైన వ్యాఖ్యానం చేయాల్సిన అవసరం ఉంది. నువ్వు ఆ దారిలో ఉన్నావు కదా…అలాంటిదేదైనా తక్షణం ప్రారంభించు" అనే ఆదేశం ఇచ్చారు. శిష్యుడి ప్రతిభాపాండిత్యాలు తల్లిదండ్రులకన్నా, భార్యా, బిడ్డలకన్నా గురువులకే ఎక్కువ తెలుస్తాయి.

గుత్తికొండ బంగారు కొండ

ఆచార్య యన్ గోపీగారు సుబ్బారావు గురించి రాస్తూ, "ఎప్పటి గుత్తికొండ! ఇప్పటికీ బంగారు కొండ!! గలగలా కృష్ణమ్మ. కానీ అతని వాసి మొదలైంది మాత్రం మూసీ ఒడ్డున. భాగ్యనగరంలో అతడున్నది మూడేళ్లే (1967–70) కానీ త్రివిక్రమ మూర్తికి పాదులు పడిందక్కడే!" అన్నారు. "గుత్తికొండ పుట్టుకతోనే సాహితీ శీలి. నిర్వహణ వేత్త. మచిలీపట్టణం సముద్రతీరంలో అలలతో కూడా సభ పెట్టగలడు. మిత్రులను ప్రేమించటంలో అతని తర్వాతే ఎవరైనా! భోళా మనిషి. గాలికున్నంత చైతన్యం. ఇప్పుడు కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా విశ్వస్థాయి కార్యక్రమాలు చేశాడు. చేస్తున్నాడు. కార్యదర్శి డా॥ జి వి పూర్ణచందు కృష్ణార్జునుల్లా కుదిరింది వీరి

జంట. అయితే వీరిలో ఎవరు కృష్ణుడో ఎవరు అర్జునుడో తెల్సుకోవలసింది వారిద్దరే. మండలి బుద్ధప్రసాద్ వారి గొడుగు, వారికి సదా ముందడుగు. సాహిత్యానుబంధం రక్తసంబంధం కన్నా గొప్పది. అదొక భావయాత్ర. గుత్తికొండ తన అభిమానాన్ని ఎందరికో పంచాడు. అది ఇవాళ సమీకృతమై అతని చరిత్ర మీద ప్రేమవర్షం కురిపిస్తున్నది" అని ఎంతో ఆత్మీయంగా రాశారు.

సుబ్బారావు ప్రేమవర్షంలో ఎక్కువ తడిసిన నేను 50 యేళ్లుగా పొందిన అనుభూతుల్ని అనుభవాల్నీ పంచుకోవాలనేదే తపన.

బంగారు పళ్ళేనికైనా గోడచేర్పు కావాలి అన్నప్పుడు, సుబ్బారావు అనేక మంది రచయితలకు గోడచేర్పుగా ఉపయోగపడ్డాడనేది అంతరార్థం. కానీ, నేను సుబ్బారావుని గోడతో పోల్చను. ఆయనే స్వయంగా బంగారు పళ్లెం అంటాను. పంచభక్ష్య పరమాన్నాల్లా మేమెందరం ఉన్నా, తినేందుకు బంగారు పళ్లెం కావాలి కదా... ఆ పళ్ళెం సుబ్బారావని, నేను నా 'తరతరాల తెలుగు రుచులు' పుస్తకాన్ని సుబ్బారావుకి అంకితం ఇస్తూ రాశాను.

సుబ్బారావనే బంగారు పళ్లెం గగనమండలం లాంటిది. కృష్ణశాస్త్రి అన్నట్టు 'ప్రాభాతగగన పూర్వప్రాంగణం' అంటే, తూరుపు దిక్కున ఎర్రగా ప్రకాశించే ఉదయంపు ఉషస్సు లాంటి వాడని! అందులో వడ్డించిన చిరువడముల పాయసాన్ని నేను. "నా బ్రతుకు నేడు నందనచైత్రవనము" అనే కృష్ణశాస్త్రి పలుకులు నాకు వర్తిస్తాయి. పళ్లెమూ పాయసమూ పరస్పర ఆధారితాలు.

ప్రతీ విత్తనమూ అంకురిస్తుంది. ఆకాశం అంత ఎత్తున ఎదగాలని తలఎత్తి చూస్తుంది. ఆకాశానికీ ఆకర్షణ శక్తి ఉంది. అది ఆ అంకురాన్ని మొక్కలాగా, మహావృక్షంలాగా తనంత ఎత్తుకి ఎదిగేలా చేయాలని ఆకర్షిస్తుంది. పొగడ్త కోసం సుబ్బారావుని గగనమండలం అనటం లేదు. ఆయన నావిషయంలో అలాంటి ఆకాశాకర్షణ శక్తిని ప్రయోగించాడు. ఆ అంకురదశలో నాకు భూమ్యాకర్షణ శక్తి కలిగిన వారితో పరిచయం అయి ఉంటే, భూమిలోనే ఆగిపోయేవాణ్ణేమో!

సుబ్బారావుని బంగారుపళ్లెం అనటానికీ ఓ కారణం ఉంది. అయస్కాంతశక్తి కేవలం ఇనుప ముక్కల్ని మాత్రమే ఆకర్షిస్తుంది. కానీ బంగారానికున్న ఆకర్షణ శక్తి సమస్త మానవ లోకాన్నీ అక్కున జేర్చుకుంటుంది.

పరువంటే ప్రతిష్ట, వేగం, పరిపక్వత

వేగం ఎప్పుడు సమకూరుతుందంటే గట్టి సంకల్పసిద్ధి ఉన్నప్పుడే!

భాగవతంలో చెప్పిన అష్టాదశ సిద్ధుల్లో, తక్కిన వాటి సంగతి అలా ఉంచితే,

సంకల్పసిద్ధి, మనోజవసిద్ధి, అకుంఠితత్త్వసిద్ధి ఈ మూడూ దీక్షాదక్షులకి అప్రయత్నం గానే సంక్రమిస్తాయి. లౌకిక వ్యవహారాల్లో ఈ మూడింటి పాత్ర గురించి మనం చర్చించవలసింది చాలా ఉంది. సంకల్పసిద్ధినే మనోనిశ్చయం అంటాం. ఒకసారి నిశ్చయం చేశాక ఇంక "తాంబూలాలు ఇచ్చేశాను" అన్నంత కఠోరంగా కట్టుబడటం సంకల్పసిద్ధి. ఓ తెలుగు సినిమాలో నాయకుడు 'ఒకసారి కమిట్ అయితే నా మాట నేనే వినను' అంటాడే అది సంకల్పసిద్ధి.

సుబ్బారావు పోరాటయోధుడు. నిక్కమయిన మార్క్సిస్టు. దేన్నీ ఒకపట్టాన అంగీకరించడు. అంగీకరించాక పట్టు వదలడు. ఏ తపస్సు చేసి సాధించుకున్నాడో గానీ ఈ సంకల్ప సిద్ధి అతనికి జన్మతః సంక్రమించిన వరం. మళ్ళీ వరం అంటే ఏ దేవుడో ఇచ్చాడనే అర్థం వస్తుంది. దాన్ని సుబ్బారావు ఎంతవరకూ అంగీకరిస్తాడో చెప్పలేను. అతని పుట్టుకతోనే ఈ లక్షణం సంక్రమించిందని మాత్రం చెప్పగలను.

"ఫలానా వారమ్మాయి రమను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను" అని తాను ఒక నిశ్చయానికొచ్చినట్టు ఇంట్లో చెప్పాడు. అంతే! ఎవరెంత మల్లగుల్లాలు పడ్డారో ఎవరు అవునన్నారో ఎవరు కాదన్నారో అతనికి తెలీదు. తెలిసినా పట్టించు కోలేదు. సంకల్పించినట్టు జరగాలి. అంతే! అలానే జరుగుతుంది. అలానే జరిగింది!

సంకల్పం అంటే గట్టిగా అనుకోవటం. ఎవరైనా కార్యకర్తగా రాణించాలంటే ఏం చెయ్యాలో మీ అనుభవం మీద చెప్పమని అడిగితే సుబ్బారావు చెప్పింది ఇది: "మొదట వీటిని చేయాలని కొన్ని ప్రాజెక్టులను అనుకోండి. అనుకుంటే చాలా... అనకండి! అనుకోకపోతే సాధించేదేం ఉండదు. అందుకని అనుకోండి. ఆ అనుకొనేదేదో గట్టిగా అనుకోండి. తిరుగులేనంత గట్టిగా అనుకోండి. అనుకోవటంలోనే ఉంది సృష్టి రహస్యం అంతా. ఘనకార్యాలు చేయాలనే గట్టి తపన ఉన్నవాడికే ఈ అనుకోవటం సాధ్యపడ్తుంది" అని!

మనకంటూ ఏ వాణిజ్య సంస్థలో, రియల్ ఎస్టేట్ సంస్థలో, పెద్ద కంపెనీలో వెనకాల లేకపోయినా, ప్రభుత్వ అండ లేకపోయినా, ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణ కేవలం 'అనుకోవటం' వలనే సాధ్యం అయ్యింది. అనుకున్నప్పుడు, ఆ అనుకొన్నదాని వెనక భాషోద్యమ ప్రయోజనం ఉంది కాబట్టే నలుమూలల్నుండీ సహకారాలు సమకూరాయి. మన అక్కౌంట్లో బ్యాలెన్స్ లేకపోయినా, సంకల్పసిద్ధి ఉండి సంకల్పిస్తే విజయం ఖాయం. సంకల్పం మనసుకు సంబంధించిన విషయం. సంకల్పించాక అమలు వేగంగా జరగాలి.

మనోజవం అనే మాట చాలా ప్రసిద్ధి. జవము అంటే వేగం. మనసులా వేగంగా పనిచేయగలది మనోజవం. సంకల్పసిద్ధి నెరవేరాలంటే సంకల్పించినవాడికి

వేగంగా కదిలే మనోజవం ఉండాలి. 'ఎప్పటికైనా జీవితంలో ఫలానాది పొందాలను కుంటాను' అంటే కుదరదు. "ఇప్పటికిప్పుడే" అంటూ నిలబడి చెప్పులు తొడుక్కునే వాడే మనోజవుడు. సుబ్బారావు నుండి ఆ గుణాన్ని నేను పొందాను.

శ్రీ బుద్ధప్రసాద్‌తో మా అనుబంధం

1979లో ఒకసారి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అకస్మాత్తుగా బందరు యల్.ఐ.సీ ఆఫీసుకు వెళ్లారు. విడియాల చంద్రశేఖరరావు గారు ఆయనకు తెలుసు. ఆయన్ని కలిసి ఇక్కడ గుత్తికొండ సుబ్బారావు అనే ఆయన పనిచేస్తున్నారా? అనడిగారు. "ఆయన మా యూనియన్ లీడరు" అన్నారు చంద్రశేఖరరావుగారు. 'యూనియన్ లీడర్ సుబ్బారావు కాదు రచయిత సుబ్బారావు కావాలి' అన్నారు శ్రీ బుద్ధప్రసాద్. అప్పుడాయన ఆ సుబ్బారావూ ఈ సుబ్బారావూ ఒకరేనంటూ ఆయన సీటు దగ్గరికి తీసుకెళ్ళారు. అప్పట్లో విడియాలవారు, సింగరాజు రామచంద్రమూర్తి, లంక సుందరరామయ్య, విహారి, శాలివాహన, పువ్వాడ తిక్కన సోమయాజి, గుడిసేవ సుందరరామయ్య ఇలాంటి హేమా హేమీలంతా బందరు యల్.ఐ.సీ డివిజనల్ ఆఫీసులో వివిధ హోదాల్లో పనిచేసేవాళ్లు. వీళ్ళంతా కలిసి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న లలిత కళాసమితికి చాలా విఖ్యాతి ఉండేది.

బుద్ధప్రసాదుగారు మంత్రిగారి కొడుకునంటూ గన్మెన్లని వెనకేసుకుని కారుల్లో తిరిగినవాడు కాదు. ఎక్కడికైనా నడిచే వెళ్లేవారు. విజయవాడ వచ్చినప్పుడు మేమిద్దరం తప్పక కలిసేవాళ్లం. ఇద్దరం నడుచుకుంటూ బస్టాండుకు వెళ్లి ఆయన్ని బస్సెక్కించి నేను ఇంటికి వెళ్లేవాణ్ణి. మంత్రిగా ఉండి స్వంతకారు లేకుండా ఆర్టీసీ బస్సులో కండక్టర్ పక్క సీట్లో కూర్చుని ప్రయాణించిన తండ్రికి పుట్టిన బిడ్డ బుద్ధప్రసాద్. తండ్రి అడుగుజాడల్లోనే ఈనాటికీ నడుస్తున్న సిసలైన గాంధేయవాది!

స్పందన సాహితీ సమాఖ్య పక్షాన 1975లో మేము జరిపిన 4వ కృష్ణాజిల్లా రచయితల మహాసభల ప్రత్యేక సంచికని బుద్ధప్రసాద్ చూశారట. ఆ సభలు జరిగినప్పుడు ఆయన హైదరాబాదులో కాలేజీ విద్యలో ఉన్నారు. అందుకని వాటిలో పాల్గొనలేకపోయారు. ఆ ప్రత్యేక సంచికని చూశాక అవనిగడ్డలో కూడా కృష్ణాజిల్లా రచయితల మహాసభలు నిర్వహిస్తే బావుణ్ణనే ఆలోచన కలిగి, వెదుక్కొంటూ, సుబ్బారావు కోసం బందరు యల్.ఐ.సీ ఆఫీసుకు వచ్చారు. విడియాలవారి ద్వారా సుబ్బారావుని కలిసి, "అవనిగడ్డ గాంధీక్షేత్రంలో కృష్ణాజిల్లా రచయితల 5వ మహాసభలు నిర్వహించటానికి మీకేమైనా అభ్యంతరం ఉంటుందా?" అనడిగారు. ప్రోత్సహించే ఏరు కనిపిస్తే ఈదేందుకే ఈతగాడి మనసు ఉవ్విళ్ళూరుతుంది. కాదనటం ఎలా సాధ్యం? "తప్పకుండా" అన్నాడు.

"త్వరలో ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభలు నిర్వహిస్తున్నాము. దాని ఆహ్వానాలు అచ్చులో ఉన్నాయి. అవగానే మీకు పంపుతాను. మీరు తప్పకుండా రండి" అన్నాడు సుబ్బారావు. 1979లో బందరు టౌన్ హాల్లో ఆంధ్రపదేశ్ సాహిత్య అకాడెమీ సహకారంతో స్పందన సాహితీ సమాఖ్య నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభలకు శ్రీ బుద్ధప్రసాద్ వచ్చారు కూడా!

శ్రీ బుద్ధప్రసాద్ వ్యక్తిగతంగా సాహితీ సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. అనేక ఉద్యమాలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగా కూడా సహకరించేవారు. ఆ రోజుల్లో మినీకవిత ఉద్యమం అంకురస్థాయిలో ఉంది. నేను ఊరూరా మినీకవితా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుండేవాణ్ణి. మొదటి ప్రదర్శనను విజయవాడలో అద్దేపల్లి చేతుల్తో ప్రారంభింపచేసాడు సుబ్బారావు. రెండో ప్రదర్శనను మచిలీపట్టణంలో సుబ్బారావు, రావిరంగారావు ఏర్పాటు చేశారు. దానిగురించి విని విజయవాడ వచ్చి నన్ను కలిసి మూడో ప్రదర్శన అవనిగడ్డలో గాంధీక్షేత్రంలో ఏర్పాటు చేసారు బుద్ధప్రసాద్. తనకు వీలైనప్పుడల్లా సాహిత్యపరమైన కార్యక్రమాలు గాంధీక్షేత్రంలో నిర్వహిస్తూ ఉండేవారు. సి.నా.రె, దాశరథి ప్రభృతులంతా ఆయన సమావేశాలకు వచ్చినవారే!

అలా ప్రారంభమైన బుద్ధప్రసాద్ గారితో మా పరిచయం ఈ నాటికీ పవిత్ర బంధంగా కొనసాగుతోంది. బుద్ధప్రసాద్, సుబ్బారావు, పూర్ణచందు ఈ త్రివేణీ సంగమం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

విహారిగారు సుబ్బారావుకన్నా ఐదేళ్లు పెద్ద. సుబ్బారావు నాకన్నా పదేళ్లు పెద్ద. బుద్ధప్రసాద్ గారు నాకన్నా ఒక సంవత్సరం, లక్ష్మీప్రసాద్ గారు నాలుగేళ్లు పెద్ద. మా మధ్య వయసు పరంగా ఇంత వ్యత్యాసం ఉన్నా, ఆలోచనల పరంగా జెనరేషన్ గ్యాప్ ఎప్పుడూ లేదు. మా అందరికన్నా ఎంతో పెద్దవాడైనా, విహారి గారు మాకన్నా ఆధునికంగా ఆలోచిస్తారు. అదే మా ఐక్యతకు కారణం.

బుద్ధప్రసాద్ గారి ఆహ్వానం మేరకు అవనిగడ్డలో కృష్ణాజిల్లా రచయితల మహాసభల నిర్వహణకు సిద్ధం అయ్యాం. 1982 జూలై 10, 11 లలో అవనిగడ్డ గాంధీక్షేత్రంలో కృష్ణాజిల్లా రచయితల 5వ మహాసభలు జరిగాయి. మండలి వేంకట కృష్ణారావుగారు, యం.ఆర్.అప్పారావుగారి లాంటి ప్రసిద్ధులతో కలిసి సుబ్బారావు, నేనూ పనిచేయటం అపూర్వ అనుభూతి.

అప్పటికి బుద్ధప్రసాదుగారూ, నేనూ ఇద్దరమూ అవివాహితులమే! పెళ్లికాని కుర్రాళ్ళం కాబట్టి రాత్రింబవళ్ళూ పనిచేసే అవకాశం మాకుండేది. విజయవాడ విద్యాధరపురంలో నేను ఆసుపత్రి పారంభించి అప్పటికి మూణ్ణెల్లే అయ్యింది. వెంటనే సభల పనికూడా మీద పడింది. దేని దోవ దాందే అన్నట్టుగా రెండు బాధ్యతలకూ

న్యాయం చేయటానికి అలవాటు పడసాగాను. మైత్రేయగారని ప్రసిద్ధ నటుడు, నాటక రచయిత, ప్రయోక్త. ఆయన విద్యాధరపురం నివాసి. అక్కడ రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తి. సీనియర్ కామ్రేడ్లలో ఒకడు. ఆయన వలనే నా వైద్యవృత్తిని విద్యాధరపురంలో ప్రారంభించాను. ఆయన సాహితీపరమైన కార్యక్రమాలలో నాకు చేదోడు.

అవనిగడ్డ సభలు ఘనంగా జరుగుతున్నాయి. ఆరుద్ర, సంజీవదేవ్, లత, అద్దేపల్లి ప్రభృతులు విచ్చేశారు. సభలను దాశరధి ప్రారంభించారు. ఆయన ఆనాడు ఆస్థానకవి. "కేవల సభల నిర్వహణకు పరిమితం కాకుండా సాహిత్యోద్యమాలకు అంకితంగా పనిచేసే ఒక సంస్థ అవసరం ఈనాడు ఉంది" అని మండలి వెంకట కృష్ణారావుగారు ప్రారంభసభలో ప్రకటించటంతో అందరూ దాన్నే ప్రస్తావించారు. ఆ సాయంత్రం సదస్సులైపోయాక ముక్కామల నాగభూషణంగారు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఉన్న యమ్మార్ అప్పారావు గారు, సుబ్బారావు, బుద్ధప్రసాద్, నేనూ, మైత్రేయగారూ, విడిగా ఒక గదిలో కూర్చున్నాం. "మీకు నేను అండగా ఉంటాను, సంఘం ఏర్పరచండి" అన్నారు యమ్మార్ గారు.

ముక్కామల నాగభూషణంగారు వేదశాస్త్రాల పాదెరిగినవాడు. అభ్యుదయవాది. కమ్యూనిష్టు పార్టీలో ఎదిగాడాయన. అసుర నాగరికత, శతావతారాలు, ప్రాచీన భారతదేశంలో వైజ్ఞానిక ప్రగతి లాంటి గ్రంథాల రచయిత. విశ్వనాథవారికి బద్ధవిరోధి. వెర్రి పడగలు పుస్తకం రాశారు. వృత్తి రీత్యా నిర్మాణ రంగంలో అప్పట్లో అందెవేసిన చేయి. విజయవాడ లయోలా కళాశాల, మేరిస్టెల్లా కళాశాల, మాంటిస్సోరి కళాశాల. గాంధీహిల్లు మీద ప్లానెటోరియం లాంటి నిర్మాణాలు ఆయన చేసినవే! విజయవాడ మాచవరంలోని విశాలాంధ్ర భవనం కూడా ఆయన నిర్మించిందే! ఎదురుమండి, ఈలచెట్ల దిబ్బ చుట్టుపక్కల దీవులకు సముద్రం అడుగునుంచి పైపులైన్లు వేసి మంచినీటిని అందించే ప్రాజెక్టును పూర్తిచేసిన నిర్మాణ దక్షుడు, అప్పట్లో ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా ఉండేవారు. ప్రగతి వారపత్రిక సంపాదకుడిగా నడిపారు. యద్దనపూడి సులోచనారాణి లాంటి రచయిత్రుల్ని, రచయితల్ని ఎందరినో సాహితీలోకానికి పరిచయం చేసిందాయనే! ఆ రోజుల్లో ముక్కామల నాగభూషణంగారంటే అసామాన్యుల్లో అసామాన్యుడు.

ఆయన మండలి వెంకట కృష్ణారావుగారి కుటుంబానికి ఎంతో సన్నిహితుడు. శ్రీ బుద్ధప్రసాద్ తల్లిగారిని ఆయన 'అమ్మాయ్' అని పిలిచేవారు. బుద్ధప్రసాద్ గారు ముక్కామల నాగభూషణం గారిని తాతగారు అనే వారు. ఆయన బుద్ధప్రసాద్ గారిని 'బాబు' అనేవారు. వాళ్ల మధ్య ఆత్మీయతాబంధాలు అలాంటివి. చిన్ననాటి పరిచయస్థులంతా బుద్ధప్రసాద్ గారిని ఇప్పటికీ బాబు అనే పిలుస్తారు.

"సుబ్బారావు లాంటి యువకుడు ముందుకొస్తే, తాను కృష్ణాజిల్లా రచయితల సంఘం ఏర్పాటు బాధ్యతలు తీసుకుంటా" అంటూ నాగభూషణం గారు ఉత్సాహంగా స్వచ్ఛందంగా ముందుకు రావటం సంతోషం అనిపించింది. సంస్థకి ఆర్థికంగా పరిపుష్టిని కలిగించటంలో నాగభూషణంగారు సహకరించగలరని మా నమ్మకం.

సాధారణంగా శ్రీ సుబ్బారావు ఏ విషయాన్నీ వెంటనే సరే అన్నట్టు కనిపించడు. మౌనం పాటిస్తాడు. నాగభూషణంగారే కాసేపు చూసి అన్నారు: "నేనే అధ్యక్షుడిగా ఉంటానయ్యా! మండలి గారిని గౌరవాధ్యక్షుడిగా ఉండమందాం. యమ్మార్ గారు మనకి సలహాదారు. నువ్వు ప్రధాన కార్యదర్శిగా ఉండి నడిపించు" అన్నారు. అందరం చప్పట్లు కొట్టాం. సుబ్బారావు తలూపారు.

బుద్ధప్రసాద్ గారు సుబ్బారావుని వెదుక్కొంటూ వెళ్లి ఆహ్వానించి కృష్ణాజిల్లా రచయితల మహాసభలు పెట్టటం, కృష్ణాజిల్లా రచయితల సంఘానికి అంకురార్పణ జరగటం అంతా ఒక కలగా జరిగిపోయాయి. ఈ 1982 నాకు వ్యక్తిగతంగా ముఖ్యమైన సంవత్సరం. నా ఆసుపత్రి ప్రారంభించింది, నా వివాహం జరిగింది కూడా ఆ ఏడాదే!

లక్ష్మీప్రసాద్ గారితో అనుబంధం

ఈ పుస్తకం విడుదల కావటానికి ఒక్క రోజు తరువాత పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారి 70 వసంతాల సప్తతి ఉత్సవం విశాఖ పట్టణంలో జరగనుంది. ఆ సందర్భంగా వెలువడనున్న ప్రత్యేక సంచికకు సుబ్బారావు నేనూ అసామాన్యుల్లో అసామాన్యుడిగా ఆయనను ప్రశంసిస్తో అభినందించాము.

1970ల్లో రేడియోలు మాత్రమే అందుబాటులో ఉన్న కాలంలో ఆదివారం వస్తే చాలు, హిందీ మూలం ఫలానావారు, తెలుగు సేత డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అనే పేరు తప్పక వినిపించేది. అలా ఆ పేరు మా మనసుల్లో నిలిచిపోయింది. అప్పుడప్పుడూ అనుకుంటూ ఉండేవాళ్లం... ఈయనది గణపతి గంటం అనీ, పట్టుకుంటే ఆగదని. ఆయనతో పరిచయం అయ్యాక తెల్సింది గంటమే కాదు కంఠం కూడా అంతే వేగం కల్గిందని.

కృష్ణాజిల్లా రచయితల సంఘం ఏర్పడి కార్యక్రమాలు ప్రారంభించే సమయానికి ఆయన ముఖ్యమంత్రి యన్టీ రామారావు గారికి అత్యంత సన్నిహితంగా ఉండటంతో అందనంత ఎత్తున ఉన్న ఆయనకు మేమిద్దరం సన్నిహితం కాలేకపోయాం. 2006లో జాతీయ తెలుగు రచయితల మహాసభలకు ఆయనంతగా ఆయన వచ్చారు. అలా ఆయనతో పరిచయం ఏర్పడింది. ఆ సభల్లో కాసేపు కూర్చుని వెళ్లిపోకుండా పూర్తిగా మాతో గడిపారు. అలా స్నేహితులయ్యాం. ఆ తరువాత

శ్రీకాకుళంలో ఆంధ్ర మహావిష్ణు దేవాలయంలో జరిగిన శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కూడా ఆయన మూడురోజులూ మాతో గడపటంతో సాన్నిహిత్యం స్నేహంగా మారింది. ఎంత స్నేహితులం అయినా ఏనాడూ ఏకవచన ప్రయోగం చెయ్యలేదు. అది ఆయన సంస్కారం.

జాతీయ సభల్లోనే ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణకు మౌలికమైన నిర్ణయం తీసుకోగలగటానికి లక్ష్మీప్రసాద్ గారి ప్రేరణ ముఖ్య కారణం. బుద్ధప్రసాద్ గారు గౌరవాధ్యక్షులుగా, లక్ష్మీప్రసాద్ గారు కార్యనిర్వాహక అధ్యక్షులుగా, గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షులుగా, జి వి పూర్ణచందు ప్రధానకార్యదర్శిగా ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణకు సమాయత్తమయ్యాం. లక్ష్మీప్రసాద్ గారు అప్పటికప్పుడు లక్షరూపాయలు మా చేతికిచ్చి, "ముందు ఈ డబ్బుతో పని ప్రారంభించండి" అన్నారు. కార్యనిర్వహణ సాధక బాధకాల పాదెరిగిన వాడాయన. సభలు విజయవంతంగా జరిగాక డబ్బులు మిగిలాయంటూ, వారిచ్చిన లక్షరూపాయల్ని తిరిగిచ్చి, కృతజ్ఞతలు చెప్పాము. అప్పుడాయన అన్నారు...

"ఆ రోజు మీకిచ్చిన ఈ డబ్బు నాదగ్గర ఉండి ఇచ్చింది కాదు. కానీ, ఇచ్చింది తీసుకునే అలవాటు నాకు లేదు" అని తిరిగి ఇచ్చేశారు. "ఈడబ్బుని బ్యాంకులో వేసి వచ్చే వడ్డీతో మీ పేరున ఒక అవార్డు ఇచ్చే ఏర్పాటు చేద్దాం" అన్నాం. ఆయన సంతోషంగా ఒప్పుకుని, "నా పేరుతో కాదు ఆలూరి బైరాగి పేరుతో ఇద్దాం" అన్నారు. వేగంగా నిర్ణయం తీసుకోవటం, వేగంగా అమలు చేయటం ఈ రెండూ లక్ష్మీప్రసాద్ గారి దగ్గర నేర్చుకోవలసిన అంశాలు. ఆయన పట్ల ఒక ఆరాధనా భావం నెలకొనటానికి ఇలాంటి తార్కాణాలు ఎన్నో!

2008 ఆగష్టులో ఆయనే ప్రతిపాదించి, పథక రచన చేసి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరుజిల్లా రచయితల సంఘాలను ఒకచోట చేర్చి, మచిలీపట్టణం నుండి నెల్లూరుదాకా నిర్వహించిన రచయితల పాదయాత్ర సమయంలో ఆయన విశ్వరూపాన్ని చూశాం. ప్రజల గుండె తలుపులు తట్టి భాషాభిమానం కలిగించిన సభలవి. తెలుగు భాషోద్యమానికే కాదు, ప్రాచీనతా హోదాని సాధించే ప్రక్రియకు కూడా ఈ యాత్ర ఒక ఊపు నిచ్చింది. దాని ఫలితమే అక్టోబరు 31న తెలుగు భాషకు ప్రాచీనతా హోదా ప్రకటన. డిల్లీ స్థాయిలో చక్రం తిప్పి లక్ష్మీప్రసాద్ గారు చేసిన కృషి సన్నిహితంగా ఉన్నవారికే తెలుస్తుంది. సంబంధిత కేంద్ర మంత్రులతోనూ, అధికారులతోనూ ఆయన కున్న పరిచయాలు ముఖ్యంగా మంత్రి వీరప్ప మొయిలీ, ప్రధాని మన్మోహన్ సింగ్ గార్లపైన వత్తిడి తేవటానికి ఎంతగానో సహకరించాయి. ఆయనొక్కరు లేకుంటే ఇదేదీ సాధ్యం కాదు అనదగిన విజయాలెన్నో ఉన్నాయి.

2015లో మూడవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రకటించాం. కానీ, పరిస్థితులు అనుకూలించక రెండు పర్యాయాలు వాయిదా వేశాము. ఏ మూలనుండీ ఆర్థిక సహకారం లేనప్పుడు ఆయన ఒంటిచేత్తో ఆ సభలకు వనరులు సమకూర్చారు. బందరులో కృష్ణావిశ్వవిద్యాలయం ఏర్పాటుకోసం పోరాడినప్పుడు ఆయన మమ్మల్ని కూడా ఆ పోరాటంలో భాగస్వాముల్ని చేశారు. అందులో తెలుగు శాఖ ఏర్పాటుకి ఉన్నత విద్యాశాఖమీద తీవ్ర వత్తిడికి ఆయన ప్రయత్నించారు. విశ్వవిద్యాలయం ప్రారంభ సభలో ఆనాటి కౌన్సిల్ చైర్మన్ “విద్యార్థులు చేరకపోవటం చేతే తెలుగు శాఖని ఏర్పాటు చేయటం లేదు” అన్నారు. “15 మంది విద్యార్థుల్ని చేర్పిస్తే తెలుగుశాఖను ప్రారంభిస్తాం” అని ఒక విధంగా ఛాలెంజి లాంటిది చేశారు.

లక్ష్మీప్రసాద్ గారు వెంటనే స్పందించి, తెలుగు యమ్ ఏ చదవటానికి పేద విద్యార్థులకు ఫీజులు కృష్ణాజిల్లా రచయితల సంఘం చెల్లిస్తుందని ప్రకటించారు. అలా 8 మంది విద్యార్థుల ఫీజుల్ని కృష్ణాజిల్లా రచయితల సంఘం రెండేళ్లపాటు చెల్లించి ఆయన మాట నిలబెట్టింది. 30 మందికి పైగా విద్యార్థులు చేరటంతో, తెలుగుశాఖ ఏర్పాటయ్యింది. ఆయన do అనగానే మేమిద్దరం done అనగల అనుయాయులుగా అంతే వేగంతో పనిచెయ్యగలిగాం.

బుద్ధప్రసాద్, లక్ష్మీప్రసాద్, సుబ్బారావు, పూర్ణచందు ఈ నలుగురూ తెలుగు భాషోద్యమానికి నాలుగు మూల స్థంభాలని అనేక సభల్లో సి.నా.రె ప్రశంసించారు.

లక్ష్మీప్రసాద్ గారితో కలిసి పనిచేయటం మాకొక అపూర్వ అనుభవం. ఇటీవలి కాలంలో ఆయన ఎక్కువ అమెరికాలో గడపటం, అనారోగ్యం వంటి కారణాలు మా మధ్య కొంత ఎడం పెంచాయి. గత సంవత్సరం మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఆయన మా ఇద్దర్నీ అధికారభాషా సంఘం పురస్కారాలిచ్చి, గౌరవించి మనమధ్య ఎలాంటి ఎడం లేదని, ఉండకూడదనీ అన్నారు.

“ఏల నాహృదయంబు ప్రేమించు నిన్ను...?” అని కృష్ణశాస్త్రిగారు చంద్రుణ్ణి ఉద్దేశించి అంటారు. ఈ సాహితీచంద్రుణ్ణి అదే అడుగుతున్నాం... ‘మీరంటే మాకు ఎందుకింత ఇష్టం?’ అని! మేం ఆయన్ని కోరుకుంటున్నాం. ఆయన మునుపటి ఉత్సాహంతో తెలుగు భాషాయోధుడిగా నిలవాలని ఆకాంక్షించాం. సుబ్బారావు పూర్ణచందు కలిసి సాగిస్తున్న నావకు బుద్ధప్రసాద్ గారు దిక్సూచి అయితే, లక్ష్మీప్రసాద్ గారు తెరచాప. దిశను మార్చగల నేర్పరి ఆయన.

గురుపరంపర

సుబ్బారావు సాహితీ జీవితంలో ఆయనకు అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారు, ఆయనకు గురుస్థానం ఇచ్చి గౌరవించిన వారూ అనేకమంది ఉన్నారు. తొలి

రోజుల్లో వచనకవితా పితామహుడు శ్రీ కుందుర్తి ఆంజనేయులు, డా. సి.నారాయణ రెడ్డి మలిరోజుల్లో ప్రముఖ కథకుడు, విశ్లేషకుడు శ్రీ విహారి, ఆచార్య వంగపల్లి విశ్వనాథం వారిలో ముఖ్యులు.

సుబ్బారావు కుందుర్తిగారికి నేరుగా శిష్యుడు. హైదరాబాదులో పోస్టల్ ఉద్యోగం చేసే రోజుల్లో సుబ్బారావు ఆయనకు అత్యంత సన్నిహితుడు. శివారెడ్డిగారి వేకువ పత్రిక వ్యవస్థాపనలోను నిర్వహణలోనూ సుబ్బారావు ఉన్నాడు. స్వాతి మాసపత్రిక ఆరంభ సంచికలతోనూ సుబ్బారావుకు సంబంధం ఉంది.

ఇదంతా 1969 నాటి సంగతి. శివారెడ్డి, శీలా వీర్రాజు, వేమూరి బలరాం, వేమూరి సత్యనారాయణ, చిత్రకారుడు చంద్ర, నాటక రచయిత సి.యస్.రావు, దిగంబర కవులు, వీరంతా అటూ ఇటూగా ఒకే వయసువాళ్ళు. అందరూ ఆవేశపరులు. సుబ్బారావు వాళ్లకన్నా చిన్నవాడు. జ్యోతి, యువ మాసపత్రికలు ఉధృతంగా వెలువడుతున్న ఆ రోజుల్లో బలరామ్ గారు, వేమూరి సత్యనారాయణ ప్రభృతులతో కలిసి స్వాతి పత్రికని శీలా వీర్రాజుగారి సంపాదకత్వాన ప్రారంభించారు. స్వాతి పత్రిక తొలి సంచికల్లో సుబ్బారావు కూడా ఉన్నాడు. కానీ, ప్రభుత్వోద్యోగి కావటం వలన వీర్రాజుగారు సంపాదకుడుగా వ్యవహరించటానికి అడ్డంకి అయ్యింది. బలరామ్ గారే సంపాదకులయ్యారు.

స్వాతి బలరామ్ గారు ఈ నాటికీ 1969-70ల నాటి సుబ్బారావుని మరిచి పోలేదు. ఒకసారి సుబ్బారావు, నేను ఆయన దగ్గర కూర్చొన్నప్పుడు బలరామ్ గారు అప్పటి సంగతులు అనేకం చెప్తూ పాతజ్ఞాపకాల్లోకి వెళ్లారు. మహాసభల ఆర్థిక సాయం కోసం వేళ్తే ఆయన ఎందుకూ ఏమిటీ అనకుండా 'ఎంత?' అనడిగేవారు. సుబ్బారావుతో ఆయన కున్న అనుబంధానికి వజ్రోత్సవ సమయం ఇది.

గురువు కుందుర్తి ప్రశంస

1969 నుండీ, వచనకవితా పితామహుడు, ఫ్రీవెర్స్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు శ్రీ కుందుర్తి (కుందుర్తి ఆంజనేయులు)కి శిష్యుడుగా చాలా విషయాలు ఆకళింపు చేసుకున్నాడు సుబ్బారావు. అతని 'మనిషికోసం' కవితా సంపుటికి కుందుర్తి ముందు మాటల్లో ఇలా రాశారు:

"సాహిత్యసంస్థల నిర్మాణమూ, వాటి కార్యక్రమాల నిర్వహణలో పడితే సృజనాత్మకమైన కవితాశక్తి వెనకబడిపోతుందేమో చూసుకుంటూ ఉండమని నేను హెచ్చరించిన యువకవి మిత్రుల్లో సుబ్బారావు ఒకడు" అని. "అబద్ధాల పూబాటల్లోంచి నడిచి రాలేదు నేను/నిజం ముళ్లకంచెల్ని దాటుకుంటూ వచ్చాను" లాంటి వాక్యాలకు శ్రీ కుందుర్తి ముచ్చటపడ్డారు కూడా. అబద్ధాన్ని పూలతోటల్తోనూ, నిజాన్ని ముళ్లకంచెల్తోనూ

పోలుస్తూ చక్కగా కుదిరిన ఈ రెండు పంక్తులూ చదవగానే నిజంగానే నేను అదిరి పోయాను, అంటే అమితానందం చెందాను. ఎందుకంటే నేను మిత్ర భావంతో చూసినా ఆయనకు నా పట్ల గురుభావం ఉంది" అన్నారు.

సుబ్బారావు కవితా సంపుటి, నిజానికి 1969లోనే వెలువడవలసి ఉంది. కానీ, ఇంకొంత పరిపక్వత వచ్చేవరకూ కుందుర్తి అతన్ని ఆగమన్నారు. 1975లో మనిషి కోసం వెలువడింది. కుందుర్తి గారిద్వారా లోకానికి కవిగా పరిచయం కావాలని సుబ్బారావు కోరిక. 75 నాటికి కవిగా పరిపక్వత వచ్చిందని నమ్మకం కుదిరాకే ఈ కవితా సంపుటి వెలువడటానికి కుందుర్తి అనుమతి లభించిందనాలి!

"కావ్యప్రచురణతో కవిగా ప్రజలముందుకు నిలబడడానికి కొంత ఆలస్యం జరిగినా, ఆ తప్పు నాదే అయినా దానివల్ల మేలే జరిగిందని నేను సంతృప్తి పడుతున్నాను" అన్నారు శ్రీ కుందుర్తి. ఒక యువకవిగా తొలి కవితా సంపుటితో కుందుర్తిగారి సంతృప్తిని గెలుచుకో గలిగాడు సుబ్బారావు. కానీ దురదృష్టం ఏమంటే ఆ కవి అక్కడితోనే ఆగి పోయాడు. కుందుర్తి ముందే హెచ్చరించాడు. నువ్వు ఏది పట్టుకుంటే ఇంక అదే అన్నట్టుంటావు, సంస్థల నిర్వహణ, స్వీయ రచన రెండింటినీ సమన్వయం చేసుకో అని. కానీ, సుబ్బారావు కలం వదిలేశాడు. కార్యక్రమాలు చేపట్టాడు. 1975 నుండీ నేటివరకూ 50 యేళ్లుగా తదేక దీక్షగా!

సుబ్బారావు విషయంలో సాహిత్యపరంగా జరిగిన అనేక సంఘటనలు నా విషయంలోనూ జరిగాయి. 1982లో నేను కాంతిస్వప్న దీర్ఘ కవిత రాసాను. బరంపురంలో సభలకు హాజరై తిరిగి వచ్చేప్పుడు కుందుర్తిగారూ నేనూ పక్కపక్క బెర్తుల్లో ప్రయాణించాం. అప్పుడు నా కాంతిస్వప్న ఆయనకు చదివి వినిపించే అవకాశం కలిగింది. ఆయన మౌనంగా విన్నారు. నాకు ఏ సమాధానమూ చెప్పలేదు. ఆయన హైదరాబాద్ వెళ్ళాక సుబ్బారావుకు ఒక ఉత్తరం రాశారు. "పూర్ణచందు తన కవిత్వాన్ని నాకు చదివి వినిపించాడు. అతను తన వయసుని మించిన కవిత్వం రాశాడు. అతనిలో ఇంత లోతుందని ఊహించలేదు. 5 యేళ్లపాటు ఈ కవిత్వాన్ని ప్రచురించకుండా ఆగి మరొక్కసారి చదివి అప్పుడు ప్రచురించమన్నానని నా మాటగా చెప్పు" అని!

ఏ రచననైనా ఇలా రాసి అలా ప్రచురణకు పంపటం మంచి అలవాటుకాదనేది నా అనుభవం కూడా! ఒకట్రెండు రోజులు నిలవుంచి మరొక్కసారి చదివితే బోల్డెన్ని మార్పులు మనకే తడతాయి. అందుకే శ్రీ కుందుర్తి కొన్నాళ్లాగి ప్రచురించు అన్నారు.

బెజవాడ గోపాలరెడ్డిగారితో అనుబంధం

ఆ రోజుల్లో సుబ్బారావుని ఎక్కువగా ప్రభావితం చేసినవారిలో డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు కూడా ఉన్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీలో

సుబ్బారావు సహించలేని విషయాలు అనేకం జరుగుతున్నప్పుడు అకాడెమీ అధ్యక్షులైన గోపాలరెడ్డిగారితో సుబ్బారావు ఘర్షణ పడ్డ సందర్భాలు ఉన్నాయి. ఆ ఇద్దరి మధ్య ఎంత వైరం ఉండేదో అంత ఆత్మీయత కూడా ఉండేది. గోపాలరెడ్డిగారు అత్యంత నమ్మకమైన వ్యక్తిగా శ్రీ సుబ్బారావును భావించేవారు.

గోపాలరెడ్డిగారు 1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రారంభమైన నాటి నుండీ అధ్యక్షులుగా ఉన్నారు. 1979లో అకాడెమీ లోంచి రిటైరయ్యారు. ఆ సమయంలో వీడ్కోలు సభ జరిగింది. ఆ సభలో సుబ్బారావును పిలిచి, భుజం మీద చెయ్యి వేసి, "సుబ్రావ్! అకాడెమీలోకి నువ్వొచ్చాక నాతో చాలా విషయాల్లో విభేదించి మాట్లాడావు. అదంతా సంస్థ మంచికోసం, ఇతరుల క్షేమం కోసం మాత్రమే అని నాకు తెలుసు. అకాడెమీలో పనిచేసే ఉద్యోగులకు ఇల్లు కట్టుకోవటానికి, వాహనాలు కొనుక్కోవటానికి ఋణసదుపాయం ప్రతిపాదన చేసి ఇప్పించింది నువ్వే! ఇతరుల కోసం తప్ప నీ కోసం ఏదీ అడగవ్. అందుకే నువ్వంటే ఇష్టం, నీమీద నాకు కోపం లేదు" అన్నారు.

ఆయన విజయవాడ వచ్చినప్పుడు సాధారణంగా సిరీస్ రాజు గారింట్లో దిగేవారు. అక్కడకు వెళ్ళి ఆయన్ని కలిసి సుబ్బారావు నేనూ మాట్లాడేవాళ్ళం. ఒకసారి ఆయన్ని రైలెక్కించేందుకు స్టేషనుకు వెళ్ళాం. పూర్వపు 5వ నెంబర్ ప్లాట్ ఫాం మీద రైలుకోసం నుంచున్నాం. రైలు రాలేదుగానీ, మమ్మల్ని దాటుకుని ఓ మంత్రిగారు (పేర్లెందుకులేండీ) మందీమార్బలంతో ముందుకు వెళ్ళారప్పుడే!

ఆంధ్రరాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రి, ఉమ్మడి ఆంధ్రరాష్ట్రానికి మంత్రి, కేంద్రమంత్రి, ఉత్తరప్రదేశ్ గవర్నర్, హైదరాబాద్ సహా ప్రతీ రాజధానిలోనూ ఒక రవీంద్రభారతి ఉండాలని సంకల్పించి నిర్మింపచేసిన వ్యక్తి, సాహిత్య అకాడెమీ అధ్యక్షులు డా॥ బెజవాడ గోపాలరెడ్డి గారిని సాక్షాత్తూ రాష్ట్రమంత్రి గారు గుర్తుపట్టలేదంటే ఆశ్చర్యం.

"ఆయన మిమ్మల్ని అలా చూడనట్టు వెళ్ళిపోతారేమిటండీ" అన్నాడు ఆపుకోలేక సుబ్బారావు. సుబ్బారావు ఆ మాట అన్నప్పుడు గోపాలరెడ్డిగారు చిన్నగానవ్వి ఊరుకున్నారు.

గోపాలరెడ్డిగారు రాజకీయవేత్త కాదు. రాజనీతిజ్ఞుడు. ఆయన 1968లో ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా ఉన్నప్పుడు చరణ్‌సింగ్‌గారు ముఖ్యమంత్రి. అసెంబ్లీ ప్రారంభ సమావేశాలలో గవర్నర్ చేసే ప్రసంగం విషయంలో ఆయనతో ముఖ్యమంత్రి చరణ్ సింగ్ గారు విభేదించారు. ఆయన ప్రవర్తన గవర్నర్ స్థాయిని కించపరిచేదిగా ఉన్న కారణంగా ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన విధించిన ధీశాలి. దేన్నయినా ఢీ అంటే ఢీ అని ఎదుర్కోగల సత్తా ఉన్నవాడు. రవీంద్రుని శిష్యుడు. శాంతినికేతన్

విద్యార్థి. మంచి భావుకత గల కవి. రవీంద్రుని ప్రభావంతో 'ఆమె' పేరున 5 సంపుటాలు కవిత్వం వెలువరించారు. "ఆమె పంచకం" పేరుతో అవి ప్రసిద్ధి.

గోపాలరెడ్డిగారికి 1980లలో నా 'అమలిన శృంగారం' పుస్తకం పోస్టులో పంపాను. అప్పటికి వ్యక్తిగతంగా ఆయనకు నేను పరిచయం కాలేదు. పుస్తకం ఆసాంతం చదివి మెచ్చుకుంటూ నాకు ఉత్తరం రాశారాయన. ఆ తరువాత సుబ్బారావుతో పాటుగా వెళ్లి ఆయన్ను కలిసినప్పుడు "అమలిన శృంగారం చదివితే నీకు ఏ యాభై ఏళ్లో ఉంటాయనుకున్నాను. పెళ్లికాని కుర్రాడివా? ఏ అనుభవం లేకుండా ఎలా రాశావ్?" అన్నారు ఆశ్చర్యంగా నవ్వుతూ!

"కవులకు అనుభవం దేనికి? ఊహ చాలదా?" అన్నాడు సుబ్బారావు.

'లేదు సుబ్రావ్! ఆ అసలు అనుభవం కూడా అయ్యాకే, మలిన శృంగారానికి, అమలిన శృంగారానికీ తేడా తెలుసుకుని రాస్తే బావుండేది" అని మళ్ళీ నవ్వారు గోపాలరెడ్డిగారు.

"నిన్ననే రిజల్ట్సొచ్చాయి. మనవాడు డాక్టరయ్యాడు. ఇంక హౌస్ సర్జన్ చెయ్యాలంతే! డాక్టర్లకు అనుభవం లేకుండానే కొన్ని తెలుస్తాయ్" అన్నాడు సుబ్బారావు. గోపాలరెడ్డిగారు నా చెయ్యి పట్టుకుని కరచాలనం చేసి అభినందించారు. సుబ్బారావుతో కలిసి పనిచేయటం వలన ఇలాంటి మధురస్మృతులెన్నో నాకు దక్కాయి. పెద్దలతో స్నేహం సుబ్బారావులో పరిపక్వతని తెచ్చింది. సుబ్బారావు ద్వారా అందులో కొంత నాకూ సంక్రమించింది. సుబ్బారావు స్నేహితులందరూ ఇంచుమించుగా నాకూ స్నేహితులే అయ్యారు.

స్పందన సాహితీ సమాఖ్య

"బందరులో స్పందన" అనేది 1975-85 మధ్యకాలంలో తరచూ వినిపించే మాట. "బందరు+స్పందన=స్పందరు" అని పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు ఒక సందర్భంలో చమత్కరించారు కూడా! దాదాపు 60 పుస్తకాలను ప్రచురించిన సాహితీ సంస్థ అది.

బందరులోనూ, బెజవాడలోనూ ఈ సంస్థ పక్షాన ఆ రోజుల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించాము. 1983లో విజయవాడ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో సంస్థ పక్షాన నెల రోజులపాటు రచయితల పుస్తకాల స్టాలు నిర్వహించి 50% రాయితీకి విలువైన పుస్తకాలు అందించాము. వచ్చిన 50% సొమ్ముని రచయితలకు పంచేశాము. దీని వలన సంస్థకు ఖర్చులు మాత్రమే మిగిలాయి. లాభనష్టాలు బేరీజు వేసుకుని చేసేది సాహితీ సేవ అవదు, వ్యాపారం అవుతుంది. సాహిత్యాన్ని, సాహితీ సంస్థల్ని అడ్డం పెట్టుకుని వ్యాపారం చేసే వాళ్ళంటే సుబ్బారావుకు అసహ్యం.

అప్పటికి ఇంకా సంవత్సరం కూడా కాలేదు నేను హాస్పిటల్ పెట్టుకుని. అయినా ఈ ఎగ్జిబిషన్ నెల్లాళ్లూ రోజూ సాయంత్రం పూట ఆసుపత్రి దుమ్మా కొట్టాల్సి వచ్చింది. ఇలాంటి నష్టాలు కెరీర్ని దెబ్బతీస్తాయి కూడా! కానీ, అది పట్టించుకుంటే కార్యకర్తని కాగలిగేవాణ్ణి కాదు. స్వంత వ్యాపారం చేసుకుంటూ సొమ్ములు సంపాదించు కుని అందులో కొంచెం సాహితీ సేవకు విదిల్చే వారికి ఈ తత్త్వం అర్థం కాదు.

కార్యకర్తృత్వానికి సాహిత్య కార్యకర్త యజమాని. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో, నిర్భయంగా, హేతుబద్ధంగా, వేగంగా నిర్ణయాలు తీసుకుని నిజాయితీతో అమలు చేయగలవాడు. కార్యకర్త అంటే, కార్యనిర్వాహకుడు. విజయాలకు ప్రాతినిధ్యం వహించేవాడు. వైఫల్యాలకు బాధ్యత వహించేవాడు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవాలకు ప్రతీకగా ఉంటాడు. కవులైనా, రచయితలైనా, ఇంకా ఇతరులైనా కార్యకర్త పట్ల ఇలాంటి గౌరవాన్ని ప్రదర్శించినప్పుడే సాహిత్యం ఉద్యమస్ఫూర్తిని పొందగలుగుతుంది.

సుబ్బారావు కార్యకర్తృత్వం గురించి ప్రఖ్యాత రచయిత్రి శ్రీమతి సి వేదవతి రాసిన ఈ వాక్యాలు సుబ్బారావు తత్త్వాన్ని, తర్కాన్ని తాత్త్వికతనూ వివరిస్తాయి.

“1980ల్లో బందరులో ఆం.ప్ర. సాహిత్య అకాడెమీ పక్షాన సభలు జరుగు తున్నాయి. మేమంతా బందరులో దిగేటప్పటికీ ఊరంతా కోలాహలం. ఉత్సాహంతో సభలకు వచ్చిన కవులూ రచయితలూ కవయిత్రులందరికీ ఆతిథ్యమిచ్చి సభా నిర్వహణ చేస్తున్నది స్పందన సాహితీ సమాఖ్య. ఈ సంస్థకు వ్యవస్థాపకుడూ, కార్యదర్శి కూడా అయినవాడు గుత్తికొండ సుబ్బారావు. అన్నట్టు అతడు అప్పటికే ఆం.ప్ర. సాహిత్య అకాడెమీ కార్యవర్గ సభ్యుడు కూడా!

అప్పటికి చాలాకాలం నుండీ అవీ ఇవీ ఏవో రచనలు చేస్తూనే ఉన్నాను. శృంగారలహరి అనే పుస్తకం కూడ అచ్చు అయింది. విమర్శకుల మన్ననలు అందుకున్న రచన అది! అయితే ఇంత భారీ ఎత్తున జరుగుతోన్న సభలలో పాల్గొనడం అదే మొదటిసారి. ఇంతమంది ప్రఖ్యాతి పొందిన రచయిత్రులతో చెట్టాపట్టాలేసుకుని రెండు మూడు రోజులు కులాసాగా గడపటం– ఓ మరపురాని అనుభవం. సభలు చక్కగా రసవత్తరంగా జరిగాయి. భోజన వసతుల్లోనూ ఏ లోపమూ లేదు. కొత్తగా రాస్తున్నవారి దగ్గరనుంచి లబ్ధ ప్రతిష్ఠులైన వారి వరకూ కవులూ రచయితలతో కొత్త పరిచయాలు–ఎటు చూసినా ఉత్తేజకర వాతావరణం. ఈ సంరంభంలోనూ ఎక్కడ చూస్తే అక్కడ తానై ఎవరికి ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ చేయందిస్తూ వచ్చినవారికి సకల సదుపాయాలూ సమకూరుస్తూ అతిథి మర్యాదలతోపాటు సభా నిర్వహణలోనూ పాలుపంచుకొంటూ బొంగరంలా తిరిగిన ఓ చైతన్యతరంగం– పేరు గుత్తికొండ సుబ్బారావు.

స్పందన సాహితీ సమాఖ్య పేరుతో నా పుస్తకాలు వరుసగా అచ్చయ్యాయి. నన్ను రచయితగా నిలబెట్టిన మంచిపుస్తకాలు సాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన "తెలుగు వెలుగు" సామెత, ముంగిటి ముత్యం, స్మృతిగీత ఇవన్నీ సుబ్బారావు చేతులమీదుగా వెలుగు చూసినవే! రచన విషయంలో స్ఫూర్తిని, ప్రచురణ విషయంలో తోడ్పాటును అందించిన మంచి స్నేహితుడు సుబ్బారావు. నాకేకాదు, మరింకెంతమందో వర్ధమాన రచయితలను ప్రోత్సహించి వారి పుస్తకాలు ప్రచురించి సేవాతత్త్వంతో పనిచేసిన వాడు సుబ్బారావు. అది అతడి ప్రవృత్తి" అని రాశారామే!

"పచ్చని జీవితానికో నచ్చిన రూలు" పుస్తకాన్ని ప్రచురించి డా॥ పెళ్లకూరు జయప్రదగారి పుస్తకాన్ని లోకానికి పరిచయం చేసిందీ సుబ్బారావే! బెజవాడ గోపాలరెడ్డిగారిని బందరుకి ఆహ్వానించి ఆయన చేతుల మీదుగా 1976లో ఆ పుస్తకాన్ని ఆవిష్కరింప చేశాడు. మీ ఊరమ్మాయి పుస్తకాన్ని మా ఊరొచ్చి ఆవిష్కరించండి" అని సుబ్బారావంటే పగలబడి నవ్వారు బెజవాడ గోపాలరెడ్డిగారు.

సుబ్బారావు తన మొదటిపుస్తకం అచ్చు వేసి తననో రచయితగా నిలబెట్టిన వాడని కృతజ్ఞతలు చెప్తూ డా॥ ద్వానాశాస్త్రి తరువాతి కాలంలో తన పుస్తకం అంకితం ఇస్తూ, సుబ్బారావు లాంటి గోడచేర్పులు వర్ధమాన రచయితలకొక వరం అన్నాడు. మందరపు హైమవతి, డి సుజాతాదేవి, బూదరాజు శ్యామసుందర్, అక్కల కిరణ్, తాతారమేష్ బాబు లాంటి ఎందరో యువకవుల్ని ఆనాడు వారి మొదటి పుస్తకం ప్రచురించి లోకానికి పరిచయం చేసింది సుబ్బారావే!

బందరు చేరిన సుబ్బారావు

పోస్టల్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, సుబ్బారావు బందరు యల్.ఐ.సీ ఉద్యోగాని కొచ్చారు. ఇక్కడి కొచ్చాక ఆంధ్ర సారస్వత సమితిలో పనిచేస్తున్న విహారి, శాలివాహన, సోమయాజిగారు, బూదరాజు శ్యామసుందర్, జిసనారామ్ కొట్టి రామారావు ప్రభృతులతో పరిచయం అయి, తానుకూడా ఆ సంస్థలో భాగస్వామి అయ్యారు. అంతకు మునుపు అద్దేపల్లి రామమోహనరావుగారు బందర్లో లెక్చరర్గా ఉన్నప్పుడు స్థాపించిన సంస్థ అది. విహారి అధ్యక్షుడుగా సుబ్బారావు ప్రధానకార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో ఆ ఇద్దరి వేగానికి కొందరు తట్టుకోలేకపోయారు. దాంతో 13 మంది ఉన్న కార్యవర్గంలోంచి సుబ్బారావు, విహారి సహా 11 మంది బయటకు వచ్చి, స్పందన సాహితీ సమాఖ్యకు ప్రాణం పోసారు. ఈ సంధికాలంలో ఈ బృందానికి నేను పరిచయం అయ్యాను. వీళ్లంతా నా కన్నా 10–15 యేళ్లు పైబడ్డ వాళ్లే. నేను వీళ్లకు బాగా సన్నిహితుణ్ణయ్యే సరికి స్పందన సంస్థ ఉధృతంగా పనిచేస్తోంది.

1976లో స్పందన ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా రచయితల 4వ మహాసభలు జరిగాయి. విహారిగారు అధ్యక్షులు, సుబ్బారావు ప్రధాన కార్యదర్శి. నన్ను కార్య వర్గంలోకి తీసుకున్నారు. కాలేజీ శలవు రోజుల్లో బందరు వెళ్లి అక్కడ పనుల్లో పాల్గొనేవాణ్ని. నవంబరులో సభలు సంకల్పించాము. కానీ, విశ్వనాథ సత్యనారాయణగారు అక్టోబరు 18న పరమపదించారు. పెద్దలతో ఈ విషయమై చర్చించటానికి విజయవాడలో నిడమర్తి ఉమారాజేశ్వరరావు గారింట్లో సమావేశం అయ్యాము. ఆ సమావేశంలో విశ్వనాథవారికి అంకితంగా సభలు జరపాలని నిర్ణయించాం. అప్పుడే. ఉమారాజేశ్వరరావు గారు మందరపు హైమవతిగారిని ప్రోత్సహించమంటూ పరిచయం చేశారు.

నేను హైస్కూల్లో చదివేరోజుల్లోనే 'మేఘమాల' అనే లిఖిత మాసపత్రికని నడుపుతూ ఉండేవాణ్ణి. మహాకవి దుర్గానంద్ గారబ్బాయి అంబికానాథ్ నా సహాధ్యాయి. అతను సంచాలకుడు, నేను సంపాదకుణ్ణి, ఇంకా చాలామంది నూజివీడు SRR High School మిత్రబృందం కలిసి ఈ పత్రిక మొదలు పెట్టాం. హైస్కూలు చదువు అయిపోయాక మా నాన్నగారి ఉద్యోగం (వ్యవసాయశాఖ) రీత్యా ఆయనకు ట్రాన్స్ఫర్ కూడా తోడవటంతో నా చదువంతా విజయవాడకు మారిపోయింది.

విజయవాడలో ఇంటర్ చదివే రోజుల్లో కూడా మేఘమాలను నేను కొన సాగించాను. కృష్ణాజిల్లా రచయితల మహాసభల్లో విశ్వనాథ ముఖచిత్రంతో ఆ సభల ప్రత్యేక సంచికని తయారు చేశాను. విహారిగారు, సుబ్బారావు దాన్ని హవిశ్ గారితో ఆవిష్కరింప చేశారు. ఆ చిన్న వయసులో అదో గొప్ప విషయం. భవిష్యత్తులో ఈ కుర్రాడు చాలా పైకి రావాలని సభలో పెద్దలంతా ఆశీర్వదిస్తారు కదా...! అదో తృప్తి.

స్పందనవాణి మాసపత్రిక

సుబ్బారావుకు, నాకు, యువభారతి సంస్థ అంటేనూ వంగపల్లి విశ్వనాథం గారంటేనూ చాలా గౌరవం. వాళ్లను ఆదర్శంగా తీసుకుని కార్యక్రమాలు రూపొందించే వాళ్లం. మనం క్రమశిక్షణతో నిబద్ధతతో అంకితభావంతో పనిచేస్తే మన కృషి ఇతరులకు ఆదర్శప్రాయం అవుతుంది. సాహితీ సంస్థల్ని వ్యక్తిగత ప్రతిష్ఠకు ఉపయోగించు కోవాలనుకుంటే ఎన్నటికీ రోల్ మోడల్స్ కాలేరు.

యువభారతి వారి నందిని మాసపత్రిక లాగా స్పందన సాహితీ సమాఖ్య పక్షాన కూడా ఒక మాసపత్రికను తేవాలని 1978లో సుబ్బారావు సంకల్పించాడు. సంకల్పించాక ఇంక తిరుగుండదు కదా... పనులన్నీ బందర్లోనే జరుగుతున్నాయి. బెజవాడలో ఉండి నేను దాని కోసం చేసేదేమీ లేదు కాబట్టి నా చదువులో నేనున్నాను.

ఒకరోజు సుబ్బారావు నుండి ఓ ఉత్తరం వచ్చింది. ఆ రోజుల్లో మాకెవరికి స్వంత ఫోన్లు లేవు. ఉత్తరాలే గతి. "నువ్వు అర్జంటుగా వెళ్లి అనుగ్రహం సినిమా

చూసి, దాని మీద మంచి రెవ్యూ రాసి పంపించు, ఇది అర్జెంటు. ప్రారంభసంచికలో రావాలి" అని! సరిగ్గా ఆ సమయానికి పరీక్షలు జరుగుతున్నాయి. అయినా సుగ్రీవాజ్ఞ తప్పదు కదా!

విజయవాడ ఫిలిం సొసైటీ (విఫిసో) లో సభ్యుడిగా ఉండేవాణ్ణి. దాని ద్వారా దేశ విదేశీ సినిమాలు చాలా చూశాను. కళాత్మక సినిమాల మీద నాకు అవగాహన ఉంది! శ్యాంబెనగల్ అనుగ్రహం సినిమాని నాదైన కోణంలోంచి అర్థం చేసుకుని పెద్ద సమీక్ష రాశాను.

శ్యామ్ బెనగల్ ఈ సినిమాని కొందూర పేరుతో హిందీలో తీశాడు. తెలుగు నటులు వాణిశ్రీ, రావుగోపాలరావు, హిందీలో అప్పటికే ప్రసిద్ధులైన స్మితా పాటిల్, అనంతనాగ్, అమ్రిష్‌పురి ప్రభృతులు నటించారు. హిందీలో రావుగోపాలరావు ఒక్కడే లేడనుకుంటాను.

తనకేవో అతీత శక్తులున్నాయని నమ్మిన అప్పికొండస్వామి భక్తుడి కథ ఇది. చిత్రవిచిత్రమైన మలుపులతో సాగుతుందీ సినిమా. వెలుతురు కన్నా సినిమాలో మసకచీకటే ఎక్కువ కనిపిస్తుంది. సంభాషణలు తక్కువ, పంచ్ డైలాగుల్లేవు. సినిమా చాలా మందికి అర్థం కాలేదు. నా సమీక్ష చదివాకే ఈ సినిమా అర్థం అయ్యిందని చాలా మంది రాశారు. ఈ సమీక్ష చదివే శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావుగారు నన్ను అభినందించి, పరిచయం చేసుకున్నారు.

సుబ్బారావు కూడా, "ప్రతీ నెలా సినిమా సమీక్ష కోసం పేజీలు కేటాయించాను. రాయదగిన సినిమా మీద రెవ్యూ రాయి" అన్నాడు. దాంతో నేను సినిమా సమీక్షకుడి అవతరం ఎత్తాను. అప్పటికి నేను స్టూడెంట్ కుర్రాణ్ని కదా... సినిమా చూడాలంటే ఇంట్లో డబ్బులడిగి టిక్కెట్టు కొని చూడాలి. ఆ రోజుల్లో జర్నలిష్టులకు పాస్ పంపి సమోసా, టీ ఇచ్చి సినిమా చూపించేవారట. మనది చిన్నపత్రిక కాబట్టి ఆ అవకాశం లేదు.

మనవూరి పాండవులు, ఒకవూరి కథ, మేమూ మనుషులమే, పదహారేళ్ల వయసు, ప్రాణం ఖరీదు, చలిచీమలు. సత్యం శివం సుందరం ఇవన్నీ ఆ రోజుల్లో నేను స్పందనవాణిలో సమీక్ష చేసిన సినిమాలు. జాన్ అబ్రహామ్ తీసిన అగ్రహారిత్తిళ్ కళుదై (అగ్రహారంలో గాడిద) సినిమా విజయవాడ ఫిలిం సొసైటీలో చూసి, సమీక్ష చేశాను. జాన్ అబ్రహామ్ గారు అప్పట్లో విజయవాడ వస్తే, కాట్రగడ్డ నర్సయ్యగారి అధ్యక్షతన విఫిసో సభ ఏర్పాటు చేసింది. నేను ఆయన్ని వ్యక్తిగతంగా కలిసి ఇంటర్వ్యూ చేసి స్పందనవాణిలో ప్రచురించాను. దివిసీమ ఉప్పెనకు ఊళ్లు కొట్టుకు పోతుంటే బెజవాడ జనం ఆరేసుకోబోయి పారేసుకుంటున్నారని సౌజన్య వారపత్రికలో ఒకసారి ఘాటుగా రాశాను కూడా.

స్పందనవాణి మాసపత్రిక ఏడాదికి పైగానే నడిచింది. సుబ్బారావు యల్.ఐ.సిలో ఉద్యోగిగా ఉన్నాడు. ముగ్గురు ఆడపిల్లలు. స్థితిమంతుడేమీ కాదు.. విహారి గారు ధార్వాడ్‌లో ఉన్నారప్పుడు. స్పందనవాణి పత్రికకు సీనియర్ రచయిత్రి అక్కల సరస్వతీబాబురావు గారు సంపాదకురాలు. అన్నీ తానై సుబ్బారావు పత్రికని తెచ్చేవాడు. అమ్మకాల మీద వచ్చే ఆదాయం కన్నా వ్యయం అనేక రెట్లు ఎక్కువ ఉండేది. ప్రతీనెలా చేతులు కాల్చుకొంటున్నాడు సుబ్బారావు. దూరంగా ఉన్నా విహారిగారు ఇదంతా గమనిస్తున్నారు.

ఒక దశలో పూర్తిగా డబ్బులు తెచ్చి పెడితేనే సంచిక బైటకొచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇలా ఎంతకాలం? భవిష్యత్తులో వాణిజ్య ప్రకటనల్లాంటివి వచ్చే ఆశలేదు. ప్రతిష్ఠకు పోయి, భార్యతాళి అమ్మటానికి సుబ్బారావు సిద్ధమయ్యాడని తెల్సింది.

విహారిగారు నాకూ, సోమయాజి గారికీ ఉత్తరాలు రాశారు. సుబ్బారావుని ఇంక ఇక్కడితో ఆపాలి. ఇంట్లో వాళ్లని ఏడ్పించి మనం చేసే సాహిత్య సేవ వలన ప్రయోజనం ఏమిటీ?" అని! విహారిగారి మాట వేదవాక్కే! సుబ్బారావు మొండిగా ఉన్నా అందరమూ కలిసి బలవంతంగా ఆ పత్రికని ఆపు చేయక తప్పలేదు. సుబ్బారావుతో ఉన్న వాళ్లం ఎవరమూ నోట్లో బంగారపు చెంచా పెట్టుకున్నవాళ్లం కాదు. పనంటే రేయింబవళ్ళూ చేయగలం. సంకల్పసిద్ధి ఉన్నవాడు కాబట్టి, సుబ్బారావు ఏణ్ణార్థానికి పైగానే ఆ పత్రికని చేతులు కాల్చుకొని పోషించాడు. స్వంతంగా ఒక పత్రిక పెట్టి వాణిజ్యపరంగా నడిపి ఉంటే అది ఎలా ఉండేదో... ఊహాజనిత ప్రశ్నలకు జవాబుండదు.

మా రమక్క

పిల్లలు పెద్దవాళ్ళయ్యేవరకూ సుబ్బారావు సతీమణి గుత్తికొండ రామరత్నం గారు ఒక సాధారణ గృహిణి. దైవభక్తి పరాయణురాలు. నెమ్మదిగా సంసారం చక్కదిద్దుకున్నారు. స్వంత ఇంటిని సమకూర్చుకున్నారు. పిల్లల్ని సాంకేతిక రంగంలో ఉన్నత విద్యావంతులుగా, నిపుణులుగా తీర్చిదిద్దారు.

పిల్లలు ముగ్గురూ అమెరికాలో స్థిరపడగలగటంలో పెల్లుబికిన ఆత్మ విశ్వాసమే ఎంతైనా కారణం. ఆమెలో ఒక తల్లి, ఒక భార్య మాత్రమే కాదు, ఒక పారిశ్రామికవేత్త కూడా ఉన్నారు. కుటుంబానికి తన అవసరం ఉన్నదనుకున్నప్పుడు ఆమెలోంచి ఆ పారిశ్రామికవేత్త బయటకు రావటంతో ఆమె సత్తా చాటుకోగలిగారు. అంచెలంచెలుగా ఎదిగి ఆమె ఒక సాధికారికతను సాధించారు.

1983లో సుబ్బారావు కేవలం రమగారి మీద ఆధారపడ గలననే నమ్మకం కుదిరిన తరువాతే, స్వంతంగా "స్పందన ప్రింటర్స్" సంస్థ ప్రారంభించారు. అది

రమగారి ప్రెస్సుగా ప్రసిద్ధి పొందింది. పదేళ్ళ పాటు నడిచింది. పేదింటి పెళ్ళికూతురు పెళ్ళికార్డుకు రమగారి ప్రెస్సులో డబ్బులు తీసుకోరని బందరులో గొప్ప పేరుండేది.

ఒక మహిళా ముద్రాపకురాలిగా రమగారు వాసికెక్కడానికి సుబ్బారావు ఆమె కిచ్చిన స్వేచ్ఛ, ప్రోత్సాహం, శిక్షణ గొప్పవి. బందరు లయన్స్ క్లబ్ వారు ఉత్తమ ముద్రణాలయాధిపతిగా గుర్తించి ఆమెను సత్కరించారు. "లివ్ అండ్ లెట్ లివ్ అన్నారు కదా" అనే వారామె! సుబ్బారావు గారు సీట్లో ఉంటే రచయితల దగ్గర ప్రింటింగ్ డబ్బులు తీసుకునే వారు కాదు. ఇలా ఔదార్యాలతోనూ, వితరణలతోనూ ఆ దంపతులిద్దరూ ప్రెస్సుని పదేళ్ళపాటు నడపగలిగారంటే ఆశ్చర్యమే! లెటర్ ప్రెస్సు రోజుల్లోంచి ఆఫ్‌సెట్ ప్రెస్సుల్లోకి సమాజం మళ్లటం కారణంగా రమగారి ప్రెస్సు మూతపడక తప్పలేదు. అయినా నిరుత్సాహ పడకుండా ఆమె ప్రత్యామ్నాయ పరిశ్రమల వైపు దృష్టి సారించారు.

ఏ అదృశ్యశక్తి ప్రేరణో గానీ, ఆమె అచ్చుపరిశ్రమ నడిపిన ఇంట్లోనే అప్పచ్చుల పరిశ్రమ ప్రారంభించారు. 1993లో గృహప్రియ ఫుడ్స్ సంస్థను స్థాపించారు. శ్రీ శ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు, ప్రమీల దంపతుల ప్రోత్సాహం ఇందుకు కొంత కారణం అని సుబ్బారావు చెప్పేవారు. విజయవాడ స్వగృహఫుడ్స్ అధినేతలు కిషోర్, విజయ కుమారి దంపతుల సహకారం, సలహా సూచనలతో ఆహార పరిశ్రమను స్థాపించా రామె. కిషోర్ దంపతుల చేతులమీదుగానే ఆ పరిశ్రమను ప్రారంభింప చేశారు.

రమగారి గృహప్రియ ఫుడ్స్ పరిశ్రమ వలన అనేకమంది మహిళలకు జీవనోపాధి లభించింది. పరిశమ లాభసాటిగా మారింది. ఈ సంస్థ రమ గారి చిరకాల కల. కానీ, ఆమె ఒక స్థాయికి ఈ సంస్థను తీసుకువచ్చే లోగానే ఆమె అనారోగ్యం పాలయ్యారు. Crohn's Disease అనే దీర్ఘవ్యాధి ఆమెను భయంకరంగా ఆవహించింది. పరమ నిష్టాగరిష్టంగా ఉండే రామరత్నం గారికి పేగుల్లో పలుగులు దిగినట్టు పేగుపూత ఏర్పడి, అది ముదిరి, Ulcerative Colitis గా మారింది.

అఘట ఘటనా సమర్థుడైన భర్తని, అనితర సాధ్యం అనదగిన ప్రతిభా వ్యుత్పత్తులు కలిగిన ముగ్గురు రత్నాల్లాంటి కుమార్తెల్నీ ఇచ్చినా, ఆమెకు ఆరోగ్యం ఇవ్వలేక పోయాడా విధాత.

15 సంవత్సరాల పాటు ఆమె ఆ వ్యాధితో సతమతమయ్యారు. తగ్గటం, తిరగబెట్టటం ఒకదాన్ని వెన్నంటి ఒకటిగా వస్తుంటాయి వ్యాధిలో. అయినా ఆమె ధైర్యం చెక్కు చెదర లేదు. ఆమె వ్యాధితో పోరాటానికే సిద్ధపడ్డారు.

నేనూ, మా ఇల్లాలూ ఒకసారి ఆమెను పలకరించటానికి వాళ్లింటికి వెళ్ళాము. ఆ సమయంలో సుబ్బారావు అమెరికాలో ఉన్నారు. అనారోగ్యంతో ఉన్నప్పటికీ,

పైన హాల్లో కూచుని, కింద షాపులోనూ, పరిశ్రమలోనూ జరిగేదంతా సి.సి.కెమెరాల సాయంతో టీవీలో చూసుకుంటూ ఆమె సంస్థను తన కనుసన్నల్లో నడిపించేవారు.

"పిల్లల్ని పెద్దవాళ్లను చేశాను. కష్టపడి పెంచాను. వాళ్ళు నా కళ్ళముందు కాకుండా వేలమైళ్ల దూరంలో స్థిరపడ్డారు. ఈ కంప్యూటర్లు ఉండబట్టి రోజూ చూసుకుంటూ మాట్లాడగలుగుతున్నాను. లేకపోతే కార్డుముక్కలకే పరిమితం కదా మానవసంబంధాలు" అన్నారామె మా ఇల్లాలితో. మా పిల్లలూ దేశ విదేశాల్లో ఉండటంతో మా ఇల్లాలు కూడా అదే ఆవేదనని ఆమెతో పంచుకుంది.

"ఇప్పుడు ఈ పరిశ్రమే నా సర్వస్వం. వీళ్ళంతా నా పనివాళ్ళు కాదు, నా పిల్లలు" అంటూ ఆ టీవీలో సిసి కెమెరా దృశ్యాలవైపు చెయ్యి చూపించారు. "నా చివరి రోజున కూడా మా ఇంట్లో ఇదే దృశ్యం కనిపించాలి" అన్నారామె. వ్యాధి వశాన ఆరిపోయిన కుంపటి అంటే ఎలా ఉంటుందో ఆమె అలా అయిపోయారు. అయినా, ఆత్మబలం ఆవగింజంత కూడా సడలలేదు.

"అక్కా! నీ మనోబలమే నీకు ఆయుష్షు. నీకు స్వచ్ఛంద మరణమే ఉంటుంది. నువ్వు పుణ్యాత్మురాలివి" అన్నాన్నేను.

"అనారోగ్యం పేరు చెప్పుకుని దిగులు పడితే రోజుకు రోజు ఆయుష్షు తగ్గిపోతుంది పూర్ణచందూ..! నువ్వు డాక్టరువి కదా! నీకు చెప్పేదేముందీ? ఈ మాత్రమైనా ఆరోగ్యం ఉన్నందుకు సంతోషిస్తే రోజుకు రోజు ఆయుష్షు పెరుగుతుంది. చెయ్యవలసినవి చాలా ఉన్నాయి. అన్ని చేశాకే వెళ్తాను...నాకా నమ్మకం ఉంది" ఇవీ మాతో ఆమె అన్న మాటలు. మరణించటానికి కొద్ది కాలం ముందు, అంత అనారోగ్యంలోనూ ఆమె రోటరీ మహిళా విభాగం వారి ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్త పురస్కారాన్ని వెళ్ళి అందుకున్నారు. మంచాన పడటం అనే దృశ్యాన్ని కలలో కూడా కనిపించటానికి ఇష్టపడని వ్యక్తిత్వం ఆమెది.

విజయవాడలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో పరమపదించారు. నిజానికి ఆస్పత్రిలో చేరాక పర్వాలేదని ఐసీయూలోంచి రూములోకి మార్చారు. ఇంకా మూడో అమ్మాయి కవిత వీసా ఇబ్బందుల వల్ల రావటం ఆలస్యం అయ్యింది. ఆమె కూడా వచ్చే వరకూ ప్రాణాలు ఉగ్గబట్టుకున్నారు. కృత్రిమశ్వాస మీద బతికించటమే తప్ప బ్రతకటం అసాధ్యం అన్న సంగతి ఆమెకు అర్థం అయిపోయింది.

ముగ్గురు పిల్లల్నీ చూసుకున్నాకే పూర్తి స్పృహలోనే ఉండి, వెంటిలేటరుకు సంబంధించినవన్నీ తీయటానికి డాక్టర్లను అనుమతించి ఆమె స్వచ్ఛంద మరణం పొందారు. మరణించే ముందు కూడా తనకు సేవ చేసిన నర్సులకు ఇతర సిబ్బందికీ బట్టలు పెట్టమని నగదు ఇవ్వమనీ ఆమె సుబ్బారావుని పురమాయించారు.

బుద్ధప్రసాద్ గారు పరామర్శించటాని కొస్తే, ఆమె తాను ఆసుపత్రిలో ఉన్నానన్న సంగతే మరిచి చక్కగా మాట్లాడారు. ఆ స్థితిలో కూడా గొంతులో వీసమంత నీరసం కూడా లేదని ఆయన ఆశ్చర్యపోయారు.

మరణానంతరం శంకర నేత్రాలయకి ఆమె నేత్రాలు దానం చేశాము. ఆ ఇద్దరి కళ్ళతో ఆమె సజీవంగా చూస్తూనే ఉందీ లోకాన్ని!

డా॥ ధన్వంతరీ ఆచార్య మచిలీపట్టణంలో ప్రసిద్ధ వైద్యులు. సుబ్బారావుకు కుటుంబపరమైన స్నేహితులు. సాహితీవేత్త కూడా! గమనం పుస్తకంలో ఆయన గుత్తికొండరామరత్నంగారి గురించి ఇలా రాశారు:

"ముచ్చటగా రచ్చ గెలిచిన సుబ్బారావుగారు ఇంటకూడా గెలవటానికి ముమ్మూర్తులా సహకరించిన ఆదర్శ గృహిణి శ్రీమతి రామరత్నం గారు. ఆమె అందరి మన్ననలను అందుకొన్న యజమానురాలు. సుబ్బారావు గారి కుటుంబంలోని మాధుర్యాన్ని అందరికీ పంచాలనే సుహృద్భావంతో 1993లో "గృహప్రియ" సంస్థను స్థాపించి అనుకొన్నంత పనిచేసి చూపించారు.

పనివారి సాధక బాధకాలను గుర్తించిన యజమానురాలుగా రామరత్నం గారు కొన్నిసార్లు వైద్య సలహాల కోసం నా వద్దకు పంపేవారు. ఆమె చూపిన శ్రద్ధ, ఆప్యాయతలను ఈ నాటికీ పనివారు మరువలేదంటే అతిశయోక్తి కాదు. ఆమె యొక్క వియోగం సుబ్బారావుగారి ధృతిని తాత్కాలికంగా అడ్డుకొన్నా, గుండె దిటవుతో సంస్థను నడిపిస్తూ ఆమె పేరిట ఒక చారిటబుల్ ట్రస్ట్ (2014) స్థాపించి ఇతోధిక సామర్థ్యంతో సేవా కార్యక్రమాన్ని చేస్తున్న శ్రీ సుబ్బారావు గారు బహుధా అభినందనీయులు" అని!

స్పందన, కృ జి ర సం అంత బాగా పనిచెయ్యగలిగాయంటే అందులో రమక్క పాత్ర గణనీయం. సభలకు ఆమె కూడా వచ్చేవారు. మాతో పాటు అనిచేసేవారు. బందరులో ఏ సభ జరిపినా అతిథులుగా వచ్చిన రచయితలు సుబ్బారావు ఇంట్లో రమక్క చేతి వంట తిని వెళ్లాల్సిందే! ఒరిస్సాలో ఉండే డి. కామేశ్వరి గారు పిల్లలతో వచ్చి సుబ్బారావు వాళ్లింట్లో రెండు రోజులుండి వెళ్ళారు. వాసిరెడ్డి సీతాదేవి, ఇంద్రగంటి జానకీబాల వీళ్ళంతా రమక్క ఆతిథ్యం తీసుకుంటూ రోజుల తరబడీ వాళ్లింట్లో ఉన్నవాళ్లే!

కార్యవర్గ సమావేశాలు వాళ్లింట్లో జరిపినప్పుడు రమక్క పెట్టే గారెలు తిని త్రేన్చాల్సిందే ఎవరైనా!

1980ల్లో బందరులో బ్రాయిలర్ కోడి మాంసం దొరికేది కాదు. విజయవాడ గవర్నర్ పేటలో నవోదయ చికెన్స్ పేరుతో ఓ మిత్రుడు బ్రాయిలర్ కోడిమాంసం

అమ్మేవాడు. అతనూ సాహిత్యాభిమానే! కొన్నాళ్లు నవోదయ రామ్మోహనరావుగారితో పనిచేసినట్టున్నాడు కూడా! అతను నన్ను బాగా అభిమానించేవాడు. నాకైతే కేజీ ప్యాకెట్టు 20 రూపాయలకే ఇచ్చేవాడు. నేను బందరు వెడుతూ ఓ కేజీ ప్యాకెట్టు తప్పనిసరిగా తీసుకెళ్లేవాణ్ణి. రమక్కతో వండించుకుని అందరమూ తినేవాళ్లం!

అంతకు మునుపు మాంసం రుచి ఎలా ఉంటుందో నాకు తెలీదు. రమక్క వండినది తినటమే మొదటిసారి. రుచి మీద ఆమెకి అధారిటీ ఉందనుకునే వాణ్ణి. రమక్క చేతి వంటను బాగా ఆస్వాదించిన వారిలో బుద్ధప్రసాద్ గారూ ఉన్నారు. 'సుబ్బారావు నేనూ @50' పుస్తకం రాస్తున్నాననంటే, ఆయన వెంటనే అన్నారు: "మీ ఇద్దరి కథ అంటే, అది కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆత్మకథే అవుతుంది. అందులో రామరత్నంగారిది ప్రధాన పాత్ర. ముఖ్యంగా ఆమె వండి వడ్డించే తీరు గురించి నువ్వు రాయటం మరిచిపోకు. వాళ్లింట్లో మీటింగు అంటే మంచి విందు దొరుకుతుందని అర్థం" అని!

నిజంగానే ఆహార విధానం మీద రమక్క అధారిటీ! ఆమె 1993లో స్థాపించిన 'గృహప్రియ ఫుడ్స్' సంస్థ అనతికాలంలోనే నిలదొక్కుకుని విజయవంతం అయ్యిందంటే రుచి మీద ఆమెకు అధికారం ఉండటమే కారణం.

కలలు కనేవాడే కార్యకర్త

కార్యకర్తృత్వాన్నిఒక విగ్రహంలా పోతపోస్తే, ఆ విగ్రహం సుబ్బారావు ఆకారంలో ఉంటుందని నేను చాలా సార్లన్నాను. కార్యక్రమాల నిర్వహణ కోసం భార్యమెడలో తాళిబొట్టును అడిగేంత కార్యకర్త మరొకరు మీకు కనిపిస్తే, బహుశా ఆయనలా ఉండవచ్చుని ఒప్పుకుంటాను. ఇది పొగడ్త కాదు. ఇప్పుడు ప్రత్యేకంగా సుబ్బారావుని పొగడాల్సిన అవసరం లేదు. అది నన్ను నేను పొగుడుకున్నట్టు కూడా! జంటకవులు ఒకరి గురించి ఒకరు మాట్లాడుతుంటే అలానే ఉంటుంది.

సాహితీ కార్యకర్త ఉన్నత ఆదర్శాలకు అంకితంగా జీవిస్తాడు. ఇల్లూ, వాకిలికి రెండో ప్రాధాన్యత నిస్తాడు. ఆరింటికి మీటింగ్ అంటే ఆరున్నరకు నీటుగా డ్రెస్ చేసుకుని వచ్చేవాళ్ళు జీవితంలో ఎన్నటికీ కార్యకర్తలు కాలేరు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, తగిన పథక రచన చేసుకుని, అవరోధాలను అధిగమిస్తూ మహదానందానుభూతిని పొందుతాడు నిజమైన కార్యకర్త.

ఒక కార్యక్రమం కోసం తపించీ తపించీ ఒక తపస్సులా పనిచేయగలిగితేనే ఆ కార్యక్రమంలో నాణ్యత కనిపిస్తుంది. అదే 'బంగారుకలలు' కనడం అంటే. 'కలలు కనే వాడే కార్యకర్త' అంటాడు సుబ్బారావు.

అరసం జాతీయ కార్యదర్శి నాకూ, సుబ్బారావుకూ చిరకాల మిత్రుడు, సాహితీ వేత్త పెనుగొండ లక్ష్మీనారాయణ సుబ్బారావు గురించి ఆత్మీయవాక్యాలు రాస్తూ ఇలా అంటారు:

"అరసం గుంటూరు జిల్లా అధ్యక్షులుగా ఉంటూ మృతిచెందిన పులుపుల వెంకట శివయ్య గారి పేరిట 1980లో ప్రారంభించిన సాహితీ సత్కారాన్ని 1981 నవంబర్ 14న ఉత్తమ సాహితీసంస్థగా స్పందన సాహితీ సమాఖ్యని గుర్తించి ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి అయిన గుత్తికొండ గారికి గుంటూరులో అరసం అందజేసింది. ఆ విధంగా అరసం గుత్తికొండ వారి కృషిని గుర్తించి గౌరవించింది. చాలామంది కార్యకర్తలు వయోభారం వలన, ఆర్థిక, కుటుంబ సమస్యల వలన వేరే ప్రాంతాలకు వెళ్లటం వలన, వ్యక్తిగత కారణాలవలన కార్యకర్తృత్వం ఆపేస్తారు. మానేస్తారు. అలా చేసిన వారు చాలా మంది ఉన్నారు. సుబ్బారావుగారు మాత్రం తాను యవ్వన ప్రాయంలో ఎత్తిన సాహిత్య పతాకను డెబ్బై యేళ్లు పైబడినా దించలేదు. ఇంకా ఆ పతాకను తన తరువాత తరం వారికి అందజేస్తున్న అరుదైన కార్యకర్త. తెలుగు కోసం తెలుగు వెలుగు కోసం సాహిత్యం కోసం సామాజికాభ్యుదయం కోసం జీవన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న సుబ్బారావుగారు సూపర్ కార్యకర్త" అని! కార్యకర్త ఎలా ఉండాలో ఈ వాక్యాలు రుజువు చేస్తాయి.

సాహితీ సంస్థలు కూడా ప్రాపంచిక విషయాలపట్ల అవగాహన కలిగి, అవగాహన పెంపు చేసే కార్యక్రమాలు నిర్వహిస్తూంటే అన్ని వర్గాల రచయితల ఆదరణాభిమానాలను పొందేందుకు అవకాశం ఉంటుంది.

సోవియట్ సోషలిస్ట్ యూనియన్ పతనం, తూర్పు యూరప్ పరిణామాల నేపథ్యంలో తెలుగు సాహిత్యంలో రావలసిన మార్పుల గురించి మహాసభలు నిర్వ హించినప్పుడు చాసో, ఏటుకూరి బలరామమూర్తి, సోమసుందర్, ఒకరేమిటీ మార్క్సిస్టు రచయిత లెందరో ఆ సభలకు విచ్చేశారు. సాహితీసంస్థలు రచయితలకు మార్గనిర్దేశిగా ఉండాలని సుబ్బారావు కలలుగనేవాడు. దాన్ని అందరికీ అంటించేవాడు.

1975లో కృష్ణాజిల్లా రచయితల మహాసభలుచేయటం ఒక కల. 1978లో ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభలు చేయటం మరో కల. 1979లో స్పందనవాణి మాసపత్రిక నిర్వహించటం ఇంకో కల. 1981లో తెలుగు సాహితీ సంస్థల సమన్వయ సమాఖ్య వ్యవస్థాపన, 1982లో అవనిగడ్డలో కృష్ణాజిల్లా రచయితల 5వ మహాసభల నిర్వహణ, 1983లో కృష్ణాజిల్లా రచయితల సంఘం స్థాపన ఇవన్నీ కలల పర్యవసానాలే!

ఒకసారి ఇదే చర్చ వచ్చింది. "కార్యకర్త నిద్రపోకూడదంటావు, కలలు కనాలంటావు...రెంటికీ పొంతన ఎలా కుదుర్తుందయ్యా?" అనడిగారు శ్రీ విహారి.

ఆయన నాకు వత్తాసుగా వచ్చారన్నమాట. అప్పటికి నా వయసు 20 యేళ్ళుంటాయి. దానికి సుబ్బారావు "నేను కనాలన్నవి నిద్రపోయి కనే కలలు కాదు, నిద్రపోనీకుండా చేసే కలల గురించి..." అన్నాడు! నిజమే! అంత కార్యభారం నెత్తికెత్తుకున్నప్పుడు కార్యకర్తకు నిద్రెలా వస్తుంది? అనితర సాధ్యంగా విజయవంతం చేయాలనే మన కలని సాకారం చేయాల్సిన బాధ్యత మనదే! అందుకోసం పనిచెయ్యాలి. కలలు కనకుండా అంటే లక్ష్య నిర్దేశం లేకుండా కార్యసాధన ఎలా సాధ్యం?

పెన్ను లేకుండా పనిలోకి రాకు

ఇదంతా ఎప్పుడో 1979లో సంగతి. బందరులో "ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభలు" నిర్వహిస్తున్నాం. మొదటి సదస్సు పూర్తవుతోంది. తరువాతి సదస్సుకు ఎజెండాలో మార్పులు చేయాల్సి వచ్చింది. మార్పులతో మళ్ళీ రాయమని సుబ్బారావు నన్ను పురమాయించాడు. నేను జేబులో పెన్నుకోసం వెదుక్కొంటున్నాను. అది ఎవరో సంతకం పెడతానికి తీసుకున్నారు. తిరిగి ఇవ్వలేదు. పెన్నుకావాలన్నాను. అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు సుబ్బారావు. పెన్నులేకుండా సభా నిర్వహణకు దేని కొచ్చావ్ అన్నాడు. గాడిదలు కాయటానికి పెన్నుతో పనిలేదు అన్నాడు. ఆ నాటి నుండీ జేబులో పెన్ను లేకుండా ఇంట్లోంచి బైటకు రాను. ఎవరైనా పెన్ను అడిగితే మూత నా చేతిలో పెట్టుకుని పెన్ను మాత్రమే ఇచ్చే అలవాటు చేసుకున్నాను. తీసుకున్న వాళ్లు చచ్చినట్టు తిరిగి ఇస్తారని లావు పెన్నులు వాడటమే మొదలుపెట్టాను. మొన్నమొన్నటి దాకా ఇంకుపెన్నులే వాడేవాణ్ణి. మూత లేకుండా ఇంకుపెన్నిస్తే వెదుక్కొంటూ వచ్చి తిరిగిస్తారని! పెన్ను లేకుండా సభానిర్వహణకు రాకూడదనేది సుబ్బారావు పాఠం.

పేర్లు రాయటం సభామర్యాద కాదుగానీ, ఒకసారి ఎవరిదో సభ జరుగుతోంది. దాని నిర్వాహకుడే సభాధ్యక్షుడిగా ఉన్నాడు. ఆయన ఏ వక్తనీ మాట్లాడనీయటం లేదు. మాట్లాడుతున్న వ్యక్తి చేతుల్లోంచి మైకు లాక్కుని ఈయనే మాట్లాడటం ఎక్కువయ్యింది. సభంతా గందర గోళంగా ఉంది. సైలెన్స్‌గా ఉండమని అరిచాడా నిర్వాహకుడు. ఎవ్వరూ పట్టించుకోలేదు. ఎవరి గోల వారిదిగా ఉంది. అప్పుడు వేదికపైన ఉన్న సుబ్బారావు సదరు నిర్వాహకుడితో అన్నాడు... "అయ్యా! మీరు కొద్దిసేపు మైకు పుచ్చుకోకుండా ఉంటే గందరగోళం అదే తగ్గుతుంది. మీరు పిలిచిన వాళ్లని సజావుగా మాట్లాడనివ్వండి. సభారంజకత్వం అంటే ఏమిటో ఆ వక్తలకు తెలుసు" అని సున్నితంగా అన్నాడు.

"ఇంత సున్నితంగా మాట్లాడటం ఎప్పటినుంచి నేర్చుకున్నాడీ సుబ్బారావు?' అని చాలా మందికి అనిపించింది. కానీ, అరిచేవాడితో కలిసి అరిస్తే ఉపయోగం

లేదని, నిదానించి చెప్పటం సుబ్బారావుకి తెలుసు కూడా! ఇవన్నీ గమనిస్తూ డూస్ & డోంట్స్ చాలా నేర్చుకున్నాను. ఈ యాభై యేళ్లకాలంలో ఇద్దరం కలిసి కనీసంలో కనీసం వెయ్యి కార్యక్రమాలైనా నిర్వహించి ఉంటాం. ఎన్ని చేసినా ప్రతీ కార్యక్రమమూ ఒక కొత్త అనుభవాన్నే ఇస్తుందనిపిస్తుంది.

కృష్ణాజిల్లా రచయితల సంఘం స్థాపన

1967, 1968, 1970 లలో శ్రీ కాలనాథభట్ట వీరభద్రశాస్త్రి, శ్రీ విహారి, శ్రీ నండూరి రామమోహనరావు, శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య, శ్రీ యం. వి. యల్ ప్రభృతుల ఆధ్వర్యంలో నవ్యసాహితీసమితి సహకారంతో కృష్ణాజిల్లా రచయితల మహాసభలు జరిగాయి. సాంకేతికంగా ఈ సంఘాన్ని 1982లో స్థాపించినా, 1983లో రిజిష్టర్ చేసినా, 1967 నుండీ దీని మూలాలు బలంగా ఉన్నాయి. ఆ మూలాలతో ముడిపడిన పెద్దాయన కాలనాథభట్ట వీరభద్రశాస్త్రిగారిని మేం కృష్ణాజిల్లా రచయితల సంఘ వ్యవస్థాపకుడుగా గౌరవించుకొంటూ ఉంటాం. ఆ విధంగా కృష్ణాజిల్లా రచయితల సంఘానికి ఇప్పుడు 56 యేళ్లు. 1983లో కృష్ణాజిల్లా రచయితల సంఘాన్ని రిజిష్టర్ చేశాక విజయవాడలో సభ పెట్టి శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి చేతులమీదుగా కృష్ణాజిల్లా రచయితల సంఘాన్ని ప్రారంభించాము.

మండలి వేంకట కృష్ణారావుగారు గౌరవాధ్యక్షుడిగా, ముక్కామల నాగభూషణం గారు అధ్యక్షుడిగా, కళాప్రపూర్ణ తెన్నేటి హేమలత, డా. త్రిపురనేని వెంకటేశ్వరరావు, కవిసమ్రాట్ పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారలు ఉపాధ్యక్షులుగా, గుత్తికొండ సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, శ్రీ బుద్ధప్రసాద్, డా. జి. వి. పూర్ణచంద్ కార్యదర్శులుగా, శ్రీ మైత్రేయ కోశాధికారిగా, తొలి కార్యవర్గం ఏర్పడింది. యమ్మార్, దాశరథి, సినారే, కుందుర్తి, ముసునూరి జగన్నాథరావు ప్రభృతులు సలహా సంఘంలో ఉండేవారు.

1979-80లలో సంగతి. విజయవాడలో విజయసాహితి సంస్థ బాధ్యతలు నేనూ ఇంద్రగంటి జానకీబాలగారూ నిర్వహిస్తున్నాం. సుబ్బారావు స్పందన సాహితీ సమాఖ్య బరువుని భరిస్తున్నాడు. నేను కూడా అందులో కార్యదర్శిగా ఉన్నాను. మినీకవితా ప్రచారం కోసం మినీకవితా ప్రదర్శనలు ఊరూరా ఏర్పాటు చేస్తూ యువరచయితలను సమీకరిస్తూ ఒక ఉద్యమ స్ఫూర్తిని కలిగించటానికి నేను ఎక్కువ సమయం వెచ్చిస్తున్నాను. రావిరంగారావు నేనూ దేశం అంతా విస్తృతంగా పర్యటిస్తున్నాం. బుద్ధప్రసాద్ గారు గాంధీక్షేత్రం పత్రికను నడుపుతున్నారు. మా అందరికీ కృష్ణాజిల్లా రచయితల సంఘం బాధ్యతలు అదనం అయ్యాయి.

నాగభూషణంగారి అధ్యక్షతన కృష్ణాజిల్లా రచయితలసంఘం వేగంగానే కార్యక్రమాలు నిర్వహించింది. ఎక్కువ కార్యక్రమాలు విజయవాడలోనే నిర్వహించటంతో

విజయవాడలో చేయాల్సిన పనులు నామీదే ఎక్కువగా ఉండేవి. నేను విద్యాధర పురంలో ఉంటూ రోజూ మొగల్రాజపురంలో నాగభూషణం గారింటికి వెళ్లేవాణ్ణి. ప్రతీరోజూ ఉదయం 7 గంటలకల్లా "అమ్మాయ్! మీ ఆయన ఉన్నాడా?" అంటూ నాగభూషణంగారి ఫోన్ వచ్చేది. గడియారం తప్పు చూపించవచ్చేమోగానీ, ఆయన ఫోను సెకను కూడా తేడా ఉండేది కాదు. ఆయన 'అసురనాగరకత' పుస్తకం రాసేప్పుడు నేను వారి పక్కనే ఉన్నాను. నా సప్తసింధు నవలని చదివి మార్పులు కూర్పులతో పరిష్కరించి, ఆయనే అచ్చు వేయించారు. నాగభూషణం గారిని మెప్పించ గలిగానంటే ఇప్పటికీ ఆశ్చర్యమే!

సరిగ్గా అదే సమయంలో 1983లోనే, సుబ్బారావు స్పందన పింటర్స్ పేరుతో ఒక ప్రింటింగ్ ప్రెస్సు వ్యవస్థాపించారు, నేను నా ఆసుపత్రి మీదే ఎక్కువ దృష్టి పెట్టక తప్పలేదు. అయినా ఇద్దరికీ కృష్ణాజిల్లా రచయితల సంఘాన్ని వ్యాప్తిలోకి తేవటానికి సమయం వెచ్చించక తప్పలేదు.

1984లోతెలుగు విమర్శపైన, 1986లో తెలుగు నవలపైన, 1988లో తెలుగు కథపైన 1990లో క్షుద్ర సాహిత్యం పైన, 1992లో తూర్పు యూరప్ పరిణామాలపైన, 1994లో తెలుగు కవితపైన ఇలా ఒక్కోసారి ఒక్కో అంశం పైన మహాసభలు నిర్వహించాము. మొదటి నుండీ ఏ అంశం గురించైనా భారీ సభలు నిర్వహించి రచయితలను సమీకరించే కార్యక్రమాలు చేసే వాళ్లం. అందుకోసం అధిక వ్యయ ప్రయాసలను వహించే వాళ్లం

రచయితల సంఘం పునరుద్ధరణ

నాగభూషణం గారు జీవించి ఉన్నంత కాలం ఆర్థికపరమైన ఒడిదుడుకు లేకుండా అనితరసాధ్యంగా నిర్వహించ గలగటం మాత్రమే నేర్చినవాళ్లుగా పనిచేశాం.

కాలక్రమంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం పెద్దలు యం.ఆర్.గారు, మండలి వెంకట కృష్ణారావుగారు, ముక్కామల నాగభూషణంగారు, లతగారు, డా॥ త్రిపురనేని వెంకటేశ్వరరావుగారు, మైత్రేయగారు, యం.ఏ.మూర్తి ఇలా ఒక్కరొక్కరే ఈ లోకం నుండి నిష్క్రమించటంతో కృష్ణాజిల్లా రచయితల సంఘం అనాథ అయ్యింది.

ఇంక మిగిలిన వాళ్లం సుబ్బారావు, నేనూ, బుద్దప్రసాద్ గారు మాత్రమే! అయినా, కార్యక్రమాల జడివాన కురిపించ లేకపోయినా, అడపాదడపా చిరుజల్లులైనా కురిసేలా పనిచేస్తున్నాం. అయినా అది పూలమ్మినచోట పూసలమ్మటం లాంటిదే! 1994–2004 వరకూ ఒక దశాబ్దిపాటు ఇదే పరిస్థితి.

2004లో ప్రభుత్వం మారింది. బుద్ధప్రసాద్ గారు మళ్ళీ శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. ఒకరోజు బుద్ధప్రసాద్ గారు ఫోన్ చేశారు. "కృష్ణాజిల్లా రచయితల

సంఘం పునరుద్ధరిద్దాం, ప్లాన్ చెయ్యి” అని! నేను సుబ్బారావుకు ఫోన్ చేశాను. “నువ్వు వస్తానంటే నేను ఒప్పుకుంటాను” అని. “చేద్దాంలే...రేపో ఎల్లుండో నువ్వు కారేసుకుని అవనిగడ్డ వచ్చెయ్, నేను బందరు నుండి వస్తాను. అక్కడ మాట్లాడు కుందాం” అన్నాడు.

1982లో రచయితల సంఘానికి శ్రీకారం చుట్టిన స్థలంలోనే కూర్చుని 2004లో తిరిగి కృష్ణాజిల్లా రచయితల సంఘానికి జవసత్వాలు నింపాలనే నిర్ణయం తీసుకున్నాం. ఆ రోజు నుండీ ఈ 20 యేళ్ల కాలంలో మేం ముగ్గురమూ ఏనాడూ వెనక్కి చూళ్లేదు.

సుబ్బారావూ నేనూ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్

కృష్ణాజిల్లా రచయితల సంఘం పునరుద్ధరణ తరువాత శ్రీ బుద్ధప్రసాద్, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఈ ఇద్దరూ మా ఇద్దరి కాళ్లకు చక్రాలు కట్టారు. ఇంకా గట్టిగా చెప్పాలంటే, సుబ్బారావుగారినీ నన్నూ కలిపి చక్రానికి కట్టేశారు. బ్యాలెన్సు చేసుకోవటం మా వంతయ్యింది. సుబ్బారావు ఉన్నారనే ధైర్యంతో నా పని నేను చేసుకు పోతూ ఉండేవాణ్ణి. అందుకేనేమో, డా. రాళ్ళబండి కవితా ప్రసాద్ సుబ్బారావుని హార్డ్‌వేర్ అనీ, నన్ను సాఫ్ట్‌వేర్ అనీ వర్గీకరించారు. మా పని విభజన కూడా అలానే ఉండేది.

నాలుగు మూలస్తంభాలు

మొదటి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో సినారే “ఈనాటి సాహిత్య సౌధానికి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు, జి వి పూర్ణచందు– ఈ నలుగురూ నాలుగు స్తంభాలు” అన్నారు. ఈ మాటని ఆయన నాలుగు సభల్లో అన్నారు. మొదటి సారి ప్రపంచతెలుగు రచయితల తొలి మహాసభల్లో కాగా, రెండోసారి విశాఖపట్టణంలో మేడసాని మోహన్ గారికి ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గండపెండేరం తొడిగే కార్యక్రమంలో అవధానులందరి సమక్షంలో సినారె మళ్ళీ నాలుగు మూల స్థంభాల వ్యాఖ్యానం చేశారు. మూడోసారి ప్రపంచ తెలుగు రచయితల రెండవ మహాసభల్లోను, నాలుగోసారి హైదరాబాదులో “తెలుగు వ్యాసమండలి” బృహద్గ్రంథాన్ని కృష్ణాజిల్లా రచయితల సంఘం రూపొందించి బుద్ధప్రసాద్ గారికి అంకితం ఇచ్చే సభలో, నాటి కేంద్రమంత్రి దాసరినారాయణరావు, ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గార్ల సమక్షంలో సినారే గారు ఇదే వ్యాఖ్యానం చేశారు.

ఈ ఆశీర్వాదం నారాయణరెడ్డి గారినుండి పొందటానికి ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణ ఒక్కటే కారణం కాదు, తెలుగు భాషకు ప్రాచీనతా

హోదా సాధించే కార్యక్రమాలు, ప్రజల గుండెతలుపులు తట్టే కార్యక్రమాలు, భావి పరిశోధకులకు ఆకర గ్రంథాలెన్నో ప్రచురించటం లాంటి కార్యక్రమాలు చేపట్టిన కృష్ణాజిల్లా రచయితల సంఘం, దాని మూల స్తంభాలైన ఈ నలుగురూ చేసిన కృషి భాషోద్యమానికి ఎంతగానో తోడ్పడిందనే సంతోషంతో మా నలుగురినీ నాలుగు స్తంభాలుగా ఆయన అభివర్ణించారు. జన్మ ధన్యం అనదగిన ఇలాంటి అనుమోదాలెన్నో మేము చవి చూడగలిగాం. సుబ్బారావులోనూ, నాలోనూ అవి బాగా ఉత్సాహం నింపాయి

2009లో ఆచార్య శరజ్జ్యోత్స్నారాణి సుబ్బారావుకు జ్యోత్స్న కళాపీఠం సాహితీ పురస్కారాన్ని అందిస్తున్న సభలో సినారే "ఈ సభ యావత్తూ ఒక ఉత్తరం అనుకుంటే ఆ ఉత్తరం కింద సంతకం లాంటివాడు సుబ్బారావు" అని ప్రశంసించారు. ఆ మరుసటిసంవత్సరం ఆమె ఆ పురస్కారాన్ని నాకందించిన సభలో నారాయణరెడ్డిగారు "తెలుగు ప్రాచీనుడు పూర్ణచందు" అన్నారు.

అకాడెమీ కార్యవర్గంలో సుబ్బారావు

వైద్యవృత్తితో పాటు మినీకవితా ప్రదర్శనలు, విజయసాహితి కార్యక్రమాలు నిర్వహిస్తూన్నా రచనా వ్యాసంగాన్ని నేను మానలేదు. ఏదో ఒక పత్రికలో అచ్చులో కనిపిస్తూనే ఉన్నాను. సుబ్బారావుకి కార్యక్రమాలే ముఖ్యం. తానో రచయితననే సంగతి ఆయన పూర్తిగా మరిచిపోయాడు. ఊరంతా అలికి ఒక ఈగ తన ఇంటిపేరు మరిచి పోయిందట. సుబ్బారావు రచనా వ్యాసంగాన్ని పూర్తిగా మరిచిపోయాడు. మరిచి పోయాడనటం కన్నా రాయటాన్ని మానుకుని రాయని భాస్కరుడయ్యాడు. ఒకసారి ఇదేమాట కళాప్రపూర్ణ తెన్నేటి హేమలతతో అంటే, రాయనివాడు భాస్కరుడెలా అవుతాడు? అంది! రాసేవాడనే కాదు, రాయించేవాడు కూడా సాహితీవేత్తే కదా అన్నాను.

"రాసినా రాయకపోయినా సుబ్బారావు భాస్కరుడేలే! మనవాడు అం.ప్ర. సాహిత్య అకాడెమీలో సాధారణ సభ్యుడిగా కూర్చొని, ఏడాదికోసారి జరిగే జెనరల్ బాడీ మీటింగులో కాసేపు అరవటం తప్ప ప్రయోజనం ఏమీ కనిపించట్లేదు. అతన్ని ఎలాగైనా కార్యవర్గంలోకి లాగాలి... అన్నది లతగారు. "నువ్వు తలచుకుంటే అవుతుందమ్మా..." అన్నాన్నేను.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడేమీ కార్యవర్గం నుంచి పురిపండా అప్పలస్వామి గారు రిటైర్ కావటంతో అయన స్థానంలో కార్యవర్గ సభ్యుణ్ణి ఎన్నుకోవలసి వచ్చింది. బెజవాడ గోపాలరెడ్డిగారు అధ్యక్షులు. జెనరల్ బాడీ సమావేశంలో ఈ విషయమై చర్చ వచ్చింది. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా మూడు ప్రాంతాల నుండి సభ్యులుండే వాళ్లు. పురిపండావారు ఆంధ్రప్రాంతం వాడు కాబట్టి ఆంధ్రప్రాంతం నుంచే ఒక

సభ్యుణ్ణి కార్యవర్గంలోకి తీసుకోవటానికి జెనరల్ బాడి మౌలికంగా ఆమోదించింది. విశాఖపట్టణానికి చెందిన శ్రీ గణపతిరాజు అచ్యుతరామరాజుని ఆయన స్థానంలో నామినేట్ చేయాల్సిందిగా కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు ప్రతిపాదించారు.

అదెలా చేస్తారంటూ లేచి నిలబడి, సుబ్బారావు 'వీల్లే'దని బిగ్గరగా అరిచాడు. "ఆ ఒక్క పదవికీ ఎన్నికలు జరపండి. నామినేట్ చేయటం అన్యాయం" అన్నాడు. రామానుజరావు ఈ పరిణామంతో కొంత నిశ్చేష్టుడైనా తమాయించుకున్నారు. "ఇప్పుడు ఆయన మీద పోటీ చెయగల వారెవ్వరు?" అని అరిచారెవ్వరో! అంత దమ్ము లెవరికున్నాయన్నట్టుగా ఆ మాట ధ్వనించింది.

'నేను పోటీ చేస్తాను' అన్నాడు సుబ్బారావు. "ఈ పోటీ విధానపరమైన అంశం మీదే గానీ వ్యక్తిగతంగా గణపతిరాజువారి మీద కాదు. ప్రజస్వామ్య పద్ధతిలో అకాడెమీ పనిచేస్తోందన్న అభిప్రాయం ప్రజల్లో కలిగించాలంటే ఎన్నికలు నిర్వహించాల్సిందే" అన్నాడు.

"మీ పేరు ఒకరు ప్రతిపాదించాలి. ఇద్దరు మద్దత్తు ప్రకటించాలి" అన్నారు రామానుజరావుగారు. ఇప్పుడూ అంత దమ్ము లెవరికున్నాయన్నట్టే ధ్వనించింది.

ఎవ్వరూ ఊహించని రీతిలో ఓ కోయిల గొంతు " నేను ప్రతిపాదిస్తున్నాను" అన్నది. రేడియో అనౌన్సర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నదేమో ఆ గొంతు... "దమ్ములు నాకున్నాయి" అన్నట్టుగా బిగ్గరగా వినిపించింది. ఎవరా అని అందరూ అటు చూశారు. కళాప్రపూర్ణ తెన్నేటి హేమలత గారు! వెంటనే తడుముకోకుండా కొర్రపాటి గంగాధరరావు గారు లేచి "నేను సపోర్ట్ చేస్తున్నాను, నా పేరు రాయండి" అన్నారు. జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు, నిజామాబాద్ ఇందూరుభారతి ఎ. సూర్యప్రకాష్ ఇంకా అనేకులు మద్దతిస్తున్నామని లేచారు.

అంతా గమనిస్తున్న బెజవాడ గోపాలరెడ్డిగారు ఆలస్యం చేయకుండా కల్పించుకుని తన పొడవైన చేతులు చాచి అందరినీ కూర్చోమన్నారు. "రామానుజ రావుగారు సంపూర్ణ ప్రజస్వామ్యవాది. మనది ఒక పెద్ద సాహితీ సంస్థ. సాహితీ సంస్థల్లో ఏకనాయకత్వమే శరణ్యంగా ఉంటుంది. అందరూ కలిసి ఒకమాట అనుకుని దాని ప్రకారం ఎవరి పనులు వారు చేసుకుంటూ పోవాలే గాని, ఎన్నికల రాజకీయాలు ఇందులో ప్రవేశించకూడదని ఆయన అలా అన్నారు. సుబ్బరావన్నది కూడా నిజం. మనం బాగా పనిచేస్తున్నాం అన్నది వాస్తవమే గానీ పనిచేస్తున్నట్టు కనిపించాలి కూడా! అందుకని రామానుజరావుగారిని ఎన్నికలు నిర్వహించాలనే కోరుతున్నాను" అంటూ రూలింగ్ ఇచ్చారు.

ఎన్నికలు జరిగాయి. సుబ్బారావు కార్యవర్గ సభ్యుడిగా గెలిచారు. అందరి కన్నా ముందు అభినందించింది కార్యదర్శి దేవులపల్లి రామానుజరావుగారే! "అకాడెమీ పనితీరు గురించి, అకాడెమీ ఇచ్చే అవార్డుల గురించి, అకాడెమీ ప్రచురణల గురించి అనేక విమర్శలు వస్తున్నాయి. వీటి విషయం మీద మీయువతరం అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకోవాలనుకుంటున్నాను. అందుకని ఈ మూడింటి విషయమై మీరు అందరి అభిప్రాయాలను సమీకరిమ్చి ఒక నివేదిక ఇవ్వండి.. మీ అధ్యక్షతన ఏకసభ్య సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నాను" అన్నారాయన.

రామానుజరావుగారు దయార్ద్రహృదయుడు. సురవరం ప్రతాపరెడ్డిగారి కాలం వాడు. గోలకొండ పత్రిక సంపాదకుడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం, కేంద్ర సాహిత్య అకాడమీలలో మూడు దశాబ్దాలకు పైగా ప్రగాఢ అనుబంధాలు కలిగిన వ్యక్తి. సుబ్బారావు లాంటి నిబద్ధత కలవాడు అకాడెమీ కార్యవర్గంలోకి రావటాన్ని ఆయన స్వాగతించారని అర్థం అవుతుంది.

ఆనాటి అకాడమీలో నా సభ్యత్వం

కేంద్ర సాహిత్య అకాడమీ (నేషనల్ అకాడమీ ఆఫ్ లెటర్స్)కి అనుబంధంగా 1957 వ సంవత్సరంలో స్థాపించబడిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1985 వరకూ 30 యేళ్ల పాటు పనిచేసింది. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రముఖులు విహారి గారు 1973–78, గుత్తికొండ సుబ్బారావు (కార్యవర్గ సభ్యత్వం) 78–83, నేనూ, కీ.శే. యం. ఏ. మూర్తి, సుబ్బారావు 83–85, సాహిత్య అకాడెమీ ఎన్నికల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంతాల నియోజకవర్గం నుండి ఎన్నికయ్యాం.

అకాడెమీ గుర్తింపు పొందిన దాదాపు 20 సంస్థల ప్రతినిధులు ఈ నియోజక ఓటర్లు. ఓటు మార్పిడి విధానంలో ప్రథమ ఓట్లు ఎవరికి ఎక్కువ వస్తాయో వారు గెలుపొందినట్టు ప్రకటిస్తారు. సుబ్బారావు, నేనూ, మూర్తీ, శ్రీ గణపతిరాజు అచ్యుత రామరాజు గారు, ఆచార్య యన్ వి యస్ రామరావుగారు, బోయిన వేంకటేశ్వరరావు గారు సాంస్కృతీ సమాఖ్య కార్యదర్శి వాకాటి శిరీష్ కుమార్ గార్లతో పాటు ఆరుద్ర గారు కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. దురదృష్టవశాత్తూ, ఆరుద్రగారికి ప్రథమ ఓటు ఇస్తానని వాగ్దానం చేసిన వ్యక్తి వేరొకరికి వేయటం వలన ఆరుద్రగారు గెలవలేకపోయారు.

చివరికి శ్రీ గణపతిరాజు అచ్యుతరామరాజు, శ్రీ గుత్తికొండసుబ్బారావు, జి. వి. పూర్ణచందు, ఆచార్య యన్. వి. యస్. రామారావు, శ్రీ యం. ఏ. మూర్తి గెలిచినట్టు ప్రకటించారు.

గెలిచినా ఆ సంతోషం మాకు ఎక్కువ కాలం నిలవలేదు. యన్. టి. రామారావుగారు ఇన్ని అకాడమీలు, వాటి భవనాలూ, డైరెక్టర్లూ, ఆఫీసులు,

ఉద్యోగులు దండగనే అభిప్రాయంతో సాహిత్య అకాడమీ, సంగీత అకాడమీ, నాట్య అకాడమీలను ఒక్క కలంపోటుతో రద్దు చేసి, వాటి స్థానంలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు. ఆరుద్రని గెలిపించుకోలేకపోయామనే ఆవేదన మాత్రం మమ్మల్ని ఈ నాటికీ వెన్నాడుతూనే ఉంటుంది. సత్తెనపల్లి నుండి వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఓడిపోయారన్న వార్త ఎంత బాధాకరమో, సాహితీ సంస్థల నియోజకవర్గం నుండి ఆరుద్ర ఓడిపోయారన్న వార్త అంత బాధాకరం. రచయితల్లో కూడా నిబద్ధత లేకపోవటాన్ని జీర్ణించుకోలేకపోయిన బుద్ధప్రసాద్ గారు ఈనాటికీ ఆరుద్రకు మనం న్యాయం చేయలేకపోయామని బాధపడ్తూ ఉంటారు.

అకాడెమీల్లేని సారస్వతం

2019 ఎన్నికలముందు ఆనాటి ప్రభుత్వం మొక్కుబడిగా ఎలాంటి నిధులూ లేకుండా అకాడెమీల్ని పునరుద్ధరించి కొందరు వ్యక్తులతో కార్యవర్గాన్ని నామినేట్ చేసింది. తద్వారా ప్రభుత్వ నామినేటెడ్ సంస్థలుగా అకాడెమీలు మారిపోయాయి. ప్రస్తుతం అధ్యక్షులు మాత్రమే అకాడెమీలకున్నారు. కార్యమూ, కార్యవర్గమూ లేవు. రామారావుగారి కాలం నుండీ ఇప్పటి దాకా ఏ ప్రభుత్వమూ అకాడెమీల ప్రయోజనాల్ని గుర్తించ లేకపోయింది. బుద్ధప్రసాద్ గారితో కలిసి నేనూ, డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ స్వయంగా వెళ్ళి తమిళ కన్నడ మలయాళ భాషల్లో అన్ని అకాడెమీలూ చేస్తోన్న సాహితీ సారస్వత వైజ్ఞానిక సేవని, పరిశీలించి వచ్చాము. వాటి స్థాయిలో మనకూ అకాడెమీలను ఏర్పాటు చేయాలని ప్రయత్నించాము. ఏదీ అమలు కాలేదు.

అకాడెమీల స్థానంలో ఏర్పడిన తెలుగు విశ్వవిద్యాలయం కేవలం విశ్వ విద్యాలయంగానే తప్ప ఒక సాంస్కృతిక వేదికగా తనను తాను నిరూపించుకో లేకపోయింది. తద్వారా భాషా సాంస్కృతిక కళారంగాలకు తీరని నష్టం వాటిల్లింది. రచయితలే స్వయంగా నిర్మించుకున్న సాహితీ సంస్థలపట్ల కూడా ప్రభుత్వం నిరాసక్తత కనపరుస్తోంది.

నా పరిచయానికి పూర్వం సుబ్బారావు

సుబ్బారావుతో నాపరిచయం 1975లోనే! అప్పటికి 18 యేళ్ల అరబుడ్డోణ్ణి. సుబ్బారావునీ, విహారి గారినీ చెరో కంటితో ఒకేసారి చూశాను. ఒకేసారి కలిశాను. అప్పటికే వాళ్లిద్దరూ ఎంతో పరిపక్వత ఉన్న పెద్దవాళ్లు. మేం కలిసిన ముహూర్తబలం ఏదో నాకు తెలీదు. వందలాది కార్యక్రమాలు చేసుంటాం గానీ ఒక్కసారీ తిథి,వార, నక్షత్రాలు చూళ్లేదు. కారణం ఏమిటో తెలీదుగాని మా సభల్లో అద్భుతమైన శుభదినం నాడు జరిగింది ఒక్కటీ లేదు. అన్నీ అమావాశ్య రోజున దుర్ముహూర్తంలోనే జరిగాయి. సంకల్పబలం ఉంటే, గ్రహాలు విగ్రహాలే కానీ మనల్ని ఏమీ చెయ్యలేవని మా గట్టి నమ్మకం.

మా పరిచయానికి ముందు సుబ్బారావు గురించి నాకు తెలీదు. గమనం పుస్తకం కోసం విహారిగారు ఇలా క్లుప్తంగా సుబ్బారావు పూర్వరంగాన్ని పరిచయం చేశారు.

"ఆదివిష్ణు అన్నట్టు- తేదీలు వారాలు గుర్తు లేవుగానీ-హైదరాబాద్ లో పోస్టల్ ఉద్యోగాన్ని వదిలేసి బందరు యల్.ఐ.సీ రేకుల షెడ్లో వాలాడు- కుర్రాడు గుత్తికొండ సుబ్బారావు. నాకంటే ఐదేళ్లు చిన్నవాడు. 'ఈ అబ్బాయ్‌ని నువ్ చూసుకో వోయ్' అని అతన్ని నాకు అప్పజెప్పాడు మా ఆఫీసర్. నేను హయ్యర్ గ్రేడ్ అసిస్టెంటుని. నా పక్క సీట్లో కుదురుకున్నాడు సుబ్బారావు. బుర్రా, చేతులూ చాలా పవర్‌ఫుల్.

అతనికీ నాలాగానే క్షణాల్లో ఏ విషయమైనా అర్థమౌతుంది. అది అంతే! సాధారణ మానవుడు అవతలి మనిషి పదినిమిషాలు చెప్పిన తర్వాత తెలుసుకునే అంశాలు మేము మొదటి రెండు నిమిషాల్లోనే గ్రహించేస్తాము. ఆ తర్వాతంతా ఎదుటి వ్యక్తి చెప్పేది ఖచ్చితంగా మాకు తెల్సిన సమాచారమే! దాన్ని out of modesty తో స్వీకరించేస్తాం. ఈ కారణం వలన నాకూ అతనికీ పని విషయంలో లంకె బాగా కుదిరింది. రోజుకొక వంద రివైవల్స్ చేసిన చేతులు మావి. ఒక్కొక్కటి ప్రాసెస్ చేయటానికి ఏడెనిమిది స్టెప్స్ ఉంటాయి. కొన్ని బాల్‌పెన్‌తో (కాపీలుకూడా) రాయాలి. అందుకనే సర్వీసింగ్‌లో రాక్షసులు వీళ్లు అనేవాళ్లు మమ్మల్ని. కొలీగ్స్ మాత్రమే కాదు, పాలసీ హోల్డర్లు, డెవలెప్‌మెంట్ సిబ్బందీ, అప్పుడు మాకు వాళ్లంతా పెట్టిన కిరీటాల బరువు నా దగ్గర ఇప్పటికీ కొన్ని ఉత్తరాలుగా ఉన్నది! ఉద్యోగులముగా అదీ మేము! అదీ మా ఇమేజ్!"

విహారిగారికి శిష్యవాత్సల్యం ఎక్కువ. ఆయన ఇలా అంటారు: "అటు ఆఫీస్ లోనూ ఇటు సాహిత్య జైత్రయాత్రల్లోనూ మేము 'పనిరాక్షసులం'. చెప్పులు ఎత్తి కుదురుగా పెట్టటం నుంచీ కుర్చీలు వేయటం బ్యానర్లు కట్టటం వరకూ ఏదైనా మాకు హీనంగా ఉండేది కాదు. పర్వావాలేదు-చెప్పుకోనివ్వండి-అవన్నీ సుబ్బారావు, పూర్ణచందు, నానుండి నేర్చుకున్న కార్యనిర్వహణాపద్ధతులు!"అని!

పూర్ణచంద్రోదయానికి పుఖ్యవ్యాసం వ్రాస్తూ విహారిగారు నా గురించి ఇలా అన్నారు" "రోజుకి 16 గంటలైనా దీక్షగా ఒక పనిమీద కూర్చోగలడు పూర్ణచందు. ఇది అతని stamina. దీక్షగా చదవగలడు. రాయగలడు. చేసే పనిమీద శ్రద్ధ, చేయటంలో ఉత్సాహం ఉంటేగానీ, ఇది సాధ్యం కాదు. ఈ విషయంలో రామాయణంలో లక్ష్మణుని లాంటివాడు పూర్ణచందు. ఈ మాటల్ని గమనం పేరుతో గుత్తికొండ సుబ్బారావు జీవిత చరిత్ర రాసేప్పుడు తనే స్వయంగా చెప్పుకున్నాడు. ఆత్మానాం మానుషం మన్యే అన్న రాముడు సీతా వియోగంతో విలపిస్తోంటే-సాధారణ మానవునిలా కుంగిపోతున్న అన్నకి ఉత్సాహాన్ని నూరిపోస్తాడు లక్ష్మణుడు. పూర్ణచందుక్కూడా అంతటి సమయజ్ఞత దానిలో ఉత్సాహాన్ని నింపుకునే గుణవిశేషం ఉన్నాయి." అంటూ శిష్యప్రశంస చేసిన విహారిగారి శిష్య వాత్సల్యానికి ఇంతకన్నా ఉదాహరణేం కావాలి?

సుబ్బారావు, నేనూ పనిలో కూర్చున్నప్పుడు వీళ్లిద్దరూ కొట్టుకుంటారేమో అని ఇతరులు భయపడేంతగా ఒక్కోసారి అరుచుకుంటూ ఉంటాం. ఇద్దరం మా

మా వాదనల్ని బలంగా వినిపించాలనే ప్రయత్నమే ఇదంతా!...చివరికి ఇద్దరమూ తగ్గుతాం. ఒక నిర్ణయానికొస్తాం. నీ నిర్ణయంతో నాకు సంబంధం లేదన్నట్టు ఉండం. అదే మా విజయ రహస్యం. ఒకసారి మా ఇద్దరి తంతూ చూసిన విహారిగారు కాసేపు నవ్వుకున్నారు. "1975ల్లో సుబ్బారావూ నేనూ పనిచేసేప్పుడు కూడా ఇలానే ఉండేవాళ్లం" అన్నారు. దాని గురించి ఇలా రాసారాయన:

"సుబ్బారావ్'కి ఆవేశం ఎక్కువని అంటూ అనుకుంటూ ఉంటారు. కానీ, అతను logical rationalist. హేతువుని చెబితే, చూపితే-అయితే సరే అని వెంటనే మనతో ఏకీభవించే తత్త్వం అతనిది. ప్రజాస్వామిక నిర్ణయాల్ని ఔదలదాల్చే సుగుణం వున్నవాడతను. సుబ్బారావ్‌ని దగ్గరగా చదివినవారు అతనిలో సహనం ఎక్కువ అని అర్థం చేసుకుంటారు. నిండు మనంబు నవ్యనవనీత సమానము. పల్కు దారుణా ఖండల శస్త్రతుల్యము అన్నది నూరుపాళ్లూ అతనికి నప్పుతుంది. అతను అందరికీ అప్తుడు. పరిచితుల్లో ప్రతీ ఒక్కరూ ఎవరికివారు సుబ్బారావ్ తనకు అత్యంత సన్నిహిత మిత్రుడు, వెరీక్లోజ్ అనే భావననే ఆనందిస్తారు. దీనికి కారణం అతని అరమరికలు లేని స్వభావం, కలుపుగోలుతనం, నిరాడంబరత, హృదయంలో ఏ అర-మరకలు లేని నిష్కల్మషమైన సాన్నిహిత్యాన్ని పంచే గుణం అతనిది. క్రమశిక్షణ, సమయపాలనా అతనికి వెన్నతోపెట్టిన విద్యలు." అంటారాయన.

సుబ్బారావు 1970లకు ముందు వేకువ పత్రికకు బాధ్యుడుగా ఉన్ననాటి విశేషాలకు, హైదరాబాదులో అతను నిర్వహించిన సాహిత్య కార్యక్రమాలకు సీనియర్ జర్నలిష్టు, ప్రముఖ కవయిత్రి కథాయిత్రి డా॥ కె.బి.లక్ష్మి ఒక విధంగా ప్రత్యక్ష సాక్షి. ఆమె గమనం పుస్తకంలో ఇలా రాశారు:

"సాంకేతిక కారణాలవల్ల (గుత్తికొండ ప్రభుత్వోద్యోగి, శివారెడ్డి ప్రైవేట్ లెక్చరర్) గుత్తికొండ సుబ్బారావు వేకువకి గౌరవ నిర్వాహకుడైతే, శివారెడ్డి పేరు సంపాదకుడు అయ్యింది.

"yes I got it! వేకువ ప్రారంభ సంచిక త్రైమాసిక (జనవరి-మార్చి 1971), రెండు, నాలుగు సంచికలు వెదికితే నా దగ్గర దొరికాయి. తొలి సంచికలో కేవలం కవితలే ఉంటే, తదుపరి సంచికల్లో కథలు, వ్యాసాలు, వ్యాఖ్యలతో మెరుగులు దిద్దుకుటూ వచ్చింది. వెల ఒక రూపాయి. మిరియాల రామకృష్ణ, నిఖిలేశ్వర్, కుందుర్తి, సోమసుందర్, నగ్నముని, దాశరథి, ఎన్ గోపి, అద్దేపల్లి, సుగమ్ బాబు, కె శివారెడ్డి, గుత్తికొండ సుబ్బారావు తదితరుల కవితలతో ప్రారంభ సంచిక 112 పేజీలు, మహాస్వప్న, విహారి & శాలివాహన, జ్వాలాముఖి, సినారె, వేగుంట, ఇచ్ఛాపురం రామచంద్రం ఇలా ఎందరివో సృజనలు తదుపరి సంచికల్లో వచ్చాయి" అని వివరించారు.

కార్యకర్తకు తపన ముఖ్యం

సుబ్బారావుతో సాహిత్య చర్చ చేసే సాహసానికి నేను ఈ యాబదేళ్లలో ఏనాడూ పూనుకోలేదు. సభ, దాని నిర్వహణ తప్ప ఫలానా రచన బావుంది, లేకపోతే బాలేదు లాంటి చర్చల్లో అతను ఎన్నడూ పాల్గొనేవాడు కాదు. అలాగని చదవడనీ అనుకోలేం. కానీ, బైటపడే రకం కాదు. అందుకని సాహిత్య గురువు విహారిగారితోనే రాతపోతల గురించి చర్చించేవాణ్ణి! కానీ, సభానిర్వహణలో చెయ్యితిరిగేలా చెవి మెలిపెట్టి పాఠాలు చదివించినవాడు సుబ్బారావు!

ఏదైనా సభ నిర్వహించేప్పుడు, మహామహులు చెప్పేది విందామని సభలో కూర్చుంటే సుబ్బారావు ఊరుకొనేవాడు కాదు. "వింటానికొచ్చావా? పనిచెయ్యటానికొచ్చావా" అని కేకలేసేవాడు! అక్కడెవరికో మంచినీళ్ళు కావాలి. ఇక్కడెవరికో కుర్చీ చూపించాలి. ఇంకెవరో వస్తే లోపలికి తీసుకెళ్ళి సుఖాసీనుణ్ణి చెయ్యాలి. ఎజెండా రాయాలి. ఏ నిమిషానికి ఏది జరగాలో వివరంగా కార్యక్రమం రూపొందించాలి. సదస్సు సదస్సుకీ బ్యానర్ మార్చాలి. స్వాగతం చెప్పేదెవరూ వందనసమర్పణ చేసేదెవరు, సభను నిర్వహించేదెవరు, వక్తలు సిద్ధంగా ఉన్నారా? ఎవరైనా రాకపోతే ప్రత్యామ్నాయం ఏమిటి? ఇవన్నీ టకటకటకా అప్పటికప్పుడు నిర్ణయం తీసుకుని చేసేయాల్సిన పనులు. వేగం చాలా అవసరం. ధ్యాస ఎక్కడో సాహిత్యం మీద ఉంటే కుదరదు. ఒకసారి ఇలా పాఠం చెప్పారాయన:

"నీకు ఒకటే చెప్తున్నా గుర్తుపెట్టుకో... మనమే సర్వస్వం అన్నట్టు వేదికమీద ఫొటోల్లో పడాలనుకోవటం సరికాదు. మనం లేకపోయినా ఏ కార్యక్రమమైనా నిర్దేశించినట్టు జరిగిపోయేలా ప్లానింగ్ ఉండాలి. అక్కడకొచ్చి తడుముకోకూడదు. అస్సలు మనం హాల్లోనే ఉండకూడదు" అనేవాడు. మహా కర్మోటకుడుగా కనిపించేవాడా క్షణంలో.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో నేను గానీ సుబ్బారావుగానీ స్టేజీ దరిదాపుల్లో ఉండేవాళ్లం కాదు. మా ప్రపంచ మహాసభల్లో మూడురోజుల కార్యక్రమాల్లో మొత్తం 6000 ఫోటోలు తీస్తే నేనూ సుబ్బారావు వాటిలో ఆరింటిలో మాత్రమే ఉన్నాం. ఇది జేబుసంస్థలు నడిపేవారికి సాధ్యం కాదు. వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం జరిపే సభలు, సమావేశాలు నిష్ఫలంగా, నిస్సారంగా సాగుతాయి.

మనం నిర్వాహకుడి పాత్ర పోషిస్తున్నప్పుడు మనలో రచయిత బైటకు రాకూడదంటాడు సుబ్బారావు. సాహిత్యచర్చలో మునిగితే సభా నిర్వహణ ఐసరబజ్జా అవుతుందనేది ఆయన నిర్దేశం. ఐసరబజ్జా అంటే భుక్తాయాసంతో బొజ్జ పట్టుకుని కూలబడటం. సభలు జరిగేప్పుడు కార్యకర్త భోజనాల దగ్గిర కనిపించినా సుబ్బారావు ఊరుకునేవాడు కాదు. తింటానికొచ్చావా అనడిగేవాడు. తిండి మీద ధ్యాస ఉంటే, పని ఐసరబజ్జా అవుతుందని అతని నిశ్చితాభిప్రాయం! సభల సమయంలో అందరి కన్నా ఆఖర్న మిగిలిందేదో

తినటం మా ఇద్దరికీ అలవాటు. తిండికి ద్వితీయ లేదా తృతీయ ప్రాధాన్యత నిచ్చే మా ఇద్దరిలో సుబ్బారావు స్వీట్ల తయారీ వ్యాపారం చేపడితే, నా మట్టుకు నేను 'తినరా మైమరచి' అంటూ తెలుగు వారి ఆహారచరిత్ర కారుణ్ణయ్యాను. విధి బలీయమైనది.

ఎందరినో ముప్పతిప్పలు పెట్టి ఎన్నెన్నో మలుపులు తిప్పిన సుబ్బారావుని తెలుగు భాషోద్యమంలోకి లాగి ఓ మహారథుడి పాత్ర ఇచ్చి ఇంక దీన్నే పోషించమని, దీన్లో జీవించమనీ నిర్దేశం చేసిన బుద్ధప్రసాద్‌గారి కొక్కరికే తెలుసు సుబ్బారావుని ఎక్కడ ఎలా ఉపయోగించాలో! "అనతి కాలంలోనే తెలుగు భాషోద్యమం ప్రజల గుండె తలుపులు తట్టగలుగుతూ గణనీయమైన ఫలితాలు సాధించగలిగిందంటే సుబ్బారావులాంటి సేనానులు, పూర్ణచందులాంటి సచివులు ఆ సర్వసైన్యాధిపతికి అండగా నిలబడటమే కారణం" అన్న డా॥ రాళ్లబండి కవితాప్రసాద్ గారి మాటలు అక్షర సత్యాలు.

"రచయితల సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీ గుత్తికొండ సుబ్బారావు, డా॥ పూర్ణచందు ఇద్దరి ఉమ్మడి గమనం ఒకటే. ఇద్దరి అజెండా ఒకటే – సాహిత్యం, రచయితల సంఘం ఆసరాతో సాహిత్య అభివృద్ధి, నిర్దేశనాలకు పాటుపడడం. ఆ ఇద్దరి సాహితీ సహజీవనయానం కొంతలో కొంత సమకాలీన తెలుగుసాహిత్య గమనం లాంటిది" అని శ్రీ మాకినీడి సూర్యభాస్కర్ రాశారు.

'భవిష్యత్తులో ఏ విశ్వవిద్యాలయమైనా సంస్థల నిర్వహణ, కార్యకర్తృత్వం, సభామర్యాదలు, ఉద్యమాలు, పోరాటాలు – వీటి గురించి ఒక కోర్సును ప్రవేశపెట్టే, అవి నేర్పే కార్యకర్తల కళాశాల ఏర్పాటు చేస్తే దానికి ప్రిన్సిపాల్ కాగల వ్యక్తి సుబ్బారావుగారే!' అని పూర్ణచందు రాశారు. ఆయనే ఒక కళాశాల అని కితాబిచ్చారు. సుబ్బారావు సాహిత్యపరమైన పోరాట యోధుడు. నిఖార్సయిన మార్క్సిస్టు. నిత్య సత్యాన్వేషి, ఎన్నడూ దేవుడు జోలికి వెళ్ళనివాడు. దారుణాఖండ శస్త్ర తుల్యమైన వాక్పటిమ ఆయన స్వంతం. నిర్వహణలో తప్పు జరిగితే సర్దుకుపోవటం ఎరగనివాడు" అని!

"అసమాన అవధాన సార్వభౌములు డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాదు గారు అన్నట్లు, 'యోగ సూత్రాలతో మనోవైకల్యాన్ని, పాణినీయ భాష్యంతో భాషావైకల్యాన్ని, వైద్యంతో శారీరక వైకల్యాన్ని పోగొట్టటం ద్వారా మానవుల మనోవాక్కాయాలను శుద్ధిచేసి త్రికరణశుద్ధిగా జీవించే ప్రణాళికను అందించిన పతంజలి మహర్షి శైలిలో తన జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న రచయిత, కవి, పండితుడు, చిత్రకారుడు, వైద్యశిరోమణి పూర్ణచందు గారు సార్థక నామధేయులు.' ఆయుర్వేద వైద్య భిషగ్వరులైన డా. పూర్ణచందు గారు, తెలుగు సాహితీ గమనవైఖరులను అధ్యయనం చేస్తూ సామాజిక సాహితీ మనోవైకల్యాన్ని పారద్రోలే ప్రయత్నం చేస్తున్నవారు. ఎంతో ప్రాచీనమైన భాష తెలుగని నిరూపిస్తూ రాసిన వ్యాసపరంపరతోను, పుస్తకాలతోను తెలుగు భాషా

వైకల్యాన్ని సరిజేయడంలో దోహదపడినవారు. వీటికోసం త్రికరణశుద్ధిగా జీవితాన్ని అంకితం చేస్తూ పాటు పడుతున్నవారు. గుత్తికొండవారితో పాటూ సాహితీక్షేత్ర యాత్రలో సహగమిస్తున్న వారు" అని మా ఇద్దరినీ కలిపి సహజీవ చిరంజీవులను చేశారు.

చాలా సభల్లో హాలులోపల సాహిత్యేతర వ్యక్తులు ఎక్కువగా ఉండటాన్ని, వేదికపైన అధికారులు, వ్యాపార వర్గాలవారూ ఎక్కువగా దర్శనం ఇస్తున్నప్పుడు అది ఇంట్లో స్వంత కార్యక్రమమే గానీ దాన్ని సాహిత్య సభ అనకూడదంటాడు సుబ్బారావు. ఆయన ఇలాంటి సభలకు కడువ్యతిరేకి. సన్మాన సభ, బిరుదు ప్రదాన సభ, భజంత్రీల సభల్లాంటివే ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి గురించి మనం సీరియస్‌గా చర్చించవాల్సిందేమీ లేదు. వాటి రూపురేఖ లావణ్యాదులు అ విధంగానే ఉంటాయి. కానీ, ఈ రకమైన సభలే నానాటికీ ప్రబలటం వలన చాలా మందిలో కార్యకర్త అంటే మీటింగులు పెట్టేవాడనే ఒక అభిప్రాయం బలపడింది. ఫలానా వ్యక్తి తెలుసా అనడిగితే మీటింగులు పెడ్తుంటాడే అతనేనాన...? అని ఎవరైనా అంటే ఇంతకన్నా అవమానం ఇంకొకటి ఉండదు కదా...! అలా అనటానికి మనమే అవకాశం ఇవ్వకూడదు.

అలాంటి మీటింగులకు ఆధ్వర్యం వహించటం, యాంకరింగులు చేయటం, ఏదో ఒక విధంగా మైకు కుతి తీర్చుకోవటం ఇవన్నీ మన ప్రతిష్ఠను దిగజారుస్తాయి. అంత్యప్రాసలతో, అర్థంలేని పొగడ్తలతో డబ్బాలో రాళ్లుపోసినట్టు గలగలా గడగడా మాట్లాడితే మొదటి సారి ఆపాత మధురంగా ఉంటుంది. రెండో సారి కొంచెం మాధుర్యం తగ్గినట్టు అనిపిస్తుంది మూడోసారి నుండీ వినబుద్ధికాదు. విసుగొస్తుంది.

సభాధ్యక్షుడు సభకు తలమానికం లాంటివాడు. ఇద్దరు వస్తాదులు కుస్తీ పడ్తుంటే ఇద్దరినీ చెరో దెబ్బవేసి ఆపగల సత్తా ఉన్నవాడే ఆ పోటికి రిఫరీగా ఉంటాడూ. అధ్యక్షుడిని అలాంటి వాణ్ణి ఎంచుకోండి. హోదాను చూసో, డబ్బును చూసో అధ్యక్షుడిగా పిలవకండి. వేదిక పట్టనంతమందిని ఆహ్వానించి అర్ధరాత్రిదాకా సభను సాగదీయకండి. రెండో సారి మళ్లీ పిలిస్తే మనసభకు జనం వచ్చేలా ఉండాలి" అనేది సుబ్బారావు సందేశం..

జాతీయ తెలుగు రచయితల మహాసభలు

2006లో జాతీయ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించనున్నట్టు ఒక ప్రకటన విడుదల చేశాం. జాతీయ సభలంటే మాటలా? జాతీయస్థాయిలో సాహితీవేత్తల్ని సమీకరించాలి. "రఘుమహారాజు విశ్వజిన్నామ యజ్ఞం చేసి "నిశ్శేష విశ్రాణిత కోశజాతం" గా ఉన్నాడని కాళిదాసు వర్ణించినట్టు మా బ్యాంకు బాలెన్సు నిశ్శేషంగా ఉన్న సమయం అది!

బుద్ధప్రసాద్ గారు ఎప్పుడూ అనేవారు, సాహితీ సంస్థలకు డబ్బులు, ఆస్తులూ ఉంటే తన్నులాటలూ రాజకీయాలు తప్ప ఉపయోగం ఏమీ ఉండదని! యాభై యేళ్లుగా కృష్ణాజిల్లా రచయితల సంఘాన్ని నడుపుకు వస్తున్నాం అంటే విధుల సమృద్ధే తప్ప నిధుల సమృద్ధి లేకపోవటమే కారణం. జాతీయ సభలకు మద్రాసు నుండి ప్రముఖ రచయిత్రి శివశంకరిని ఆహ్వానించాం. లండన్ నుండి గూటాల కృష్ణమూర్తి వచ్చారు. తెలుగు సాహితీ మూర్తులు, ప్రముఖులనదగిన పెద్దలెందరో వచ్చారు. రావూరి భరద్వాజ, ఆవంత్స సోమసుందర్. కొలకలూరి ఇనాక్ ప్రభృతులు ఎందరో... అంతా ఒక కలగా జరిగిపోయింది. ఎలా జరిగింది... నిధులెలా వచ్చాయి?

కార్యనిర్వహణా దక్షత కలిగిన వాళ్లము అనే గుర్తింపు, గౌరవం కృష్ణాజిల్లా రచయితల సంఘానికొక ప్రతిష్ఠను తెచ్చింది. అదే సభలు విజయవంతం కావటానికి ఏకైక కారణం. ఆ సభల్లోనే చిన్నయసూరి ద్విశతాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని, అలాగే ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించాలనీ నిర్ణయాలను ప్రకటించాం. రెండింటినీ నెరవేర్చగలిగాము.

ఇక్కడొక విషయం ప్రస్తావించాలి. జాతీయ తెలుగు రచయితల మహాసభలు ప్రకటించినప్పుడు, కవిసమ్రాట్ పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారు నాకు ఫోన్ చేసి తన "త్రిలింగదేశం మనదేనోయ్! తెలుంగులంటే మనమేనోయ్" గీతాన్ని ఎవరితోనైనా ఆ సభలో పాడించవయ్యా! వినాలని ఉంది" అన్నారు. నేను సిద్ధార్థ హైస్కూల్లో సంగీతం టీచర్ గారితో మాట్లాడి పిల్లల్ని పాడేందుకు సిద్ధం చేశాను. కానీ, సభలకు కొద్ది రోజుల ముందే పైడిపాటివారు పరమపదించారు. ఆయన స్వయంగా వినకపోయినా సభల్లో పాడించి ఆయనపట్ల గౌరవాన్ని ప్రకటించాము. ప్రారంభ సభా వేదికకు ఆయన పేరుపెట్టి కృష్ణాజిల్లా రచయితల సంఘంతో ఆయనకున్న అనుబంధాన్ని జ్ఞాపకం చేసుకున్నాము.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభల సంకల్పం

ప్రపంచ తెలుగు రచయితల సంకల్పం సుబ్బారావుదే! ఆ కోరిక చాలా కాలంగా బుద్ధప్రసాద్ గారికీ ఉంది. కానీ వనరులు, పని సమర్థత ఎంతవరకూ సమకూరతాయన్న సందేహం ఆయనకుండేది. 2006 జాతీయ మహాసభల చివరి రోజు ప్రపంచ సభలను ప్రకటిద్దామా అనడిగాడు సుబ్బారావు. పెద్దాళ్లు కలిసొస్తారోలేదో అడుగుదాం. మనిద్దరమే అనుకుంటే చాలదు కదా...అన్నాన్నేను. ఇద్దరమూ బుద్ధప్రసాద్ గారి దగ్గరకు వెళ్ళి "జాతీయ సభలు విజయవంతంగా జరుగుతున్నాయి. భాషోద్యమ స్ఫూర్తి బాగా వచ్చింది ఈ ఊపులోనే మనం ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహిస్తే భాషోద్యమం బలపడ్తుంది" అని చెప్పాం.

'అలాగే చేద్దాం' అన్నారు బుద్ధప్రసాద్.

"ఈ రోజు ముగింపు సభలో ప్రకటించండి" అన్నాం.

"సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ రాళ్ళబండి కవితాప్రసాద్ సాయంత్రానికి వస్తాడు కదా...కలిసి మాట్లాడదాం" అన్నారాయన. మేము ఏదైనా ప్రతిపాదన తెస్తే ఏనాడూ బుద్ధప్రసాద్ గారు కాదనలేదు. కానీ, అదే విషయాన్ని ఆయన ముఖతః చెప్పాలంటే తొందరపడేవారు కాదు. ఆయన నోటివెంట ప్రకటన రాకపోవటాన జరపకుండా ఆపేసిన కార్యక్రమాలు అనేకం ఉన్నాయి.

సరిగ్గా, అదే సమయానికి ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు వచ్చారు.

'మనవాళ్లు ప్రపంచ మహాసభలు అంటున్నారు...' అన్నారు బుద్ధప్రసాద్ గారు.

మేం యార్లగడ్డవారి స్పందనకోసం ఆత్రంగా ఆయన ముఖంవంక చూసాం. ఆయన క్షణం కూడా ఆలోచించకుండా, "జరపాలి, ఇదే సమయం" అన్నారు.

చాలా సందర్భాల్లో లక్ష్మీప్రసాద్ గారి భరోసా మమ్మల్ని గట్టెక్కిచ్చింది. బుద్ధప్రసాద్ గారు గౌరవాధ్యక్షులుగా, లక్ష్మీప్రసాద్ గారు కార్యనిర్వాహక అధ్యక్షులుగా, సుబ్బారావు అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా ప్రపంచ తెలుగు రచయితల మహాసభల సన్నాహం 2006లో అలా మొదలయ్యింది. 2007లో మొదటి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను అనితరసాధ్యంగా నిర్వహించగలిగాం!

ప్రపంచ సభల లక్ష్యం భాషోద్యమమే!

ప్రపంచవ్యాప్తంగా రచయితలు తెలుగు భాషకోసం ఒక చోట సమావేశం కావటమే ప్రపంచ తెలుగు రచయితల సభల ప్రధాన లక్ష్యం. అప్పుడే అది పెద్ద వార్త అవుతుంది. తద్వారా ప్రజలకు ఆ సందేశం చేర్తుంది. దేశవిదేశాలనుండి ప్రతినిధుల్ని ఆహ్వానించాం. భాషపట్ల ప్రేమానురక్తులున్న రచయితల్ని స్వచ్ఛందంగా స్పందించాలని ప్రార్థించాం. అన్ని స్థాయిల్లోనూ విస్తృతంగా ప్రచారం చేశాం. చిన్నో, పెద్దో ఏ రచయితైనా, 'ఈ సభలు విజయవంతం కావాలని కోర్తున్నాను' అని ఒక చిన్న కార్డుముక్క రాసినా నెత్తిన పెట్టుకుని గౌరవించాం.

2000 మంది ప్రతినిధులుగా నమోదయిన వారిలో కనీసం 600-800 మంది వరకూ వేదిక పైన అవకాశం కల్పించే వాళ్లం. అందువలన 50-60 పేజీల ఆహ్వానాన్ని ఒక పుస్తకంగా విడుదల చేసేవాళ్లం. ప్రతినిధులు కూడా సంతృప్తిగా వెళ్లే అవకాశం ఉంటుంది. సుదూర ప్రాంతాలనుండి సభలకు వచ్చిన వారిని మౌన ప్రేక్షకులుగా కూర్చోబెడుతూ, ఈ సభల లక్ష్యాన్ని గానీ, సభలను గానీ గుర్తించకుండా, పలకరించకుండా ఉన్నవారిని అందలం ఎక్కించటం ధర్మం కాదని భావించాం.

భవిష్యత్తులోనయినా ఎక్కడ సాహిత్య సభ జరిగినా రచయితలు సంబరంగా పాల్గొనే అలవాటు చేసుకోవాలి. వేదిక ఎక్కటమే ధ్యేయంగా పెట్టుకోకూడదు. "హాల్లో

కూర్చునే స్థాయిని ఎప్పుడో దాటిపోయాం" అన్నవాళ్లు చాలా మంది ఉన్నారు. ఇంకొకరు చెప్పేది వినటానికి సిద్ధంగా లేనివారికి చెప్పే అవకాశం మనం ఎందుకివ్వాలి? పెద్ద రచయిత అయినంత మాత్రాన నోరుతెరిచి అభినందించటాన్ని నామోషీ అనుకుంటే ఎలా? భాషోద్యమసభలు మహోపన్యాసాల కోసం ఉద్దేశించినవి కాదు, రచయితలని భాషోన్ముఖుల్ని చేయటానికి ఉద్దేశించినవి. మేము సభలను ఆ దృష్టితోనే నడిపాం.

రచయితలు స్పందించని భాషోద్యమం

స్వాతంత్రోద్యమం నడిపే రోజుల్లో కాంగ్రెస్ మహాసభల్ని కూడా కొందరు "పిచ్చివాళ్ల స్వర్గం" అన్నవాళ్లూ ఉన్నారు. "వందేమాతరం అంటే, "వంద ఏ మాత్రం?" అంటూ హేళనగా మాట్లాడిన ప్రబుద్ధులు కూడా ఉండేవారని చాలామంది ఆత్మకథల్లో రాసు కున్నారు. స్వాతంత్రోద్యమానికి వ్యతిరేకంగా నడిచిన తెలుగు పత్రికలు కూడా ఉండేవి.

2003-04 సంవత్సరాల్లో కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో జరిగిన తెలుగు భాషోద్యమ సభలు బాషోద్యమానికి ఆరంభం పలికితే 2004లో కృష్ణాజిల్లా రచయితల సంఘం జవసత్వాలు నింపుకుని, భాషోద్యమానికి అండగా నిలిచి ప్రజల గుండె తలుపులు తట్టింది. ప్రజలను భాషనురక్తి పెంచుకోవాలని కోరటం లక్ష్యంగా 5 పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించింది.

సాధారణ రచయితలుగానీ, విద్యాలయాలలో తెలుగు మీద ఆధారపడి జీవిస్తున్నవారుగానీ ఈ ఉద్యమంలో భాగస్వాములైన వారు చాలా తక్కువ. బుద్ధప్రసాద్ గారు, లక్ష్మీప్రసాద్ గారూ సుబ్బారావుగారు, నేనూ, డా. సామల రమేష్ బాబు...ఇలా కార్యకర్తలే భాషోద్యమాన్ని నడిపిస్తున్నారు. కలిసివచ్చిన భాషావేత్తలెందరినో కలుపు కుంటూ ప్రాచీనతా హోదా సాధించాం.

కార్యకర్త లేకుండా ఏదీ విజయవంతం కాదని దీని భావం. ఆచార్యులు, భాషావేత్తలు కూడా కార్యకర్తలుగా మారాలి. మారితేనే భాషకు మేలు జరుగుతుంది. ఎక్కువమంది మేధావులు మేం మాత్రమే గొప్ప అనుకోవటం వల్లే భాషోద్యమం పలచగా ఉంది.

ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల తొలి మహాసభలు

2019 జనవరిలో ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల తొలిమహాసభలు జరిపాం. దాదాపు 1500 మంది రచయిత్రులు దేశవ్యాప్తంగా విచ్చేశారు. ఆ సభల్లోనే ప్రఖ్యాత రచయిత్రులు 12 మందికి పురస్కారాలిచ్చి గౌరవించాము. ప్రభుత్వం నుండి ఎలాంటి గ్రాంటు లేకుండా సభలను స్వంతంగానే నిర్వహించాము.

1979లో అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ సహకారంతో స్పందన సాహితీ సమాఖ్య మచిలీపట్టణంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహా సభలు జరిగిన సరిగ్గా 40 యేళ్లకి మళ్లీ అదే వ్యక్తులు, విహారి, సుబ్బారావు, పూర్ణచందు,

పువ్వాడ తిక్కన సోమయాజి ప్రభృతులే కృష్ణాజిల్లా రచయితల సంఘం పక్షాన విజయవాడలో ఇప్పుడు ఈ సభలను నిర్వహించటం విశేషం. అప్పటి ముఖ్య కార్యకర్తల్లో అత్యధికులు ఈ సభల నాటికి సజీవంగా ఉన్నారు.

అప్పటి కృష్ణాజిల్లా కలెక్టరుగా ఉన్న ఎ వి యస్ రెడ్డి గారు పూర్తి సహకారం ఇచ్చి సభలను దగ్గరుండి నడిపించారు. వారి సతీమణి ఇందిరగారు సభలలో మాతోనే ఉండి, రచయిత్రులందరిని తమ జిల్లాకొచ్చిన అతిథులుగా భావించి గౌరవించారు. ఇప్పటి కాలపు అధికారుల నుండి అలాంటి గౌరవాలను ఆశించటం అత్యాశే కావచ్చు.

2019 జనవరిలో రెండు రోజులపాటు జరిగిన ప్రథమ ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల మహాసభల ప్రారంభ సభలో కీలక ప్రసంగం చేస్తూ, "రచయిత్రులు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు గానీ, నాటక రచనలో పెద్దగా కనిపించటం లే"దని నేను ఒక వ్యాఖ్య చేశాను. వేదికపైన ఉన్న ప్రముఖ నాటక రచయిత, సంగీతనాటక అకాడెమీ మరియు, ఆరు నందిపురస్కారాలు పొందిన డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ గారిని ఈ విషయమై ఆలోచించి, రచయిత్రులకు నాటక రచనలో శిక్షణ నిప్పించే కార్యక్రమం చెయ్యమని నేను కోరాను. ఆయన ఆనాడు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులుగా ఉన్నారు.

ఒక జ్యోతితో ఇంకో జ్యోతిని వెలిగించినట్టు ఒక కార్యక్రమం మరో బృహత్తర కార్యక్రమానికి నాందీ పలకాలనే లక్ష్యం మాది. అది దృష్టిలో పెట్టుకునే సభా ముఖంగా సంచాలకులవారిని కోరాను. ఆయన వెంటనే స్పందించి నాటక రచనపై రచయిత్రులకు మూడు రోజుల వర్క్ షాపు నిర్వహించారు. సభలకోసమే సభలనే సిద్ధాంతాన్ని సుబ్బారావు అంగీకరించడు.అది ఏదో ఒక ప్రయోజనాన్ని సాధించాలి. మహిళా నాటక రచయితలకు శిక్షణ నిప్పించే కార్యక్రమానిక్కూడా సహకరించి విజయవంతం చేశాం.

రచయితా...కార్యకర్తా...ఎవరుగొప్ప???

"ఒక మహారచయితకన్నా ఒక సాహిత్య సంస్థ, దాని నిర్వాహకులైన కార్యకర్తలే గొప్ప. ఒక పోతుకూచి సాంబశివరావు, ఒక వంగపల్లి విశ్వనాథం, ఒక విహారి, ఒక గుత్తికొండ సుబ్బారావు, ఒక జానమద్ది హనుమచ్ఛాస్త్రి, ఒక కాళీపట్నం రామారావు లాంటి మహానుభావులు ఎంత రచయితలో అంతటి కార్యకర్తలు. ఇంకా అంతకు ముందు తరం వారిలో గిడుగువారు, పురిపండావారు, నడిమింటివారు, మారేపల్లివారు వీళ్లంతా కార్యకర్తలే! భాషోద్యమం కోసం పనిచేసేవాళ్లంతా గిడుగు వారసులే! రచయితలుగా కన్నా కార్యకర్తలుగా ఎక్కువ సాధించినవారు కూడా! స్వీయ సాహిత్య సేవని అలా ఉంచితే వీరిలో ఒక్కొక్కరు ఒక్కొక్క రచయితల కార్ఖానాగా మారి ఎంతమంది చేత ఎన్ని రచనలు చేయించారన్నది చరిత్ర. ఆ రోజుల్లో గిడుగుతో కలిసిరాని రచయితలున్నట్టే ఇప్పుడూ భాషోద్యమంతో కలిసిరాని రచయితలు, ఆచార్యులు ఉన్నారు. వాళ్ల గురించి ఇంతకన్నా ఎక్కువ రాయటం కూడా అనవసరమే!

భాషోద్యమానికి కార్యకర్తల కొరత

తెలుగు భాషోద్యమం చాపకిందనీరులా ప్రజల్లోకి చేరింది. వారి గుండె తలుపులను గట్టిగానే తట్టింది. పిల్లల్ని తెలుగులో పెంచితే తెలివితేటలు పెరుగు తాయనే గ్రహింపు వస్తోంది. ఇంగ్లీషు మీడియంలో చదివితే అమెరికాలో ఉద్యోగా లొస్తాయనే అపోహ పోలేదుగానీ ఇంట్లో తెలుగు వాడకం గతంతో పోలిస్తే గణ నీయంగానే పెరిగింది. ఈ విజయం పరిమితం అయినా భాషోద్యమానిదే! రచయితలు మరింత చొరవగా ముందుకొచ్చి ఉంటే ఇంకాస్త ఫలితం కనిపించేది.

గత యాభై యేళ్లుగా వ్యక్తిగతంగా నా మట్టుకు నేను వందలాది సంస్థలను, వాటి కార్యకర్తలను ఎరుగుదును. కానీ, వాటిలో వేళ్ళమీద లెక్కబెట్టగలిగినవే మిగిలి ఉన్నాయి. దానికి కారణం కార్యకర్తల కొరతే!

వ్యక్తుల కన్నా సంస్థలు ముఖ్యం అంటాం. సిద్ధాంత రీత్యా అది నూరు శాతం నిజం. కానీ, వ్యక్తుల్లేకపోతే సంస్థగానీ ఉద్యమంగానీ మనుగడలో ఉండవు. శ్రోతలు లేకపోతే సభే లేదు. అన్నమయ్య నేనొక్కణ్ణి లేకపోతే నిన్ను కొలిచేదెవరు? అంటాడు. భక్తుల్లేకపోతే దేవుణ్ణి కొలిచేదెవరు? కార్యకర్త లేకపోతే సంస్థ మనుగడ కూడా అంతే! లక్షల అస్తులున్న సంస్థలు కూడా నిస్తేజం అయిన సందర్భాలున్నాయి. కారణం కార్యకర్తల బలం లేకపోవటమే! మళ్ళీ కార్యకర్తలతో జవసత్వాలు పుంజుకున్నవీ ఉన్నాయి.

అంతర్జాతీయ సేవా సంస్థలు మీ కొంత సమయాన్ని, మీ కొంత మేధాశక్తిని, మీ కొంచెం ధనాన్ని వెచ్చించి సమాజ సేవ చేయాలని సూచిస్తుంటాయి. ఇది సుబ్బారావుకి నచ్చని విషయం. ఎప్పుడో ఒకసారి హలో చెప్పి వెళ్ళి పోయేవాడు స్నేహితుడు కాలేడు. ఎప్పుడో తోచినప్పుడు ఓ సలహా ఇచ్చి ఊరుకునేవాడు ఎంత మేధావి అయినా ప్రయోజనం ఉండదు. చిన్న చిన్న కార్యక్రమాలకు చిన్నచిన్న దాతృత్వాలు చేసే వారివల్ల సాహితీ సంస్థలకు ఒరిగేదేమీ ఉండదు. జయంతులకూ వర్ధంతులకూ, గ్రంథావిష్కరణలకూ పరిమితమయ్యే సంస్థల నుండి మనం ఆశించేదేం ఉంటుంది?

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

2007 మొదటి ప్రపంచ తెలుగు రచయితల మహాసభల సమయంలో బుద్ధప్రసాద్ గారు, లక్ష్మీప్రసాద్ గారు, కుక్కలనాగేశ్వరరావు గారూ, సుబ్బారావు, నేనూ, ఇంకా కొందరు కార్యకర్తలం ఒకరోజు మధ్యాహ్నం విజయవాడ జిల్లాపరిషత్ గెస్ట్ హౌసులో కూర్చున్నాం. కుక్కల నాగేశ్వరరావుగారు కృష్ణాజిల్లాపరిషత్ అధ్యక్షులుగా ఉన్న సమయం అది! అందరమూ చాలా అందోళనలో ఉన్నాం. నిధుల సమస్యతో సభలు జరపగలమా లేదా అనేదే మీమాంస. సభల తేదీలు దగ్గరకొచ్చేస్తున్నాయి.

ఆహ్వానపత్రం అచ్చుకాలేదు. అచ్చు వేయించేందుకు డబ్బులున్నాయి. కానీ, సభలు వాయిదా వేయాల్సివస్తే ఆ అచ్చుకూడా దండగే అవుతుందని అలా ఆపాం.

భోజనాల ఖర్చు ఎవరైనా స్పాన్సర్ చేసినా ఎలాగోలా సభలు పూర్తి చేయ వచ్చు. ఎవరూ రాలేదు కేంద్రీయ భాషా కేంద్రం వారు అతిథులకు దారిఖర్చులు భరించే విషయమై ఇంకా నిర్ణయం ప్రకటించలేదు. డా॥ ప్రభాకర్ ఆ పనిమీదే ఉన్నానని, ప్రయత్నిస్తున్నానని ఫోన్లో తెలిపాడు. అవుతుందో లేదో తెలీదు. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీతల నెవరినైనా పిలిస్తే ఇద్దరు ముగ్గురి దారి ఖర్చులు భరిస్తాం అని అకాడెమీ వారన్నారు. వారి నుండి వచ్చే సహకారం అంతే! దేశం నలుమూలల నుండీ మేం ఇంతమందిమి వస్తున్నాం అంతమందిమి వస్తున్నాం అంటూ ఫోన్లు వస్తున్నాయి. మూడురోజుల సభలు, 2 వేలమందికి ఆరు పూటల భోజనాలు, కాఫీ టిఫిన్లు ఏర్పాటు చేయాలి. అతిథులకు వసతులు కల్పించాలి. దారిఖర్చులు, రవాణాఖర్చులు ఇవన్నీ ఎలా?

బుద్ధప్రసాద్ గారు స్థితప్రజ్ఞులు. ఆయన ఎవరెవరితోనో మాట్లాడుతున్నారు గానీ ఫలితం కనిపించినట్టు లేదు. పైకి ఏమీ చెప్పకుండా చిద్విలాసం చేశారే తప్ప ఏ సూచనా చేయలేదు. లక్ష్మీప్రసాద్ గారు ఒకరిద్దరిని కదిలించి చూశారు. కె ఐ వర ప్రసాద రెడ్డిగారు వెంటనే స్పందించి 50 వేలకు చెక్కు పంపించారు. విజ్ఞాన్ రత్తయ్య గారు లక్ష రూపాయల చెక్కు ఇచ్చారు. అంతకు మునుపు మేము వెళ్లి అడిగితే గుంటూరు బొమ్మిడాలవారు లక్షరూపాయలిచ్చారు. శేషశాయి కళ్యాణమంటపాన్ని బసవయ్యగారు ఉదారంగా ఇచ్చారు. కానీ కరెంటు ఖర్చే లక్షదాకా అయ్యేలా ఉంది. ఇతర ఖర్చులకు ఈ మొత్తం బాగానే సరిపోతుంది కాని, భోజనాలకు, వసతికీ, బ్యానర్లకు, ఇంకా ఇతరాలకు నిధులు సమకూరాలి.

"ఇక్కడి దాకా వచ్చాక వెనుకడుగు వేసేది లేదు. గొల్లపూడిలో స్థలం అమ్మేసి నేనే ఖర్చు మొత్తం పెట్టుకుంటాను" అన్నాడు సుబ్బారావు. స్పందనవాణి మాసపత్రిక విషయంలో ఇలాగే ఇల్లాలి మెడలో తాళి అమ్మటానికి ప్రయత్నించిన చరిత్ర సుబ్బారావుది. నేనే సుబ్బారావుని వారించాను. "పెద్దవాళ్లు ముగ్గురూ పై స్థాయిలో ఆలోచిస్తున్నారు కదా... అది కుదరకపోతే నువ్వొక్కడివే దేనికీ, మనందరమూ తలా కాస్తా వేసుకుందాం" అన్నాను.

కుక్కల నాగేశ్వర రావుగారు ప్రతినిధులందరికీ జ్ఞాపికల ఖర్చు భరిస్తానన్నారు. కొంత ఉపశమనం. మరి భోజనాల సంగతి?

లక్ష్మీప్రసాద్ గారికి అకస్మాత్తుగా ఆపద్బాంధవుడెవరో గుర్తుకొచ్చినట్టున్నాడు... ఒక్కసారి లేచి మన యంపీ లగడపాటికి చేస్తాను అంటూ ఫోన్ చేసి, "బ్రదరూ, బుద్ధప్రసాద్ గారు మాట్లాడతారు" అంటూ ఫోన్ ఆయనకిచ్చి అడగమని సైగ చేశారు.

లక్ష్మీప్రసాద్ గారు మాట్లాడేప్పుడు 'విల్ యు ప్లీజ్' అన్నట్టు ఉండదు. 'నేను చెప్తున్నాను నువ్వు చెయ్యాలి' అన్నట్టుంటుంది. అలా తను అనగలిగే వాళ్లనే ఆయన అడుగుతారు.

బుద్ధప్రసాద్ గారి విధానం వేరు. ఆయన నోరు తెరిచి అడగరు. అడక్కుండానే అవతలి వ్యక్తి అర్థం చేసుకునేలా మహాసభల విషయం, ఆర్థిక కష్టాలు చెప్పి ఊరుకున్నారు. విజయవాడ పార్లమెంటు సభ్యులుగా ఉన్న లగడపాటి రాజగోపాల్ గారికి విషయం అర్థం అయ్యింది. ఆయన తిరిగి లక్ష్మీప్రసాద్ గారికి ఫోన్ చేసి తన సహకారం ఏదైనా కావాలంటే చేస్తానన్నారు.

'భోజనాల ఏర్పాట్ల భారం మీది' అన్నారు లక్ష్మీప్రసాద్ గారు. అలా ఆ సమస్య పరిష్కారం అయ్యింది.

నేను వెంటనే జేబులోంచి సెల్‌ఫోన్ తీస్తుంటే, సుబ్బారావు 'ఎవరికి ఫోను?' అన్నాడు.

విశ్వా టైప్ ఇన్‌స్టిట్యూటుకి. ఆహ్వానాలు ప్రింట్ చేసెయ్యమని చెప్పటానికి... ప్రధాన సమస్య తీరిందిగా, మిగతావి అవే సమకూరతాయి. అంతగా కాకపోతే ఎటు తిరిగీ మన కమిట్‌మెంట్ ఉంది కదా... తలా కాస్తా వేసుకుందాం" అంటూ లేచాను. "మంత్రిగారూ... మనిద్దరం ఈ ఒక్కరోజు పరకాయ ప్రవేశం చేద్దాం" అని లక్ష్మీప్రసాద్ గారు నవ్వారు. దానికి బుద్ధప్రసాద్ గారు తన సహజమైన చిద్విలాసం చేసి, 'అందరినీ అలా బేలగా అడగాల్సిన అవసరం ఉండదు' అన్నారు. అయన స్ట్రేటజీ వేరు.

రచయితల పాదయాత్ర

కృష్ణాజిల్లా రచయితల సంఘం పక్షాన ఏ కార్యక్రమం చేసినా భాషోద్యమానికి ప్రయోజనం చేకూరేదిగా ఉండాలనేది మా కమిట్‌మెంట్. ఒక విధంగా ఆ నిబద్ధతని మా బుర్రకెక్కించింది లక్ష్మీప్రసాద్ గారే! భాషోద్యమ సేనానిగా బుద్ధప్రసాద్ గారు రాష్ట్రం అంతా భాషా చైతన్యం రగిలిస్తుంటే లక్ష్మీప్రసాద్ గారు కృష్ణాజిల్లా రచయితలసంఘాన్ని భాషోద్యమానికి ఒక చిరునామాగా చేయాలని సంకల్పించారు. భాషంటే అన్నపానాలు కూడా లేకుండా పనిచేయటానికి సుబ్బారావూ నేనూ సర్వ సన్నద్ధమే ఎప్పుడూ!

గుడివాడలో మా కోశాధికారి తాతా రమేశ్ బాబు కృష్ణాజిల్లా రచయితల సంఘం సమావేశం ఏర్పాటు చేశాడు. ఆ సభకు లక్ష్మీప్రసాద్ గారు ముఖ్య అతిథి. ఆయన దూరప్రాంతం నుండి రోడ్డుమార్గాన రావలసి ఉండటంతో కొద్ది ఆలస్యంగా వస్తానన్నారు. అందాకా కవిసమ్మేళనం ప్రారంభించాం. ఆ రోజు సభలో కృష్ణాపత్రిక సంపాదకులు పిరాట్ల వెంకటేశ్వర్లు గారూ ఉన్నారు. ఆయన వచ్చేశారు. కొద్దిసేపటికే

లక్ష్మీప్రసాద్ గారూ వచ్చారు. కవిసమ్మేళనం అయ్యేవరకూ విరామం దొరికింది. లక్ష్మీప్రసాద్ గారు సభలో వెనకాల వరుసకు నన్నూ సుబ్బారావునూ తీసుకువెళ్ళి ఏకాంతంగా మాట్లాడారు.

"మన చుట్టుపక్కల ఇంకా ఏ ఏ జిల్లాల్లో రచయితల సంఘాలున్నాయి?" అనడిగా రాయన. గుంటూరు జిల్లా రచయితల సంఘం కొత్తగా ఏర్పడింది. ప్రకాశం, నెల్లూరు జిల్లా రచయితల సంఘాలు చాలా కాలంగా పనిచేస్తున్నాయి" అని చెప్పాం "అందరూ మిత్రులే! మనం ఏదైనా ప్రతిపాదిస్తే వారు తప్పక అంగీకరిస్తారను కుంటాము, మాట్లాడి చూద్దాము"అన్నాం.

"ఈ 2007 డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారి శతజయంతి సంవత్సరం. ఆయన కార్యక్షేత్రం నెల్లూరు. ఆయన మచిలీపట్టణం ఆంధ్ర జాతీయ కళాశాలలో చదువుకున్నారు. కాబట్టి, మచిలీపట్టణం నుండి నెల్లూరుదాకా ఈ నాలుగు జిల్లాల్లోనూ రచయితల పాదయాత్ర జరుపుదాం" అన్నారు లక్ష్మీప్రసాద్ గారు. " పూర్తి పాదయాత్ర అంటే ఎక్కువమంది రచయితలకు ఎంతమందికి ఓపిక ఉంటుందో చెప్పలేం. రచయిత్రులు కూడా ఉంటారు కదా! అందుకని రెండు బస్సులు పెడదాం. కేసినేని వాళ్లతో మాట్లాడాను. వాళ్లు సరే అన్నారు. ఎంపిక చేసిన ఊళ్లలో పాదయాత్ర చేస్తూ బస్సుల్లోనే వెడదాం" అన్నారు.

ఆ కార్యక్రమాన్ని సుబ్బారావూ నేనూ సమన్వయం చేశాం. మూడురోజుల యాత్ర, దాదాపు 150 మందికి పైగా పాల్గొన్నారు. కొందరు స్వంతకార్లలో అనుసరించారు. ప్లకార్డులు తయారు చేయించి బస్సుల్లో వేసుకుని బయల్దేరాం. బందరు, పెడన, ముదినేపల్లి, ఉయ్యూరు, విజయవాడ, మంగళగిరి, వడ్లమూడి, గుంటూరు, తెనాలి, కారంచేడు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరులలో పాదయాత్రలు జరిగాయి. మాన్యశ్రీ వెంకయ్యనాయుడు గారు తమ నెల్లూరు స్వర్ణభారతి ట్రస్టులో విందు ఏర్పాటు చేసి, పాల్గొన్న రచయితలందరికీ జ్ఞాపికలు బహూకరించారు. లక్ష్మీ ప్రసాద్ గారి ప్రణాళికా రచన ఎంత పగడ్బందీగా ఉంటుందో ఈ కార్యక్రమం మాకు సుబోధకం చేసింది.

సంతృప్తి మా విజయ రహస్యం

"ప్రతిఫలాపేక్ష రహితంగా ఉన్న కార్యకర్తే స్వేచ్ఛగా పనిచేయగలుగుతాడనే నమ్మకం మా ఇద్దరిది. ఐదుపర్యాయాలు ప్రపంచ మహాసభలు ఇంకా అనేక సాహిత్య కార్యక్రమాలు చేసినందువలన మా వ్యక్తిగత వృత్తి వ్యాపారాల్లో కలిగిన నష్టాల సంగతి అలా ఉంచితే, పొందిన లాభం మాత్రం ఆత్మతృప్తే! తృప్తి వలన మాకు మేము energise అయ్యాం అని మాత్రం చెప్పగలను.

"ప్రతిఫలాన్ని ఆశించని వాళ్ళు ఎవరినీ లెక్క చేయాల్సిన అవసరం లేదు" అని సుబ్బారావు అనేది అందుకే! కొంతమందిని చూస్తుంటాం ఎవ్వరో ఎక్కడో సభ పెట్టుకుంటే తనను పిలవలేదని, ఎవరో ఎవరికో ఓ పురస్కారం ఇస్తుంటే తనకివ్వలేదనీ... ఇలా లోపల్లోపలే కుమిలిపోయే వ్యక్తులు మనసికంగా అనారోగ్యాన్నితెచ్చుకొని బీపీ పెంచుకోవటమే అవుతుంది.

కుందుర్తి, విహారి, గుత్తికొండ, పూర్ణచందు... ఇలా మా గురుశిష్య పరంపరలో అందరమూ తృప్తి అనే నావమీద ప్రయాణించే వాళ్లమే! మాకు రావలసిన గుర్తింపుల్లో ఏమీ మిగిల్లేవను కుంటాం. చాలా మంది అంటుంటారు. మీరు హైదరాబాద్ లో ఉండి ఉంటే ఇంతకన్నా అద్భుతాలు చేసి ఉండేవారని. మనం ఎక్కడ ఉంటే అక్కడే మన బాగ్యనగరం. మన ప్రతిభ, మన నిబద్ధత, మన నిజాయితీలే మన ప్రతిష్ఠకు దారిదీపాలు గానీ, అధికారంలో ఉన్నవారికి అందుబాటులో ఉండటం ఒక్కటే కొలబద్ద కాదు. ప్రతిఫలాపేక్ష రహిత సేవ, నిజాయితీతో కూడిన విధేయత మన అభ్యున్నతికి కారణమౌతాయని మా ఇద్దరి ప్రగాఢ నమ్మకం.

"మన మంచితనాన్ని, వినయాన్ని, సీదాసాదాగా కనిపించటాన్ని మన బలహీనతగానో చేతకాని తనంగానో అనుకునే వాళ్ళు మన వ్యక్తిత్వాన్ని తక్కువ అంచనా వేసుకునే వాళ్ళు మన నుండి ఎక్కువ గౌరవాన్ని ఆశిస్తారు. మనంవాళ్లని లెక్కచేయకపోతే అది మన పొగరు అనుకుంటారు. పొగరే లేకపోతే ఇంత ఉత్పాదకత ఎక్కడిది. టెంపర్ అనే ఇంగ్లీషు పదానిక్కూడా ఇదే అర్థం ఉంది. కార్యనిర్వహణా దక్షుడికి టెంపరే అందం. తెంపరి అంటే తెలుగులో సాహసం అని. అలాంటి తెంపరితనం కూడా మా కందమే!

అణకువగా ఉండటాన్ని ఒక లోకువగా తీసుకున్న వ్యక్తులపట్ల సుబ్బారావు తీవ్రంగా స్పందించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అలాంటి పోకడలు గల వ్యక్తులు సంస్థల్లో నాయకత్వం పొందాలని ప్రయత్నిస్తే ముందే వాళ్లని గమనించాలి. ఆ మనిషి సెంట్రిస్టు అనిపించినట్టయితే, అతని పట్ల మన విధేయతలను మార్చుకోవటం అవసరం కూడా!

డచ్చికోటలో సభ

సుబ్బారావుగాని, నేనుగానీ గురువులుగా గౌరవించే వ్యక్తులంతా సాహితీ సంస్థల నిర్మాణ, నిర్వహణా దక్షులు. మా అణకువ కూడా అలాంటి వారికే! ముఖ్యంగా కుందుర్తి ప్రభావం మాపైన మరీ ఎక్కువ. కుందుర్తి లాంటి ఉద్యమ నాయకుడు అరుదుగా కనిపిస్తారు. కుందుర్తి తరువాత అంతటి అణకువని మేం ప్రదర్శించింది

బుద్ధప్రసాద్ గారి విషయంలోనే. ఆయన నాయకత్వ సరణి గాంధేయమార్గాన ఉంటుంది. అసలైన నాయకుడు ఎలా ఉంటాడో ఆయనలో మేం చాలా సార్లు గమనించాం. చాలా ప్రభావితులయ్యాం కూడా! గౌరవిస్తూ గౌరవించబడే నాయకుడాయన.

బుద్ధప్రసాద్ గారిలో కార్యకర్తని ఎందుకు అభిమానిస్తామో ఒక ఉదాహరణ చెప్పాలి. మచిలీపట్టణం డచ్చికోటలో "కృష్ణాజిల్లా చారిత్రక వైభవం" సదస్సు జరుపుతున్నాం. అది భారతీయ సర్వేక్షణ సంస్థ (ASI) వారితో కలిసి నిర్వహిస్తున్న సదస్సు. ఇంకో గంటకు ప్రారంభ సభ మొదలవ్వాలి. డచ్చి రాయబారి వచ్చి ఈ సభలను ప్రా్రంభిస్తారు. డచ్చికోట పేరుకి కోటగానీ అక్కడ ఏమీ లేదు, విశాలమైన ప్రాంగణం ఉంది. మేము 500 మంది ప్రతినిధులకు ఏర్పాట్లు చేశాం. పెద్దపెద్ద సర్కస్ డేరాలాంటి షామియానా పందిళ్ళు వేసి కూలర్లు చేర్పాటు చేశాం. ఉదయం 9-30కే దాదాపు సగం మంది వచ్చేశారు.

సూపర్ సక్సెస్ ఈ సభలు అనుకుంటూ ఉండగా, అంతలో ఎక్కడినుండి వచ్చిందో చుర్రున కొరడా దెబ్బలు తగిలేట్టు పెద్దపెద్ద చినుకులతో వాన, టార్నెడో లాంటి సుడిగాలి ఏకమై కళ్లు మూసి కళ్లు తెరిచే లోపు సభాస్థలి మొత్తాన్ని ముంచెత్తేసింది. సుబ్బారావు అందరినీ షామియానాల కిందనుండి బైటకొచ్చేయమని అరిచాడు. ముసలీ ముతకా అంతా ఖాళీస్థలంలోకి వచ్చేశారు. మొత్తం తడిసి ముద్దయిపోయాం. అవి నెత్తిన కూలితే ప్రాణాలు దక్కే సమస్య లేదు. మొత్తం మీద అందరినీ బైటకు లక్కొచ్చేశాం. పరిస్థితిని బుద్ధప్రసాద్ గారికి ఫోన్లో చెప్పాము. ఆయన ప్రత్యామ్నాయంగా జిల్లాపరిషత్ మీటింగ్ హాలుకి సభని మార్పు చేశారు.

మేం ఆటోలు పిలిచి ఇక్కడ ఉన్న అందరినీ అక్కడకు తరలించే పనిలో పడ్డాం ఒక గంటసేపు వానతో యుద్ధం చేసినంత పనయ్యింది. అందర్నీ తీసుకుని జిల్లా పరిషత్ హాలుకి వచ్చేసరికి కుర్చీ వేసుకుని ఎక్కి స్టేజీ బ్యానర్ కడ్తూ ఓ తెల్లబట్టలాయన కనిపించారు. ఆయన కూడా వానకు తడిసి పోయారు. ఆయన ఎవరో కాదు, సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి, మా గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ గారు. కార్యకర్తృత్వంలో ఆయన ముందు ఓడిపోయాం అనిపించిందా క్షణాన. అధికారం ఉందనో, ధనం ఉన్నదనో కాదు ఇలాంటి చొరవ, ఇంతటి నిబద్ధత, అంతకు మించిన అంకితభావం ఉంటే ఎంతైనా మోకరిల్ల గలుగుతాం! ఇంకేముందీ...? ప్రెస్సు ఫొటోగ్రాఫర్ల కెమేరాలు క్లిక్కు మన్నాయి. మర్నాడు ఉదయం బ్యానర్లు కడుతున్న మంత్రిగారి ఫోటో వార్తాపత్రికలలో బ్యానర్ అయ్యింది.

ఈ కథకో కొసమెరుపు ఉంది. మా సభను చెడగొట్టడానికే వచ్చిందా వాన. గంట తరువాత వానకురిసిన జాడ కూడా లేదు. విపరీతమైన ఎండకాసింది. రెండవరోజు సభ జరుపుకోవటానికి అంతా పొడిపొడిగా ఉండటంతో కూలిపోయిన షామియానాల్ని నిలబెట్టి మర్నాడు సదస్సులన్నీ దచ్చి కోటలోనే జరిపాం. మాట నిలబెట్టుకున్నాం.

సంస్థలో చేరితే నాకేంటి?

నిర్ణయాలు తీసుకునేప్పుడు సుబ్బారావు చాలా పట్టుదలతో ఉంటాడు. సభ జరిగినంత సేపూ దీక్షలో ఉన్నవాడిలా కనిపిస్తారు. చాలా మంది తెల్సిన వాళ్ళు ఆ సమయంలో ఆయన్ని పలకరించరు కూడా! ఏ నిర్ణయాన్నైనా ఒక సమష్టి సూత్రం ఆధారంగానే ఎవరైనా తీసుకోవాల్సిందే! ఆ సమష్టి సూత్రాన్ని కాదని చేయగలిగింది కూడా ఉండదు.

ఒకసారి ఒక రచయిత "కృష్ణాజిల్లా రచయితల సంఘంలో చేరాలను కుంటూన్నానండీ, చేరితే మాకు లాభం ఏమిటండీ?" అని అడిగాడు. దానికి నిర్మొహ మాటంగా సుబ్బారావు చెప్పిన సమాధానం, "మీరు ఈ సంస్థలో భాగస్వామి అవుతారు. ఈ సంస్థ నిర్వహించే కార్యాలలో పాల్పంచుకుంటారు. వాటికోసం కార్యకర్తగా మీ సమయాన్ని, మీ మేధాశక్తినీ, మీ జేబు డబ్బునీ ఖర్చుపెడుతుంటారు. రచయితల సంఘాల్లో సభ్యత్వం అనేది మీరు కార్యకర్తగా పనిచేయటానికే గానీ, మీకు ఎవరో ప్రయోజనాలు చేకూర్చి పెట్టడానికి కాదు" అని! సుబ్బారావు సమాధానాలెప్పుడు ఇంత నిర్మొహమాటంగా, కత్తితో కోసినట్టుగా ఉంటాయి. కానీ, ఆయన మాటలోని నిజాయితీ అవతలి వ్యక్తిని ఆకట్టుకుంటుంది.

రచయితలకు రచయితల సంఘం ఏ విధంగా ఉపయోగపడ్తుంది? అనేది కూడా మంచి ప్రశ్నే! రచయితలే స్వయంగా ఒక సంఘంగా ఏర్పడి సాహిత్య ప్రయోజనం నేరవేర్చటం సాహితీ సంస్థల పరమ ప్రయోజనం. 'సాహిత్య ప్రయోజనం' ఎంత ముఖ్యమో 'సభాప్రయోజనం' కూడా అంతే ముఖ్యం. నలుగురు గుమికూడే ప్రతి చోటా సభలు చేసి సందేశాలను ప్రచారం చేయవచ్చు. కానీ, సాహిత్య సభలు పెట్టకూడదు. సాహిత్య సభ అంటే ధర్మాన్ని చర్చించే సభ, ఆ సభకు ఆహ్వానించబడిన అధికారులూ, యమ్మేల్యేలూ, మంత్రులను బట్టి కాక, ఆ సభకు విచ్చేసిన సభాసదుల స్థాయిని బట్టి సభ ఔన్నత్యం తూకం వేయబడుతుంది. సభకు సభాసదుల నాణ్యత ముఖ్యం. ఎందుకంటే చెప్పేవారికీ వినేవారికీ సిద్ధాంత ఐక్యత ఏర్పడినప్పుడు కలిగే మానసిక తాదాత్మ్యత ఆ సభ విజయానికి ఒక గుర్తుగా మిగులుతుంది. సుబ్బారావు చెప్పే పాఠాలలో ఇది ముఖ్యమైంది కూడా!

మా ఇద్దరికీ ప్రేరకులు

1980ల తరువాత ఎక్కడికెళ్లినా సుబ్బారావు నన్ను కూడా వెంట తీసుకెళ్లే వాడు. ఎంతో మందితో ఆత్మీయ పరిచయాలయ్యాయి. కొందరితో స్నేహం మమ్మల్ని ఉత్తేజితుల్ని చేసింది కూడా!

గుంటూరులో డా॥ పరుచూరి రాజారామ్ గారిని ఈ వరుసలో మొదటగా చెప్పుకోవాలి. ఆయన మా ఇద్దర్నీ సమాదరించారు. ఆయన మేడమీద ప్రతీరోజు అర్థరాత్రి దాకా మిత్రబృందం సమావేశాలు జరిగేవి. ఆచార్య మైనేని కేశవ దుర్గా ప్రసాద్, రెంటాల హనుమత్ ప్రసాద్, వల్లూరు శివప్రసాద్, పెనుగొండ లక్ష్మీ నారాయణ వీళ్లంతా రాజారామ్ మేడ సభాసదులే! సాయంత్రం రైలెక్కి గుంటూరు వెళ్లి నేనూ ఆ సభల్లో పాల్గొనేవాణ్ణి. ఆయన రాసిన 'మబ్బు విడిచిన వెన్నెల', 'జపమాల' నవలలకు నేను సహకరించాను కూడా!

నేను ఆసుపత్రి పెట్టుకోవటానికి ముందు కొన్నాళ్లు రాజారామ్ గారి దగ్గర అప్రెంటీస్ చేశాను. ప్రాక్టీసులో చెయ్యకూడనివి (Don't's) ముందుగా ఆయన నాకు చాలా నేర్పారు. నా ఆసుపత్రికి సుశ్రుత క్లినిక్ అని ఆయనే పేరుపెట్టారు. నా కాంతిస్వప్న కవితాసంపుటిని ఆయనే ఆవిష్కరించారు. 1982 ఏప్రిల్, 4వ తేదీన నా ఆసుపత్రిని డా॥ రాజారామ్ గారు, సుబ్బారావు ప్రారంభించారు. నిజానికి అది ఆసుపత్రి ప్రారంభ సభలా జరగలేదు, సాహిత్య సభలా జరిగింది. ఎక్కడెక్కణ్ణుంచో రచయితలు అనేకమంది వచ్చారు.

సుబ్బారావూ, నేనూ "తెలుగు సాహితీసంస్థల సమన్వయ సమాఖ్య" ఏర్పాటు చేయటం కోసం 1982లో విజయవాడలో ఒక సభ జరిపాం. ఆ సంస్థ రూపొందటానికి డా॥ రాజారామ్ గారు ఎంతో సహకరించారు. రాజారామ్ గారున్నారంటే అక్కడ పెనుగొండ లక్ష్మీనారాయణ ఉన్నట్టే లెక్క. రాజారామ్ గారు లేకపోయినా, పెనుగొండ రూపంలో ఆయన మాతో ఉన్నట్టే!

మాకు ప్రేరణ నిచ్చిన వ్యక్తుల్లో ప్రముఖంగా చెప్పుకోదగిన వ్యక్తి శ్రీమతి డి. సుజాతా దేవి. ఆమె, డోకల నారాయణరావుగారూ మా ఇద్దరినీ ఎంతగానో ప్రోత్సహించారు. అనేక సందర్భాల్లో మాకు అండగా నిలబడ్డారు. సుబ్బారావు, సుజాతా దేవి, నేను ఎక్కడకు వెళ్లినా కలిసే వెళ్ళేవాళ్లం వాళ్ల పిల్లలిద్దరూ నన్ను మావయ్యా అంటూ ఈ నాటికీ పిలుస్తారు. శీలావీర్రాజు గారితో కలిసి మేం ముగ్గురం రామప్ప దేవాలయ సందర్శన మాకు ఒక తీపి గుర్తు. నా 'అమలినశృంగారం' గ్రంథావిష్కరణ సభని సుజాతాదేవే నిర్వహించారు.

ఇంద్రగంటి జానకీబాలగారు మాకు మరో స్ఫూర్తిప్రదాత. ఆమె అధ్యక్షురాలిగా, నేను కార్యదర్శిగా విజయసాహితి సంస్థ ఏర్పడనున్నట్టు సుబ్బారావే స్పందనవాణి పత్రికలో వెనకపేజీలో ఒక add ఇచ్చాడు. అలా ఏర్పడిన 'విజయసాహితి' ద్వారా దాదాపు వందకు పైగా మినీకవితా ప్రదర్శనలు ఏర్పాటు చేయగలిగాము.

శ్రీయుతులు తెన్నేటి హేమలత, సి. వేదవతి, రావి రంగారావు, నాగభైరవ, యమ్వీయల్, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, నండూరి రామ మోహనరావు, స్వాతి బలరామ్, డా॥ పెళ్లకూరి జయప్రద, పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి, కొర్రపాటి గంగాధరరావు వీళ్లంతా మాకు వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్స హించారు. కీ.శే. తాతా రమేష్ బాబు ఆది నుండీ మాతో నడిచిన సాహితీ వేత్త,

కృష్ణాజిల్లారచయితల సంఘం పునరుద్ధరణ తరువాత ఈనాటివరకూ మేము ఆధారపడదగిన కార్యకర్త శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి. ఆమె, శర్మగారు, వాళ్లమ్మాయి శ్రీదేవీ ఈ సంస్థతో మమేకమై పనిచేశారు. సుందరిగారికి అప్పగించేస్తే ఇంక ఆ విషయం గురించి మరిచిపోవచ్చు నన్నంత శ్రద్ధగా ఆమె పనిచేశారు.

శ్రీమతి కరెడ్ల సుశీల గారు సమాజ సేవా కార్యకర్త. ట్రేడ్ యూనియనిష్టు. మహిళా ఉద్యమనాయకురాలు. ఆమె అన్నపూర్ణ వృద్ధుల సేవాశ్రమాన్ని స్థాపించారు. ఆమె సుబ్బారావు కుటుంబానికి ముఖ్యంగా రమక్కకు బాగా సన్నిహితురాలు. అంకుల్ ఆంటీ అంటూ ఆ కుటుంబంతో కలిసిపోయారు. ఆమె ప్రస్తుతం కృష్ణాజిల్లా రచయితల సంఘం కార్యదర్శులలో ఒకరు కూడా! ఆమె నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రమక్క భవన నిర్మాణం చేసి ఇచ్చింది. సుబ్బారావు దాని కార్యదర్శిగా ఆ సంస్థను నిర్వహిస్తున్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం కూడా ఈ ఆశ్రమానికి తమవంతు సహకారం అందించింది. నాకు గుర్తున్నంతవరకూ ఒకప్పుడు సుబ్బారావు కార్యదర్శిగా ఉండ టానికే ఎక్కువ ఇష్టపడేవాడు. ఇప్పుడు అతను అధ్యక్షుడిగానే సమస్తకార్యాల్నీ నడిపిస్తున్నాడు. ఇప్పటికీ కార్యదర్శిగా పనిచేస్తోంది ఈ వృద్ధాశ్రమనికే!

మా సంస్థలో మరో పెద్దాయన శ్రీ తిరుక్కోవళ్ళూరు శోభనాద్రిగారు. చిన్నయసూరి ద్విశతాబ్ది ఉత్సవాలకు ఆయనే సంధానకర్త. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చిన్నయసూరి విగ్రహావిష్కరణ ఆయన పూనికవలనే సాధ్యం అయ్యింది.

నడుస్తున్న చరిత్ర, అమ్మనుడి పత్రికలద్వారా, తెలుగు భాషోద్యమ సమాఖ్య ద్వారా డా॥ సామలరమేష్ బాబు, తదితరుల కృషికి సంఘీబావం ప్రకటించాము. మా కార్యక్రమాలకు ఆయన తోడ్పాటు మరువలేనిది.

మేథోపరమైన సహకారం మాకు ఎక్కువగా శ్రీయుతులు భవిష్య, డా॥ గుమ్మా సాంబశివరావు, డా॥ వెన్నా వల్లభరావు, డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్,

డా॥ గుడిసేవ విష్ణుప్రసాద్, శ్రీమతి పుట్టి నాగలక్ష్మి. డా॥ వై. శ్రీలత గార్లనుండి లభించింది. చింతపల్లి వెంకటనారాయణ, పొన్నాడ సత్యప్రకాష్, నవులూరి రమేష్ బాబు, సిరిపురపు అన్నపూర్ణ. శిఖా ఆకాష్, ఎస్. కె. డి ప్రసాదరావు, రఘునందన్, గోళ్ళ నారాయణరావు, గబ్బిట దుర్గాప్రసాద్, శ్రీ దామెర్ల నరసింహారావు, మాదిరాజు శివలక్ష్మి, కీ.శే. అజ్మీర్ వీరభద్రయ్య లాంటి ఎందరో సాహితీ మిత్రులు ఉన్నారనే నమ్మకంతోనే మేం కార్యక్రమాలను సంకల్పించే వాళ్లం.

ప్రాచీనతాహోదా సాధన

తమిళానికి మొదటగా వెయ్యి సంవత్సరాల ప్రాచీనత కలిగిన భాషగా గుర్తింపు ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. ఆ విధంగా స్వయంగా కేంద్రమే నిప్పు రాజేసింది. తమ సంగతేమిటని తెలుగు కన్నడ భాషాభిమానులు తీవ్రంగా స్పందించారు.

ఇదిలా ఉండగా, ప్రాచీన బాషల్లో సంస్కృతానికి ఇవ్వకుండా తమిళాని కివ్వటం ఏమిటని నాలిక్కరచుకుని 1500 సంవత్సరాల ప్రాచీనత కలిగిన భాషగా సంస్కృతాన్ని గుర్తించారు. వెనకో ముందో గీర్వాణానికీ కొంత న్యాయం జరిగిందని సరిపెట్టుకున్నాం. కానీ, భారతదేశంలో అత్యంత ప్రాచీన భాషలు అనేకం ఉన్నాయి. వాటికి న్యాయం ఎప్పుడు చేస్తారనే ప్రశ్నకు కేంద్రం దగ్గర సమాధానం లేదు. కారణం రాజకీయ ప్రయోజనం లేకపోవటమే!

తెలుగు కన్నడ ప్రాంతాల్లో ప్రాచీనతా హోదా కోసం ఆందోళనలు ఉధృతం అయ్యాయి. అదే సమయంలో తెలుగు, కన్నడాలకు ఇవ్వకూడదంటూ మద్రాస్ హైకోర్టులో ఒక వ్యాజ్యం దాఖలయ్యింది. ఆచార్య భద్రిరాజుకృష్ణమూర్తిగారి అధ్యక్షతన ఏర్పడిన ఉన్నత స్థాయి కమిటీయే వెయ్యేళ్ల ప్రాచీనత కలిగిన భాషగా తమిళాన్ని గుర్తించింది. తమిళేతరుడైన భద్రిరాజువారి అధ్యక్షతన ఈ హోదా ప్రకటన జరిగింది. ఇప్పుడు అదే తెలుగువాడు తెలుగు భాషకి ఎలా హోదా ప్రకటిస్తాడు? అనేది వాళ్లు లేవనెత్తిన ప్రముఖమైన అభ్యంతరం. ఆయన అంతర్జాతీయ భాషావేత్త అని, భారతదేశం గర్వించే ప్రముఖుడని, ఆయనే తమ భాషకు కేవలం వెయ్యేళ్ళ ప్రాచీనతకే ప్రాచీనహోదా ఇచ్చాడనీ ఆ వ్యాజ్యం వేసినాయన మరిచాడు. అదలా ఉండగా, అనేక రాజకీయ ఒత్తిళ్లు కేంద్రం మీద కొంత ఫలించాయి. కన్నడం వాడైన వీరప్ప మొయిలీగారు కేంద్రంలో కీలకస్థానంలో ఉండడం లాంటి సౌలభ్యాలు కలిసొచ్చాయి. 2008 అక్టోబర్ 31న ఆనాటి కేంద్ర మంత్రి అంబికా సోనీ గారు తెలుగు కన్నడ భాషలకు ప్రాచీనతా హోదాని ప్రకటించారు.

నిజానికి, ఇది హోదా ఇచ్చిన ప్రకటన కాదు. మద్రాస్ హైకోర్టులో కేసు తేలిన తరువాతే అమల్లోకి వస్తుందనే షరతుతో కూడిన ప్రకటన. మద్రాస్ హైకోర్టులో

వ్యాజ్యాన్ని ఏళ్ల తరబడీ కొనసాగించటం వ్యాజ్యం వేసిన వారి వ్యూహం. తెలుగు భాషకు క్లాసికల్ హోదా రావటానికి ఈ కేసు పెద్ద అడ్డంకిగానే మారింది.

2009లో ఈ చెన్నై హైకోర్టు కేసుని కొట్టేయవలసిందిగా సుప్రీంకోర్టులో దావా వేసేందుకు కన్నడ భాష పక్షాన కన్నడ ఫిలిండెవలప్‌మెంట్ కార్పోరేషన్ వారు సిద్ధం అయ్యారు. తెలుగు తరఫున అధికారభాషా సంఘం చైర్మన్‌గా ఉన్న ఎ.బి.కె ప్రసాద్ గారిని వాళ్లు సంప్రదించారు. తెలుగు కన్నడం కలిసి సుప్రీంకు వెడితే కేసు బలంగా ఉంటుందని భావించిన ఎ.బి.కెగారు "మీరుకూడా కలిసొస్తే బావుంటుంది" అన్నారు మాతో! కృష్ణాజిల్లా రచయితల సంఘం పక్షాన సుప్రీంకోర్టుకు వెడితే, తెలుగు భాషోద్యమమే సుప్రీంకోర్టుకు వెళ్లినట్టవుతుందని మేము కూడా భావించాము. బుద్ధప్రసాద్ గారు కూడా సరే నన్నారు

ఇలాంటి విషయాల్లో క్షణమాలస్యం చేయటం అనేది సుబ్బారావు నైజంలో లేదు. వెంటనే జేబులోంచి డబ్బు తీసి కోర్టు ఖర్చుల కింద సుబ్బారావే చెల్లించాడు. కేసు కొన్నాళ్లు నడిచింది. చివరికి "మద్రాస్ హైకోర్టు తీర్పు మీకు వ్యతిరేకంగా వస్తే అప్పుడు సుప్రీంకోర్టుకు రండి" అని సుప్రీం కోర్టులో తీర్పు వెలువడింది

సుప్రీంకోర్టు తీర్పు వచ్చేనాటికి ప్రభుత్వం మారిపోయి, రోశయ్యగారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. అధికారభాషా సంఘం అనేదే లేదు. మద్రాస్ హైకోర్టులో ఈ కేసు విషయమై బలంగా వాదన వినిపించేందుకు మనమే సమాయత్తం కావలసిన అవసరం అప్పుడు ఏర్పడింది. ఎంతఖర్చుకైనా వెనకాడకుండా మద్రాస్ హైకోర్టు కేసులో ఇంప్లీడ్ అవుదామన్నాడు సుబ్బారావు. ముఖ్యమంత్రిగారితో మాట్లాడాక నిర్ణయం తీసుకుందామన్నారు బుద్ధప్రసాద్ గారు. తాను మాట్లాడి ఏ సంగతీ చెప్తానన్నారు.

ఈ లోగా సుప్రీంకోర్టు కేసు వివరాలు, మద్రాస్ కోర్టు వివరాలను జత చేస్తూ ముఖ్యమంత్రిగారికి ఒక లేఖ వ్రాయమని చెప్పారు. మద్రాస్ కోర్టులో కేసు పరిష్కరించే దిశగా ప్రభుత్వపరంగా గట్టి చర్యలు తీసుకోవలసిందని రచయితల సంఘం పక్షాన లేఖ తయారు చేశాము. ముఖ్యమంత్రి కార్యాలయం ఫ్యాక్స్ నెంబరుకు అన్ని వివరాలతోపాటుగా ఆ లేఖను ఫ్యాక్స్ చేశాను.

రెండు రోజుల తరువాత ముఖ్యమంత్రిగారు మద్రాస్ కేసుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, గట్టి న్యాయవాదిని ప్రభుత్వమే ఏర్పరస్తుందని ప్రకటించారు. "మనం ఈ కేసులో ఇంప్లీడ్ అవనవసరంలేదు, ప్రభుత్వం గట్టిగానే వ్యవహరిస్తోంది" అని మా మద్రాస్ ప్రయాణ ప్రయత్నాన్ని బుద్ధప్రసాద్ గారు ఆపారు. 2012లో చెన్నై హైకోర్టు మనకి తీర్పు అనుకూలంగా ఇవ్వటంతో తెలుగు, కన్నడ భాషలకు అధికారికంగా ప్రాచీనతా హోదా వచ్చినట్టయ్యింది.

ప్రభుత్వం ఏదైనా విషయం మీద గట్టి పట్టుపట్టాలంటే రెండు అంశాలు సమకూరాలి. అధికారంలో ఉన్నవారికి బుర్రలో నాటేలా చెప్పేవారు కావాలి. సంబంధిత వర్గాలవారు గట్టిగా కోరుతున్నారనే విషయం- వారి దృష్టిలోకి వెళ్ళాలి. బుద్ధప్రసాద్ గారు ఈ రెండు బాధ్యతలూ సక్రమంగా నెరవేర్చ గలిగారు. ఎ.బి.కె ప్రసాద్ గారు తన పదవి ఆఖరి రోజు వరకూ మాతో ఈ విషయమై చర్చిస్తూనే ఉన్నారు.

భాషా సంస్కృతుల పరిరక్షణ

2017లో ప్రభుత్వానికి భాషావిధానం ఒకటి ఉండాలని కోరుతూ నాటి ముఖ్యమంత్రికి సుబ్బరావూ నేనూ ఒక లేఖ రాశాము. భాషోద్యమంలో సన్నిహితంగా పనిచేసిన అనుభవమూ పలు పర్యాయాలు ప్రపంచ తెలుగు రచయితల మహా సభల సందర్భంలో అనేక మంది భాషాభిమానం కలిగిన రచయితలతో జరిపిన చర్చల పర్యవసానంగా కొన్ని అభిప్రాయాలను అందులో వ్యక్తపరిచాము. "తెలుగు భాషా సాంస్కృతిక శాఖకు ఒక నిర్దేశిత క్యాలెండరు ఉండాలి. ప్రభుత్వాలు మారినా అధికారులు మారినా జనవరి 26, ఆగస్టు 15 మాదిరిగా విధిగా ఆ కార్యక్రమాలు చేసే విధానం అమల్లోకి రావాలి. ప్రభుత్వాల భాషా విధానాలతో సంబంధం లేకుండా ఇవి జరిగిపోవాలి. పాలనలో తెలుగు అమలు జరగనప్పుడు శిక్షించే విధానం ఉండాలి. అప్పుడే అధికారుల కన్ను తెలుగు అక్షరాల మీదకు వెడ్తుంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రభుత్వ యంత్రాంగం మారదు కాబట్టి, భాషా సంస్కృతుల పరిరక్షణ కొనసాగుతుంది" అని సుబ్బారావు నేనూ విన్నవించాము.

తెలుగు భాషకు ప్రాచీనతాహోదా సాధన విషయంలో కలిసిరాని విశ్వ విద్యాలయాలు, ఆ హోదా సాధించాక పరిశోధనల కోసం వచ్చిన నిధుల వినియోగం మీద కూడా దృష్టిపెట్టకపోవటం విచిత్రం. మనతోపాటుగా ప్రాచీనతా హోదా సాధించుకున్న కన్నడం వారు కన్నడ పరిశోధనల కోసం ఏ విధంగా స్పందిస్తున్నారో మనవాళ్లకి పట్టలేదు. మన తరువాత చాలా కాలానికి ప్రాచీనతా హోదా సాధించిన మళయాళం వారు చేస్తోన్న కృషిని బుద్ధప్రసాద్ గారితో కలిసి కేరళ వారి సాంస్కృతిక రాజధాని త్రిస్సూరు వెళ్ళి కళ్లారా చూశాము. మనకు చీమ కుట్టినట్టయినా లేకపోవటాన్ని తలచుకుంటే దుఃఖం వస్తుంది.

కృష్ణావిశ్వవిద్యాలయంతో కలిసి తెలుగు మాండలికాలపై ఒక సదస్సుని 2010లో జరిపాము. ఆ సదస్సులో "వృత్తి పరంగాను, ఆహార పరంగానూ, సంస్కృతి పరంగానూ ఉన్న అనేకమాండలికాల గురించి ప్రస్తావించాము. వృత్తి మాండలికాల నిఘంటువులున్నాయి. కానీ తక్కిన రెండింటి మీదా ఎలాంటి కృషీ

జరగలేదు. ఆహార మాండలికాల గురించి అధ్యయనం చేస్తే పెద్ద సమాచారమే దొరుకుతుంది. అలాగే సంస్కృతి పరమైన అంశాలు కూడా ఎన్నో ఉన్నాయి. మాండలి కాలంటే ఉమ్మడి రాష్ట్రంలోని 23 జిల్లాలకే పరిమితం కాకూడదు. తమిళనాడు, కర్ణాటక, ఒరియా, మహరాష్ట్ర, ఛత్తీస్ఘర్ ప్రాంతాల్లో నివసించే తెలుగు ప్రజల భాషా పదాలను కూడా ఒక చోట చేర్చి సర్వ సమగ్రమైన నిఘంటువు తయారీకి ఇప్పటికైనా పూనుకోకపోతే, వాటికి సరైన ఆంగ్లపదాలను కంప్యూటర్లో చేర్చకపోతే యాంత్రిక అనువాదంలో మనం ఏ మాత్రం ప్రగతి సాధించలేం" అని మా వాదనని గట్టిగా వినిపించాము.

2007లోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తెలుగు భాషను ఆధునీకరించే అంశంపైన, తెలుగు యూనీకోడ్ లిపిని అభివృద్ధి చేయటం పైన కృష్ణాజిల్లా రచయితల సంఘం ఒక జాతీయ సదస్సు నిర్వహించింది. బుద్ధప్రసాద్, లక్ష్మీప్రసాద్, కూచిభట్ల ఆనంద్ త్రయం చొరవతో ప్రధమ తెలుగు అంతర్జాల అంతర్జాతీయ సదస్సు సిలికాన్ వ్యాలీలో జరిగింది. యూనీకోడ్ కన్సార్టియంలో మనం పూర్తి స్థాయి సభ్యత్వం కూడా తీసుకున్నాము. కానీ, ఆ తరువాత భాషని ఆధునీకరించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఇప్పుడు కంప్యూటర్లో తెలుగు అప్పటి కృషివలన వచ్చిందే! కొత్తగా ఒనగూరిందేమీ లేదు.

2007 డిసెంబర్ 2న 'న్యాయస్థానాలలో తెలుగు అమలు' అనే విషయం మీద ఒక జాతీయ సదస్సు నిర్వహించాము. న్యాయమూర్తులు శ్రీ జింబో, శ్రీ సుబ్రహ్మణ్యం, న్యాయవేత్త శ్రీ మాడభూషి శ్రీధర్, న్యాయవాది శ్రీ కర్నాటి రామమోహనరావు ప్రభృతులు పాల్గొన్నారు. తెలుగులోనే తీర్పు లివ్వాలనే ఆలోచనని న్యాయమూర్తులకు కలిగించటం ఈ సదస్సు లక్ష్యం. ఈ సదస్సులో ఒక సైన్సు రచయితగా సాంకేతిక పదాలను తెలుగు చేయటానికి ఎక్కువ శ్రమపడవద్దనీ, సాంకేతిక పదాలను యథాతథంగా వాడుతూ వాటి వివరణ కోసం అనుసంధాన భాషగా తెలుగును వినియోగించటానికి ప్రత్నించవచ్చని, మొదట అనుసంధాన భాషతో ప్రారంభిస్తే, వాడకంలోకి వచ్చే కొద్దీ సాంకేతిక పదాలక్కూడా కాలక్రమంలో తెలుగు అలవాటౌతుందని సూచించాము. కోర్టుల పరిధిలో రోజుకో సాంకేతిక పదానికి తెలుగు అర్థాన్ని బోర్డుమీద రాయటం వలన న్యాయవాదులకు కోర్టుకు వచ్చేవారిక్కూడా పదజాలం అర్థం అవుతుందన్నాము.

తెలుగే ప్రాచీనం పేరుతో సదస్సు జరిపి, పుస్తకం వెలువరించి, ద్రావిడ భాషల్లో తెలుగే ప్రాచీన బాష అనటానికి చాలినన్ని ఉపపత్తులిచ్చి భాషా పరిశోధకులకు

ప్రేరణ నిచ్చాము. ప్రాచీనతా హోదా సాధనలో కృష్ణాజిల్లా రచయితల సంఘం పాత్ర ముఖ్యమైంది.

2008 మార్చిలో చిన్నయసూరి ద్విశతాబ్ది జయంత్యుత్సవాలు నిర్వహించాము. చిన్నయ సూరి నీతిచంద్రికలో ఆయన ఎన్నో మరుగున పడిన పదాలు వెలికి తీసి పరిచయం చేశాడనీ, వాటినన్నింటినీ నిఘంటువుల్లోకి ఎక్కించే ప్రయత్నం జరగాలని కోరాము

2009 జనవరి 24, 25 తేదీలలో రాష్ట్రంలోని పురావస్తు శాస్త్రవేత్తలు అనేకమందిని ఆహ్వానించి సింధు-కృష్ణా లోయల నాగరికతల తులనాత్మక అధ్యయన సదస్సుని ద్రావిడ విశ్వవిద్యాలయం, సహకారంతో విజయవాడలో నిర్వహించాము. సింధు నాగరికతకు సమాంతరంగా తెలుగునేల పైన కూడా జనావాసాలు ఉండేవని అంగీకరిస్తున్నపరిశోధకులకు ఆ సంస్కృతిని తెలుగు సంస్కృతిగా ప్రకటించవలసిన అవసరాన్ని గుర్తుచేశాము.

2010లో ఎమెస్కో వారి సహకారంతో తెలుగు మణిదీపాలు అనే 1200 పేజీల ఉద్గ్రంథాన్ని ప్రచురించి వివిధ రంగాలలో ప్రసిద్ధులైన 70 మంది జీవిత చరిత్రలను సంకలితం చేశాము

2010లోనే ఉత్తర అమెరికా తెలుగు సంస్థ 'తానా' వారితో కలిసి తరతరాల తెలుగు సంస్కృతి పైన స్ఫూర్తిదాయకమైన సదస్సు నిర్వహించాము.

సరిగ్గా ఈ ముగింపు వాక్యాలు రాస్తున్న సమయంలో మా కార్యాలయానికి బుద్ధప్రసాద్ గారు వచ్చారు. సోమసుందర్ గారి శతజయంతి చేద్దాం అన్నారు. మొన్నమొన్నటిదాకా మన మధ్యే తిరిగిన పూర్ణాయుష్కుడు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్. అప్పటికప్పుడు నవంబర్ 18వ తేదీన సభకు ఏర్పాటు చేశాము.

"ఎంతమంది వస్తారోనని మనకి ఆలోచన దేనికి? గంగిగోవు పాలు గరిటెడైన చాలు కదా! మనపని మనం చేసుకుపోవాలి అంతే!" అన్నారు. కొన్ని వాక్యాలు వేద వాక్కుల్లాంటివి. వాటికి ప్రభావం ఉంటుంది.

ఈ చెప్పినవన్నీ స్థాలీపులాకంగా చెప్పుకోదగిన మెతుకు పరిక్షలే. చేసేందుకు మనసు, ఓపిక, నిర్ణాయక శక్తీ ఇంకా ఉన్నాయి. కానీ, ఏ రచయితల కోసం కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రాకులాడుతోందో ఆ రచయితల స్పందన మరింత ఘనంగా ఉంటే బావుంటుంది.

సభాసరస్వతికి వందనం.

◆ ◆ ◆

PARUVU - Dr. G.V. Purnachand



పరువంటే వేగం, ప్రతిష్ఠ, పరిపక్వత అని! సాహితీ సంస్థల నిర్వహణలో ఈ మూడింటి ప్రాముఖ్యతని చాటి చెప్పిన గ్రంథం ఈ 'పరువు'.

45 యేళ్ల నాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ కార్యవర్గ సభ్యుడు కుందుర్తి, సినారె ప్రభృతుల అనుయాయి, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, భాషోద్యమ క్రియాశీలి, శ్రీ గుత్తికొండ సుబ్బారావుతో కలిసి పూర్ణచందు సాగించిన సాహితీయానం కథ ఈ 'పరువు'.

ప్రముఖ సాహితీవేత్త, తెలుగు భాషోద్యమ ప్రముఖుడు, తెలుగుభాష మూలాలపై విశేష పరిశోధనాంశాలను వెలికి తెచ్చిన పరిశోధకుడు, తెలుగువారి ఆహార చరిత్రవేత్త, శతాధిక గ్రంథకర్త, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణాధ్యక్షుడు, ఉద్యమశీలి, డా॥ జి.వి.పూర్ణచందు అవలోకన ఈ 'పరువు'.

ఇది కృష్ణాజిల్లా రచయితల సంఘమే వ్రాసుకున్న తన కథ కూడా! కృష్ణాజిల్లా రచయితల సంఘంతో ముడిపడి సాగిన సుబ్బారావు, పూర్ణచందుల సాహితీ యానానికి (1973-2023) స్వర్ణోత్సవం ఈ పుస్తకానికి సందర్భం.

శ్రీమతి గుత్తికొండ రామరత్నం చారిటబుల్ ట్రస్ట్ ప్రచురణ